www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 8-4-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 353 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: ఏకాదశి రా.9.14 తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఆశ్లేష ఉ.7.55 తదుపరి మఖ, వర్జ్యం: రా.8.56-రా.10.40, దుర్ముహూర్తం: ఉ.8.35-9.24, రా.10.15-రా.11.00, అమృతఘడియలు: ఉ.6.13-7.55, రాహుకాలం: మ.3.21-4.54, సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వంట గ్యాస్ మంట

గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50 పెంపు

ఉజ్వల వినియోగదారులకూ వర్తింపు.. నేటి నుంచి అమల్లోకి

లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకం పెంపు

కానీ ఇంధనాల రిటైల్ ధరలు పెరగవు: కేంద్రం



2

మహా పతనం!

ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావంతో ప్రపంచ మార్కెట్లు ధమాల్

వాల్ స్ట్రీట్ నుంచి దలాల్ స్ట్రీట్ దాకా రక్తపాతమే

ఓ దశలో 5 శాతం పతనమైన భారత సూచీలు

ఇంట్రాడేలో సెన్సెక్స్ 3,939 పాయింట్ల పతనం

2,226 పాయింట్ల నష్టంతో 73,137 వద్ద క్లోజ్

అదే బాటలో నిఫ్టీ.. 742.85 పాయింట్ల నష్టం

క్షణాల్లో రూ.20 లక్షల కోట్ల సంపద ఆవిరి

ట్రేడింగ్ ముగిసేసరికి రూ.14 లక్షల కోట్ల నష్టం

భారీగా నష్టపోయిన ప్రపంచ మార్కెట్లు

బ్రహ్మాండంగా ఉంది.. ద్రవ్యోల్బణమే లేదు!

చమురు ధరలు, వడ్డీ రేట్లు తగ్గాయి: ట్రంప్

ప్రతీకార సుంకాన్ని ఉపసంహరించకపోతే

చైనాపై 50% అదనపు సుంకం

ఒక్కరోజే గడువు.. అమెరికా అధ్యక్షుడి హెచ్చరిక

వడ్డీ రేట్ల తగ్గింపే అసలు వ్యూహం

అందుకే మాంద్యం కోసం ట్రంప్ ప్రయత్నాలు!



ట్రంప్ సుంకాల దెబ్బకు ప్రపంచ మార్కెట్లు కుదేలైపోయాయి. జపాన్ మొదలు.. అమెరికా దాకా.. అన్ని మార్కెట్లు దారుణంగా పతనమయ్యాయి. వాల్ స్ట్రీట్ మొదలు.. దలాల్‌స్ట్రీట్ వరకు మార్కెట్లన్నీ 'బేర్' మన్నాయి. రక్తపాతం జరిగిందా? అన్నట్లుగా 'బ్లాక్ మండే' రోజున సూచీలన్నీ ఎరుపెక్కాయి. అమ్మకాల హోరుతో సెన్సెక్స్ సోమవారం ఓ దశలో 5%(3,939 పాయింట్లు) వరకు నష్టపోయింది. ట్రేడింగ్ చివర్లో వాల్యూ బైయింగ్ కొనుగోళ్లతో 1,700 పాయింట్ల వరకు కోలుకుని 3%(2,226 పాయింట్లు) నష్టంతో 73,137.90 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 742 పాయింట్ల నష్టంతో రూ.22,161 పాయింట్ల వద్ద క్లోజైంది. మార్కెట్ల భారీ పతనంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ క్యాప్ సోమవారం ఒక్కరోజే రూ.14.09 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.389.25 లక్షల కోట్లకు చేరింది. మార్కెట్ ప్రారంభంలో ఈ నష్టం రూ.20లక్షల కోట్లుగా ఉండగా.. మార్కెట్ క్లోజింగ్ సమయానికి కొంత కోలుకుంది. గడిచిన పది నెలల్లో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఒక్క రోజులో ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే మొదటిసారి. ఇక ప్రపంచ మార్కెట్లు కూడా ఘోరమైన నష్టాలను చవిచూశాయి. హాంకాంగ్ మార్కెట్లు 13.6% నష్టపోయాయి. ఈ కోవలో వరుసగా తైవాన్(9.6%), జపాన్(9.5%), ఇటలీ(8.4%), సింగపూర్(8%) మార్కెట్లూ పతనమయ్యాయి. స్వీడన్, చైనా, స్విట్జర్లాండ్ సూచీలకు కూడా 7% మేర నష్టం వాటిల్లింది.

మరింత కిందికే..!

మార్కెట్ల పతనం మంగళవారం కూడా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. చైనా తన 34% శాతం ప్రతీకార సుంకాలను వెనక్కి తీసుకోకపోతే ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాలను ప్రస్తుత 34 నుంచి 50 శాతానికి పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా

మిగతా 2వ పేజీలో...



వెంటాడుతున్న వ్యాధులు

ఏపీలో ప్రజల ఆరోగ్యంపై సమగ్ర సర్వే

19.78 లక్షల మందికి బీపీ

11.13 లక్షల మందికి డయాబెటిస్

రెండూ ఉన్నవారు 20.78 లక్షలు

2,61,100 మందికి గుండె సమస్యలు

2 లక్షలకు పైగా క్యాన్సర్, కిడ్నీ రోగులు

18 ఏళ్లు దాటిన 2.15 కోట్ల మందికి స్క్రీనింగ్

భవిష్యత్ కార్యాచరణకు సన్నద్ధం

ప్రతి నియోజకవర్గంలో మల్టీ స్పెషాలిటీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వృద్ధిరేటులో ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే ప్రభుత్వం నిర్దేశించుకున్న 15 శాతం వృద్ధిరేటు సాధ్యమవుతుంది. విజన్-2047లో

మిగతా 11వ పేజీలో...

ఆరోగ్యాంధ్రే లక్ష్యం!

అమరావతిలో 200 ఎకరాల్లో మెగా మెడిసిటీ

ఖతార్ ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు

105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీలు


పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తాం

ఆరోగ్యశ్రీ కేసుల్లో 50 శాతం వాటికే

ఆరోగ్య వివరాలతో హెల్త్ డిజీ లాకర్

26 నెలల్లో వర్చువల్ ఆస్పత్రులు

జూన్ 15న కుప్పంలో పైలట్ ప్రాజెక్టు: చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాల వారీగా హెల్త్ రిపోర్టులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.19,264 కోట్లు ఖర్చు చేస్తున్నామని.. హెల్తీ, వెల్తీ,

మిగతా 11వ పేజీలో...

గుట్టుగా జబ్బులు

6

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బీపీ, షుగర్, ఫ్యాటీ లివర్

దీర్ఘకాల వ్యాధులున్నట్లు తెలియకుండానే జీవిస్తున్న లక్షల మంది

అపోలో 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదిక.. దేశవ్యాప్తంగా 25 లక్షల మందికి వైద్యపరీక్షలు

ఏపీలో లావైపోతున్నారు.. 63% మందికి ఊబకాయం.. మరో 18% మందిలో అధిక బరువు

26% మందికి హైబీపీ.. 24% మందికి మధుమేహం.. 74% మందిలో విటమిన్ డీ లోపం

48% మందికి ఫ్యాటీ లివర్.. అపోలో నివేదికలో ఆందోళనకర అంశాలు

11



కొత్త వక్ఫ్ చట్టంపై సత్వర విచారణకు

సుప్రీం అంగీకారం!

లిస్టింగ్ చేస్తామని చెప్పిన సీజేఐ

కొత్త వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధం

సమానత్వం, మతాన్ని అనుసరించే స్వేచ్ఛకు భంగం.. పిటిషనర్ల ఫిర్యాదు

2

ఏపీలో అణు జలాంతర్గామి స్థావరం!

అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో నేవీ ప్రత్యామ్నాయ బేస్

విశాఖ నుంచి 50కి.మీ. దూరంలో రహస్య కేంద్రం

2026లో ప్రారంభించేందుకు కేంద్రం ప్రణాళిక

ఐఎన్ఎస్ వర్షలో భాగంగా తూర్పుతీరంలో ఏర్పాటు

670 హెక్టార్ల అటవీ భూమి కేటాయింపు

3

అణు జలాంతర్గాములు, యుద్ధనౌకల కోసం నిర్మాణం

ఇక్కడ 12 సబ్‌మెరైన్లను డాక్ చేసుకునే అవకాశం

భూగర్భ సొరంగాలు, బంకర్లతో ఇన్నర్, ఔటర్ హార్బర్



నమూనా చిత్రం

గ్రామీణ బ్యాంకులు విలీనం

మే 1 నుంచి 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్'

11

బంగాళాఖాతంలో అల్పపీడనం

బలపడే అవకాశం లేదంటున్న నిపుణులు

రానున్న 3 రోజుల్లో పెరగనున్న ఎండలు

నేడు, రేపు పలుచోట్ల పిడుగులతో వానలు

3

ఏపీకి 750 ఎలక్ట్రిక్ బస్సులు

పీపీపీ పద్ధతిలో 'పీఎం ఈ-బస్ సేవ' కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు

12



12

వైసీపీకి పచ్చకామెర్ల రోగం తగ్గలేదు

అద్దంలో చూసుకుంటే ఇప్పటికీ చంద్రబాబే కనిపించడం బాధాకరం

ప్రజలు చెప్పుతో కొట్టినట్లు తీర్పిచ్చినా నీచపు చేష్టలు మారలేదు

నిజాలు జీర్ణించుకోలేని మీరు ఈ జన్మకు మారరని అర్థమైంది

ఐదేళ్లు మోదానీ సేవలో తరించారు: షర్మిల



ఆక్వా రంగంపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీలు లావు, బాలశౌరి, ఆక్వా రైతులు, అధికారులు

'ఆక్వా'పై కమిటీ

ప్రస్తుత సంక్షోభానికి పరిష్కారం

భవిష్యత్ ప్రణాళికపై సూచనలు

100 కౌంట్‌కు రూ.220 తగ్గకుండా కొనండి

సాగుకు ఫ్రెష్ వాటర్ ఇస్తాం: చంద్రబాబు

ఇతర దేశాలతో చర్చించేలా కేంద్రంతో మాట్లాడతా

ఆక్వా రంగ భాగస్వాములతో సీఎం సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగారు. అమరావతి సచివాలయంలో సోమవారం ఆక్వా రైతులు, ఆక్వా రంగ భాగస్వాములు, ఎగుమతిదారులు, అధికారులతో సీఎం చర్చించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అమెరికా సుంకాల కారణంగా నష్టపోయే ఆక్వా రైతులను

మిగతా 11వ పేజీలో...

సుంకాల భారాన్ని అధిగమిద్దాం

దేశీయంగా వినియోగం పెంచుదాం

ఆక్వా రైతు, సీడ్, ఫీడ్ తయారీదారుల సదస్సులో మంత్రి అచ్చెన్న

సముచిత ధర ఇచ్చేందుకు ఎగుమతిదారుల సమ్మతి!

సిండికేట్ దోపిడీకి చెక్ పెట్టాలి: ఆక్వా రైతుల రాస్తారోకో

తెలంగాణవన్నీ అభూతకల్పనలే!

బనకచర్ల ఇంకా ఆలోచన దశలోనే ఉంది.. గోదావరి బోర్డు భేటీలో ఏపీ స్పష్టీకరణ

కేంద్రం సూచనతో డీపీఆర్ తయారుచేస్తున్నాం.. అయినా రోజుకు 4 టీఎంసీలు తరలిస్తున్నామని ఊహాజనితంగా ఫిర్యాదు చేస్తారా?.. ప్రాజెక్టుపై గోప్యత ఉండదు

12

రోజుకు 2 టీఎంసీల చొప్పునే తీసుకుంటాం.. అది కూడా వంద రోజులే: ఈఎన్‌సీ

అడవి తల్లికి బాటలు!

డోలీ మోతల రహిత మన్యమే లక్ష్యం.. గిరిజన బిడ్డల మేలుకు కూటమి కట్టుబడింది

మాకు ఓట్లు వేయకపోయినా ప్రగతి చర్యలు

గిరిజన ప్రాంతాల్లో రోడ్లకు నిధులడిగితే 24 గంటల్లో 49 కోట్లు మంజూరుచేసిన సీఎం

వైసీపీ హయాంలో ఏపీలో కేవలం 92 కి.మీ.రోడ్లు

ఏడాదిలోనే 1,069 కి.మీ.రహదారులు నిర్మించాం

అరకులోయను పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తాం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి

'అడవితల్లి బాట'లో 373 రోడ్ల పనులకు అల్లూరి జిల్లా డుంబ్రిగుడలో శంకుస్థాపన



అల్లూరి సీతారామ రాజు జిల్లా డుంబ్రిగుడలో 'అడవి తల్లి బాట' కార్యక్రమ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ దినేశ్‌కుమార్ తదితరులు

డుంబ్రిగుడ/పాడేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతాన్ని డోలీమోతల రహితంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలో జరిగిన 'అడవితల్లి బాట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, నంద్యాల, కాకినాడ, ఏలూరు జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో రూ.1,005 కోట్లతో చేపట్టనున్న 373 రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. "రహదారులు లేక

మిగతా 12వ పేజీలో...



సోమవారం విచారణ అనంతరం ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వెళ్తున్న ప్రభావతి

తెలియదు.. గుర్తులేదు

రఘురామ కేసులో డాక్టర్ ప్రభావతి జవాబులు

ఒంగోలులో ప్రకాశం ఎస్పీ ఎదుట హాజరు

ఉదయం నుంచి రాత్రి 9 వరకు విచారణ

12

సహకరించని జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్!

వీర్య నిరోధక మాత్ర!

హార్మోన్ రహిత ట్యాబ్లెట్‌ను అభివృద్ధి చేసిన అమెరికన్ శాస్త్రజ్ఞులు

99% సామర్థ్యంతో పని చేస్తున్నట్టు ఎలుకలు, కోతులపై ప్రయోగాల్లో వెల్లడి

మనుషులపై తొలి దశ ట్రయల్స్ పూర్తి.. న్యూజిలాండ్‌లో 2వ దశ

ఈ దశాబ్దం చివరికి అందుబాటులోకి వచ్చే అవకాశం?



మీరు ప్రపంచంలో ఏ దేశానికైనా వెళ్లండి. గర్భనిరోధక మాత్రలంటే మహిళలు మాత్రమే వాడేవి దొరుకుతాయి. పురుషులు వాడే మాత్రలు ఎక్కడా దొరకవు. దాదాపు ఏడెనిమిది దశాబ్దాలుగా ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన శాస్త్రజ్ఞులు కృషి చేస్తున్నా

మిగతా 2వ పేజీలో...

మహా నగరాల్లో ఇలాంటివి మామూలే!

» మహిళలపై దాడుల పట్ల కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్



బెంగళూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులపై హోం మంత్రి పరమేశ్వర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అర్ధరాత్రి నడిచి వెళుతున్న అన్నాచెల్లెలిపై దాడి, ఆపై సోదరిపై అత్యాచారం, సుద్దగుంటపాళ్యలో నడిచి వెళుతున్న ఇద్దరు యువతుల పట్ల ఆకతాయి అసభ్య ప్రవర్తన గురించి మీడియా ప్రశ్నించగా.. బెంగళూరు వంటి మహా నగరాల్లో ఇలాంటి ఘటనలు సాధారణమని హోం మంత్రి అన్నారు. నగరంలో గస్తీ పెంచాల్సిందిగా పోలీసులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున సుద్దగుంటపాళ్య పరిధిలోని భారతి లే అవుట్‌లో ఇద్దరు యువతులు నడిచి వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఒక్కసారిగా యువతి పట్ల అనుచితంగా ప్రవర్తించాడని, ఈ సంఘటన సీసీ కెమెరాలో రికార్డు అయిందని ఆయన అన్నారు. బాధితురాలు ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. మరోవైపు.. పరమేశ్వర్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ఇది జరిగిన ఘటనను చిన్నదిగా చూపించే ప్రయత్నమని ఆ పార్టీ నేత షెహజాద్ పేర్కొన్నారు.

2026 కల్లా 12 భాషల్లో ఇంజనీరింగ్ పుస్తకాలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: అన్ని ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సుల పుస్తకాలను 12 ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రతిష్ఠాత్మక ప్రణాళికపై ఏఐసీటీఈ కసరత్తు వేగవంతం చేసింది. ఇందుకు 2026 డిసెంబరును డెడ్‌లైన్‌గా పెట్టుకుంది. ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సుల మొదటి, రెండవ సంవత్సరాల కోసం 600 పుస్తకాలు ఇప్పటికే సిద్ధమయ్యాయని, వాటిని తెలుగు సహా 12 ప్రాంతీయ భాషల్లో అప్‌లోడ్ చేశామని పేర్కొన్నారు. 3, 4 సంవత్సరాలకు సంబంధించిన అనువాద పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనువాద ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏఐసీటీఈ ఏఐని వినియోగిస్తోంది.

భారత్ సహా 14 దేశాలపై సౌదీ వీసా నిషేధం

రియాద్, ఏప్రిల్ 7: సౌదీ అరేబియా తన దేశానికి వచ్చే విదేశీ పర్యాటకులపై కొరడా ఝుళిపించింది. హజ్ యాత్ర త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత్‌తోపాటు 14 దేశాల ముస్లిం పౌరులకు వీసాల జారీపై నిషేధం విధించింది. ఆ జాబితాలో దాయాది పాకిస్థాన్‌తోపాటు మొరాకో, నైజీరియా, అల్జీరియా, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాక్, జోర్డాన్, సుడాన్, ట్యునీషియా, యెమెన్ ఉన్నాయి. వీరు తమ దేశాల కోటాతో సంబంధం లేకుండా అనధికారికంగా హజ్‌యాత్రలో పాల్గొనడంతోపాటు వీసా నిబంధనలను ఉల్లంఘించి ఎక్కువ కాలం బస చేస్తున్నారని సౌదీ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇజ్రాయెల్‌కు సాయం సిగ్గుచేటు

» మైక్రోసాఫ్ట్ కార్యక్రమంలో భారతీయ ఉద్యోగిని నిరసన


వనియా అగర్వాల్

వాషింగ్టన్, ఏప్రిల్ 7: మైక్రోసాఫ్ట్ అర్ధశత వార్షికోత్సవ కార్యక్రమంలో వనియా అగర్వాల్ అనే భారతీయ సంతతికి చెందిన ఆ కంపెనీ ఉద్యోగిని పాలస్తీనాకు అనుకూలంగా నిరసన తెలిపారు. 'సిగ్గుచేటు' అంటూ తీవ్ర స్వరం వినిపించారు. 'మీరు సంకుచిత మనుషులు. ఇజ్రాయెల్‌కు మైక్రోసాఫ్ట్ అందించిన సాంకేతికత కారణంగానే గాజాలో యాభై వేలమంది హతమయ్యారు. వాళ్ల రక్తంలో పండగ చేసుకోవడానికి ఎంత ధైర్యం? మిమ్మల్ని చూసి సిగ్గుపడుతున్నాను" అని అన్నారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సమక్షంలో వాషింగ్టన్‌లోని రెడ్‌మాండ్‌లో గత వారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో కంపెనీ సీఈవో సత్య నాదెళ్ల, మాజీ సీఈవో స్టీవ్ బాల్మేర్ వేదికపైనే ఉన్నారు. అక్కడ నుంచి బయటకురావడంతోనే, సంస్థను వీడుతున్నట్టు వనియా ప్రకటించారు. వనియా మైక్రోసాఫ్ట్‌లో 2023లో చేరారు. ప్రస్తుతం ఆ సంస్థ ఏఐ విభాగంలో ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సైన్యం గడిచిన నెల రోజుల వ్యవధిలో గాజాలో సగ భాగాన్ని అదుపులోకి తెచ్చుకుంది. దాదాపు 3కిలోమీటర్ల మేర గాజా భూభాగంలోకి చొచ్చుకుపోయింది.

ఎన్‌టీఏపై కేసును మూసివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్ పరీక్షల నిర్వహణపై నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం నీట్ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై నమోదైన కేసును మూసివేసింది. గత ఏడాది నీట్-యూజీ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో.. పకడ్బందీగా పరీక్ష నిర్వహణపై సిఫారసుల కోసం ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో కమిటీని కేంద్రం నియమించింది. తాజాగా, ఆ సిఫారసులను అమలు చేస్తామని కోర్టుకు తెలిపింది.

సీతమ్మ మెడలో మాంగల్యం కట్టిన ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షి

» శ్రీరామనవమి వేడుకల్లో అత్యుత్సాహం.. ఆనక క్షమాపణలు



కర్నూలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల సందర్భంగా కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అత్యుత్సాహం ప్రదర్శించారు. సీతారామ కల్యాణాన్ని పురస్కరించుకుని వేద పండితులు సీతమ్మవారి మెడలో కట్టవలసిన మాంగల్యాన్ని ఆయనే స్వయంగా కట్టేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్యే స్వగ్రామం చిప్పగిరిలోని కొండావీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే విరూపాక్షి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్యాణోత్సవంలో భాగంగా వేద పండింతులు శాస్త్రోక్తంగా మంత్రాలు చదువుతూ, సంప్రదాయబద్ధంగా శ్రీరాముడి చేతిలోని మాంగల్యాన్ని సీతమ్మ మెడలో కట్టి కల్యాణ క్రతువును పూర్తి చేస్తారు. అయితే, దీనికి విరుద్ధంగా ఎమ్మెల్యే విరూపాక్షి.. వేదపండితుడు ఇచ్చిన మాంగల్యాన్ని.. శ్రీరాముడికి చూపించి సీతమ్మ మెడలో మూడుముళ్లు వేశారు. ఈ వ్యవహారంపై హిందూ సంఘాలు మండిపడ్డాయి. ఇది మహాపచారమని, ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని విశ్వహిందు పరిషత్ నేత టి. ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాగా.. ఈ ఘటనపై ఎమ్మెల్యే విరూపాక్షి వివరణ ఇచ్చారు. వేద పండితుడు తనకు మాంగల్యం ఇచ్చి సీతమ్మ మెడలో కట్టమంటేనే కట్టానని, జరిగిన సంఘటన తప్పయితే హిందూ సమాజం తనను క్షమించాలని వేడుకున్నారు. తెలియక చేసిన తప్పని.. క్షమించమని కోరారు. తనకు దైవ భక్తి అమితమని పేర్కొన్న ఆయన.. 15 ఏళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే విరూపాక్షి సోమవారం ఓ వీడియోను విడుదల చేశారు.

మహా పతనం!

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్ పతనానికి ఇప్పట్లో విరామం ఉంటుందనే సూచనలు కనిపించడం లేదు. గత ఏడాది అక్టోబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో.. "కమల గెలిస్తే.. మార్కెట్లు ఎరుపెక్కుతాయి. 1926 నాటి మాంద్యం తిరిగి వస్తుంది" అని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే.! కమల గెలవకున్నా.. ట్రంప్ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించినా.. సుంకాల విధింపుతో మార్కెట్లు ఎరుపెక్కడం గమనార్హం.! మంగళవారం స్వల్పకాలానికి నిఫ్టీకి 21,700 దగ్గర గట్టి మద్దతు కనిపిస్తోందని, అది కూడా బ్రేకయితే 21,000 దిగువకు కూడా చేరే ప్రమాదం ఉందని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

వంట గ్యాస్ మంట



» ఉజ్వల వినియోగదారులకూ వర్తింపు

» నేటి నుంచి అమల్లోకి

» అంతర్జాతీయ మార్కెట్ ధరను బట్టి గ్యాస్ ధర పెంచామన్న కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను సోమవారం ఏకంగా రూ.50 మేర పెంచింది. ఈ పెంపు సాధారణ వినియోగదారులకే కాకుండా ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా వర్తిస్తుంది. కొత్త ధరలు మంగళవారం (8వ తేదీ) నుంచి అమల్లోకి వస్తాయని చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. తాజా పెంపుతో ఢిల్లీలో సాధారణ వినియోగదారులు సిలిండర్‌కు రూ.853 చెల్లించాల్సి ఉంటుంది. స్థానిక పన్నులను బట్టి ధరలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటాయి. ఇక హైదరాబాద్‌లో ప్రస్తుతం సాధారణ వినియోగదారులు సిలిండర్‌కు రూ.855 చెల్లిస్తుండగా.. పెరిగిన ధరతో ఇది రూ.905 అవుతుంది. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్‌లో 19 లక్షలు, ఉమ్మడి రంగారెడ్డిలో 12-13 లక్షల మంది గృహ ఎల్‌పీజీ వినియోగదారులున్నారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. అయితే ఈ పెంపు భారం వాహనదారులపై పడదని, ఇంధనాల రిటైల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదని ఆయిల్ కంపెనీలు పేర్కొన్నాయి. మన దేశంలో వార్షికంగా 16,000 కోట్ల లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను వినియోగిస్తున్నారు. ఈ ఇంధనాలపై రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం వల్ల కేంద్ర ఖజానాకు రూ.32,000 కోట్ల వరకు సమకూరనుంది. పెంచిన ఎక్సైజ్ సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయి.

ఎక్సైజ్ సుంకం పెంపుతో నష్టాల భర్తీ

ఎల్‌పీజీ ధరల నిర్ణయానికి వినియోగించే అంతర్జాతీయ బెంచ్‌మార్క్ అయిన సౌదీ సీపీ సగటు 2023 జూలైలో టన్నుకు 385 డాలర్లు ఉండగా.. 2025 ఫిబ్రవరిలో 629 డాలర్లకు పెరిగిందని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. 63 శాతం మేర పెరుగుదల నమోదైన ఫలితంగా ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధరను రూ.1,028.50గా నిర్ణయించాల్సిన అవసరం ఏర్పడినట్టు చెప్పారు. కానీ ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సర్దుబాటు చేస్తున్నాయని తెలిపారు. ఎల్‌పీజీని తక్కువ ధరకు విక్రయించడం వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ చమురు కంపెనీలు రూ.41,338 కోట్ల నష్టాన్ని చవిచూశాయని చెప్పారు. నష్టాలు కొండలా పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలను మోస్తరుగా పెంచినట్టు తెలిపారు. ప్రస్తుత ధరల వద్ద ఉజ్వల వినియోగదారుల వంటకు రోజుకు అయ్యే వ్యయం రూ.6.10 ఉండగా.. సాధారణ వినియోగదారులకైతే రూ.14.58 ఉంటోందని, ఇది సహేతుకమేనని ఆయన పేర్కొన్నారు.

15 నెలల్లో 9సార్లు పెంపు

11 ఏళ్ల మోదీ సర్కారు హయాంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పుడల్లా ఎక్సైజ్ సుంకాన్ని పెంచిన సందర్భాలున్నాయి. 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకు పెట్రోల్, డీజిల్‌పై తొమ్మిదిసార్లు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది.దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పుడు కలిగే ప్రయోజనాన్ని ప్రభుత్వమే పొందినట్టయింది. ఈ 15 నెలల్లో లీటరు పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.11.77, డీజిల్‌పై రూ.13.47 పెంచారు. దీంతో 2014-15లో రూ.99,000 కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయం 2016-17లో ఏకంగా రెండింతలకు పైగా పెరిగి రూ.2,42,000 కోట్లకు పెరిగింది. అయితే కేంద్రం 2017 అక్టోబరులో ఎక్సైజ్ సుంకాన్ని రూ.2, ఏడాది తర్వాత రూ.1.50మేర తగ్గించింది. కానీ 2019 జూలైలో లీటరుపై రూ.2 మేర ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. తర్వాత 2020 మార్చిలో లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. 2020 మార్చి, 2020 మే మధ్య లీటరు పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.16 మేర పెంచింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్రం గత ఏడాదిలో లీటరు పెట్రోల్, డీజిల్ ధరలను రూ.2 చొప్పున తగ్గించింది. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాలతో తాజాగా ముడిచమురు ధరలు దిగివస్తున్నా కేంద్రం మాత్రం ధరలను తగ్గించకపోవడంతో వాహనదారులకు ఊరట లభించడం లేదని పరిశీలకులు అంటున్నారు.

గాయాలపై కారం పూసినట్టుగా..: ఖర్గే

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం పెంచడం పట్ల కాంగ్రెస్ మండిపడింది. "వాహ్ మోదీ వాహ్!! 2014 మేతో పోల్చితే అంతర్జాతీయ మార్కెట్లో ఆయిల్ ధరలు 41% తగ్గాయి. ఇలాంటి తరుణంలో మీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించడానికి బదులు రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. టారిఫ్ విధానంపై కుంభకర్ణుడిలా నిద్రపోవడంవల్ల స్టాక్ మార్కెట్లో చిన్నా, పెద్దా ఇన్వెస్టర్లు రూ.19 లక్షల కోట్లు నష్టపోయినా సంతృప్తి చెందక.. మీ ప్రభుత్వం గాయాలపై కారం పూసింది" అని మండిపడ్డారు. మోదీ ఎక్సైజ్ సుంకం పెంపుతో టారిఫ్‌లకు తగిన సమాధానమిచ్చారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు.

లోకం తీరు



రాష్ట్ర ప్రజలపై 'సిలిండర్' భారం 78 కోట్లు

» ప్రజలపై గుది బండ: సీపీఎం

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండరు ధరను చమురు సంస్థలు ఒకేసారి రూ.50 పెంచేయడంతో రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ.78 కోట్ల మేరకు భారం పడనుంది. సాధారణ గ్యాస్ వినియోగదారులతోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద బీపీఎల్ కుటుంబాలకు రాయితీపై ఇస్తున్న గ్యాస్ సిలిండర్ల ధర కూడా రూ.50 పెరగడంతో నిరుపేదలకు ఇది భారంగా మారనుంది. పెరిగిన ధరలు మంగళవారం నుంచి అమల్లోకి రానుండడంతో ఇప్పటి వరకు రూ.803కు లభిస్తున్న వంట గ్యాస్ సిలిండరు ధర రూ.853కి చేరనుంది. కేంద్ర ప్రభుత్వ ఉజ్వల పథకం కింద రూ.500లకే లభిస్తున్న గ్యాస్ సిలిండరు ధర రూ.550కు పెరగనుంది. అయితే, ప్రాంతాలవారీగా రవాణా చార్జీలు, ఇతర ఖర్చులతో కలిపి ఈ ధర మరింత పెరిగే అవకాశముంది.

1.56 కోట్ల మందిపై భారం

రాష్ట్రంలో దాదాపు 1.56 కోట్ల కుటుంబాలు వంట గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నాయి. వీటిలో కేంద్రం అమలు చేస్తున్న ఉజ్వల పథకం కింద దాదాపు 10 లక్షల కుటుంబాలకు రూ.500లకే సిలిండర్ లభిస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 60 లక్షల బీపీఎల్ కుటుంబాలకు 'దీపం-2' పథకం కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తోంది. చమురు సంస్థలు గృహ వినియోగ సిలిండర్ల ధరను రూ.50 పెంచడంతో రాష్ట్రంలోని దాదాపు 1.56 కోట్ల మంది గ్యాస్ వినియోగదారులకు ఒక సిలిండరు చొప్పున లెక్కగట్టినా రూ.78 కోట్ల మేర భారం పడుతుంది. పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది.

అంతా బ్రహ్మాండంగా ఉంది!

» చమురు ధరలు, వడ్డీ రేట్లు తగ్గాయి.. అసలు ద్రవ్యోల్బణమే లేదు: ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 7: అమెరికా ప్రతీకార సుంకాల దెబ్బకు ఒకపక్క ప్రపంచమార్కెట్లన్నీ దారుణంగా పతనమై.. మదుపర్లకు రూ.లక్షల కోట్ల నష్టం వచ్చి 'బేర్'మంటున్నారు! మరోవైపు.. ఈ సుంకాల వల్ల వాణిజ్య యుద్ధం జరిగి, ధరలు పెరిగి ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచమంతా ఇంత కలవరపడుతున్నా.. ట్రంప్ మాత్రం 'అంతా బానే ఉంది' అంటూ తాపీగా తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్టు పెట్టారు. "చమురు ధరలు తగ్గాయి. వడ్డీరేట్లు తగ్గాయి. ఆహార ధరలు తగ్గాయి. అసలు ద్రవ్యోల్బణమే లేదు. అన్నింటికీ మించి.. దీర్ఘకాలంగా అమెరికాను మోసం చేస్తున్న దేశాల నుంచి సుంకాల రూపంలో గత వారంరోజులుగా బిలియన్ల కొద్దీ డాలర్లు వస్తున్నాయి" అని ఆ పోస్టులో ఆయన పేర్కొన్నారు. అందునా ఇన్నాళ్లుగా అమెరికాను అధిక సుంకాలతో దోచుకున్న చైనా మళ్లీ తన సుంకాలను 34 శాతం మేర అధికంగా పెంచిన తర్వాత కూడా అమెరికాకు ఇంత మంచి జరుగుతోందని పేర్కొన్నారు. అమెరికా మంచితనాన్ని అలుసుగా తీసుకుని చైనా దశాబ్దాలుగా ఇలా సుంకాలను దుర్వినియోగం చేస్తోందన్న ఆయన.. దీనికి కారణం గత పాలకులేనని విమర్శించారు.

ప్రతీకార సుంకాన్ని ఉపసంహరించకపోతే.. చైనాపై 50% అదనపు సుంకం



అమెరికా విధించిన ప్రతీకార సుంకానికి స్పందనగా.. తాము కూడా అమెరికన్ ఉత్పత్తుల దిగుమతులపై 34% సుంకం విధిస్తున్నట్టు చైనా చేసిన ప్రకటనపై ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "చైనా గనక తాజాగా మాపై విధించిన ఆ 34% అదనపు సుంకాన్ని మంగళవారంలోగా ఉపసంహరించుకోకుంటే.. చైనాపై బుధవారం నుంచి వర్తించేలా, ఇప్పుడున్నదానికి అదనంగా మరో 50% సుంకాన్ని అమెరికా విధిస్తుంది. అంతేకాదు.. మాతో చైనా అభ్యర్థన మేరకు ఆ దేశంతో చేస్తున్న చర్చలన్నింటినీ పూర్తిగా రద్దుచేస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు.

రిజర్వేషన్లపై 50% పరిమితి ఎత్తేస్తాం

పట్నాలో సంవిధాన్ సురక్ష సమ్మేళన్‌లో రాహుల్


పలాయన్ రోకో పాదయాత్రలో రాహుల్‌గాంధీ

పట్నా, ఏప్రిల్ 7: రిజర్వేషన్లపై 50% పరిమితి అనేది బూటకపు పరిమితి అని, దానిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సోమవారం బిహార్‌లోని పట్నాలో నిర్వహించిన 'సంవిధాన్ సురక్ష సమ్మేళన్'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల ప్రజలను దేశంలో రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని అన్నారు. వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం కలిగించేందుకు కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తుందని రాహుల్ పేర్కొన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం(కులగణన సర్వే) నిర్వహించిందని తెలిపారు. సంవిధాన్ సురక్ష సమ్మేళన్‌లో పాల్గొనడానికి ముందు రాహుల్ బెగుసరాయి జిల్లాలో కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'పారిపోకండి, ఉద్యోగాలు ఇవ్వండి(పలాయన్ రోకో, నౌకరీ దో)' పాదయాత్రలో పాల్గొన్నారు. బిహార్‌లో నిర్వహిస్తున్న వైట్ టీ షర్ట్ ఉద్యమంలో పాల్గొనాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ ఏడాది నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

నేడు, రేపు ఏఐసీసీ సమావేశాలు

జాతీయ రాజకీయాలకు సంబంధించిన కీలక అంశాలు, సవాళ్లపై చర్చించేందుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) మంగళ, బుధవారాల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సమావేశం కానుంది. జిల్లా అధ్యక్షులకు మరిన్ని అధికారాలు ఇవ్వడం, జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సహా పార్టీ సంస్థాగత పునరుజ్జీవనానికి సంబంధించిన అనేక కీలక తీర్మానాలను ఈ సమావేశాల్లో చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాలనూ ఈ సమావేశాలలో ఖరారు చేయనున్నారు. ఈ ఏడాది బిహార్, వచ్చే ఏడాది కేరళ, అసోం, బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగనున్నాయి. ఏఐసీసీ సమావేశాల్లో తొలిరోజు సర్దార్ పటేల్ స్మారకం వద్ద సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరుకానున్నారు.

బీజేపీకి రూ.2,243కోట్ల విరాళాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి విరాళాల వరద పోటెత్తింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ పార్టీకి ఏకంగా రూ.2,243 కోట్ల మేరకు విరాళాల రూపంలో నిధులు అందాయి. అన్ని జాతీయ పార్టీలకు కలిపి అందిన విరాళాల్లో 88% నిధులు ఒక్క బీజేపీ ఖాతాలోనే పడ్డాయి. 8,358 మంది నుంచి రూ.2,243 కోట్ల విరాళాలు కమలం పార్టీకి లభించాయి. వీరిలో 3,478 మంది కార్పొరేట్ దిగ్గజాలు, వ్యాపార వేత్తలే ఉండడం గమనార్హం. బీజేపీకి అందిన మొత్తం విరాళాల్లో వీరి వాటా రూ.2,262.55 కోట్లు కావడం విశేషం. ఇక, కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే రూ.281.48 కోట్లు మాత్రమే విరాళాల రూపంలో సమకూరాయి. ఈ ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం జాతీయ పార్టీలకు మొత్తం రూ.2544.28 కోట్లు విరాళాలుగా అందాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ బీజేపీకి రూ.723.675 కోట్లు విరాళంగా ఇచ్చింది. కాగా, కొన్ని కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన వివరాలను బీజేపీ దాచినట్టు ఏడీఆర్ పేర్కొంది.

కొత్త వక్ఫ్ చట్టంపై సత్వర విచారణకు సుప్రీం ఓకే!

లిస్టింగ్ చేస్తామని చెప్పిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సత్వరం వినేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం జమాత్ ఉలేమా ఇ హింద్ తరఫున న్యాయవాది కపిల్ సిబ్బల్, ఇతర పిటిషనర్ల తరుపున అభిషేక్ సింఘ్వీ, నిజామ్ పాషా మరికొందరు న్యాయవాదులు చేసిన లిఖిత పూర్వక విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని సత్వర విచారణ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, మతాన్ని అనుసరించే స్వేచ్ఛకు కొత్త చట్టంతో భంగం కలుగుతోందని జమాత్ ఉలేమా ఇ హింద్ తన పిటిషన్‌లో పేర్కొంది. ముస్లిములకు తమ మతాన్ని అనుసరించే హక్కును హరించే ప్రమాదకరమైన కుట్రగా కొత్త వక్ఫ్ చట్టాన్ని అభివర్ణించింది. కొత్త చట్టంతో వక్ఫ్ ఆస్తుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డులకు ఉన్న హక్కులన్నీ హరించుకు పోయాయని పేర్కొంది. వక్ఫ్‌లకు ఉన్న అనేక రక్షణలను కొత్త చట్టం తొలగించివేసిందని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లుకు శనివారం అర్ధరాత్రి రాష్ట్రపతి ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వం ఆ చట్టానికి సంబంధించి విధివిధానాలు రూపొందిస్తే అవి వెంటనే అమల్లోకి వస్తాయి. ఈ నేపథ్యంలోనే ముస్లిం సంస్థలు సత్వర విచారణ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఇదిలా ఉండగా, వక్ఫ్ వ్యవహారంపై మణిపూర్‌లో హింస చెలరేగింది. బీజేపీ మోర్చా అధ్యక్షుడు అస్కర్ అలీ ఇంటిని 7వేల మంది చుట్టుముట్టి నిప్పు పెట్టారు.

పిటిషనర్ల ప్రధాన అభ్యంతరాలు ఇవే

- ఎలాంటి కాగితాలు లేకుండా ఎంతోకాలంగా ముస్లిముల వినియోగంలో ఉన్న ఆస్తులు వక్ఫ్ ఆస్తులే అన్న అంశాన్ని చట్టంలో ఎత్తేశారు. దాంతో చాలా ఆస్తులు వివాదంలో పడే ప్రమాదం ఉంది. వక్ఫ్ బై యూజర్ అన్న విషయాన్ని బాబ్రీ మసీదు కేసులోనూ సుప్రీంకోర్టు అంగీకరించిందని పిటిషనర్లు గుర్తు చేశారు.
- వక్ఫ్ బోర్డుల నిర్వహణను చేపట్టే ప్రభుత్వ అధికారిగా సీఈవో ముస్లిం ఉండాలని పాత చట్టం చెబుతోంది. కొత్తచట్టం దాన్ని ఎత్తేసింది. కాగా, కొత్త వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లు ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగమని బీజేపీ వ్యాఖ్యానించింది. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న భూమాఫియా ప్రయోజనాలు మాత్రమే కొత్త చట్టంతో దెబ్బతిన్నాయని పేర్కొంది.

సుప్రీంకోర్టు చెప్పినా.. మీ ఉద్యోగాలు పోవు!

పశ్చిమ బెంగాల్‌లో సుప్రీం కోర్టు ఉత్తర్వులతో ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయులకు తానున్నానని ఆ రాష్ట్ర సీఎం మమత భరోసా ఇచ్చారు. ఆమె సోమవారం వారితో సమావేశమయ్యారు. కోర్టు నిర్ణయాన్ని తాము అంగీకరించామని భావించవద్దన్నారు. ఇలా చెప్పినందుకు తాను జైలు పాలయినా లెక్క చేయనని అన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. అయితే వారిలో అర్హులెవరు ఉద్యోగాలు కోల్పోరని, వారి సర్వీసులో బ్రేక్ కూడా ఉండదని మమత హామీ ఇచ్చారు.

వీర్య నిరోధక మాత్ర!

(మొదటి పేజీ తరువాయి)



'మేల్ బర్త్ కంట్రోల్ పిల్స్'ను మాత్రం అభివృద్ధి చేయలేకపోయారు. కానీ, యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా (అమెరికా)కు చెందిన శాస్త్రజ్ఞులు తాము ఆ అద్భుతాన్ని సాధించామని చెబుతున్నారు. కొలంబియా వర్సిటీ, శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన యువర్ చాయిస్ థెరప్యూటిక్స్ శాస్త్రజ్ఞులతో కలిసి వారు సంయుక్తంగా ఈ పరిశోధనలు జరిపి 'వైసీటీ-529' అనే 'హార్మోన్ రహిత గర్భనిరోధక మాత్ర'ను అభివృద్ధి చేశామని.. ఎలుకలపై, సైనోమోల్గస్ జాతి కోతులపై చేసిన పరిశోధనల్లో అది 99% ప్రభావవంతంగా పనిచేస్తున్నట్టు తేలిందని వారు వెల్లడించారు. వీర్యకణాల తయారీకి అత్యంత కీలకమైన విటమిన్ ఏను వృషణాలకు అందకుండా నిరోధిస్తుందని.. దానివల్ల వీర్యం ఉత్పత్తి ఆగిపోతుందని శాస్త్రజ్ఞులు వివరించారు. అదే సమయంలో ఈ మాత్ర టెస్టోస్టిరాన్ స్థాయిలపై మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపదని మిన్నెసోటా వర్సిటీ కెమిస్ట్, ఫార్మసిస్ట్ జార్జ్ తెలిపారు. కోతులు, ఎలుకలపై వారు చేసిన ప్రయోగాలకు సంబంధించిన ఫలితాల నివేదిక 'కమ్యూనికేషన్స్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమైంది. దాని ప్రకారం.. ఎలుకల్లో ఈ మందు నాలుగువారాల వినియోగం తర్వాత 99% సామర్థ్యంతో పనిచేయగా, కోతుల్లో రెండు వారాల వినియోగంతోనే వీర్యకణాల సంఖ్యను తగ్గించేసింది. మందు ఆపిన ఆరువారాల్లో ఎలుకల్లో మళ్లీ వీర్య కణాల సంఖ్య మునుపటి స్థితికి చేరుకోగా.. కోతుల్లో మాత్రం అందుకు 10 నుంచి 15 వారాలు పట్టింది. ఈ మందు వాడకం వల్ల రెండింటిలోనూ అతి తక్కువ దుష్ప్రభావాలు మాత్రమే కనిపించాయి. దీంతో మనుషులపై తొలి దశ ప్రయోగాలు నిర్వహించామని.. ఈ ఔషధం మానవ వినియోగానికి సురక్షితమేనని తేలిందని జార్జ్ వివరించారు. రెండో దశ (సేఫ్టీ అండ్ ఎఫికసీ) ట్రయల్స్‌ను న్యూజీలాండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు.

ఆ రెండు మార్గాలే..

పురుషులకు సంబంధించినంతవరకూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న గర్భనిరోధక విధానాలు రెండే.. ఒకటి కండోమ్స్ వాడకం. రెండోది వ్యాసెక్టమీ (వీర్య వాహికలను కత్తిరించి ముడి వేసే/మూసేసే శస్త్రచికిత్స). స్త్రీలకు గర్భనిరోధక మాత్రలు అందుబాటులో ఉన్నట్టు పురుషులకు లేకపోవడానికి కారణమేంటి? ఎంతో పురగతి సాధించిన వైద్య రంగం.. ఈ విషయంలో మాత్రం ఇంకా విజయం సాధించలేకపోవడానికి కారణమేంటి? అంటే.. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి.. మహిళల్లో అండాల విడుదల దాదాపు నెలకు ఒకసారి మాత్రమే జరుగుతుంది. దానికీ ఒక క్రమం ఉంటుంది. కానీ, పురుషుల్లో నిత్యం కోట్లాది వీర్యకణాల ఉత్పత్తి జరుగుతుంటుంది. ఎప్పుడో నెలకు ఒకసారి జరిగే ప్రక్రియను నిరోధించడం సులువు. నిత్యం, నిరంతరం జరిగే ప్రక్రియను ఆపడం కష్టం. అలాగని అసాధ్యమేమీ కాదు. పురుషుల కోసం గత 60-70 ఏళ్లలో రకరకాల కాంట్రాసెప్టివ్ పిల్స్, జెల్స్, ఇంజెక్షన్లను శాస్త్రజ్ఞులు తయారు చేశారు. కానీ, వాటిలోని హార్మోన్ల వల్ల కలిగే దుష్ప్రభావాల కారణంగా ప్రతిసారీ ట్రయల్స్ దశలోనే వాటి ప్రస్థానం ముగిసిపోతూ వస్తోంది. హార్మోన్ రహిత మాత్రలపై కూడా కొన్ని పరిశోధనలు జరిగాయిగానీ అవేవీ ట్రయల్స్ దశ దాటి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఇప్పుడు అమెరికన్ శాస్త్రజ్ఞులు తయారుచేసినవి కూడా హార్మోన్ రహిత మాత్రలే. ఈ దశాబ్దం చివరికల్లా అవి మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు. అదెంతవరకూ నిజమవుతుందో చూడాలి!!


హంసవాహనంపై విహరిస్తున్న ఒంటిమిట్ట కోదండరాముడు

సమన్వయంతో ఒంటిమిట్ట ఉత్సవాలు: మంత్రి ఆనం

» హంసవాహనంపై దర్శనమిచ్చిన కోదండరాముడు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలగకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఒంటిమిట్టలోని టీటీడీ పరిపాలన సమావేశ భవనంలో, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితతో కలిసి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై మంత్రి సమావేశం నిర్వహించారు. ఈనెల 11న సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపేందుకు అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. కాగా.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి స్వామివారు హంస వాహనంపై ఊరేగారు.


భద్రాద్రి రామయ్య మహాపట్టాభిషేకోత్సవ దృశ్యం

భద్రాద్రిలో కల్యాణ రాముడికి ఘనంగా మహాపట్టాభిషేకం

భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి అత్యంత వైభవంగా మహాపట్టాభిషేకం నిర్వహించారు. ముందుగా శ్రీరాముడి బంగారు పాదుకలను భక్తులకు చూపించి, సమర్పించారు. ఆ తర్వాత రాజదండం, రాజ ముద్రిక, రామదాసు చేయించిన పచ్చల పతకం శ్రీరాముడికి, చింతాకు పతకం సీతమ్మకు, శ్రీరామమాడను లక్ష్మణుడికి అలంకరించారు. అనంతరం చామరం, బంగారు ఛత్రం, దుష్ట శిక్షణ కోసం రాజఖడ్గాన్ని రామయ్యకు అందజేశారు. చివరగా పట్టాభిషేక ముగింపుగా సామ్రాట్ కిరీటాన్ని శ్రీరాముడికి ధరింపజేశారు.

శ్రీవారి ఆలయంలోనూ

తిరుమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం రాత్రి శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరిగింది. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులకు విశేష సమర్పణ చేపట్టారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మాతృభాష కంటి చూపు.. ఆంగ్లభాష కళ్లజోడు

» ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరవకూడదు

» విద్యార్థులతో ముఖాముఖిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


వెంకటాచలం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మన మాతృ భాష కంటి చూపైతే.. ఆంగ్లభాష కళ్లజోడు లాంటిదని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మాత్రం ఏ ఒక్కరూ మారవకూడదని చెప్పారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సోమవారం ఆయన విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. జీవితంలో పాటించాల్సిన పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పిజ్జాలు, బర్గర్ల జోలికి వెళ్లవద్దన్నారు. ఇంటి భోజనం తింటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. సెల్‌ఫోన్లు ఎక్కువగా వాడితే సొంతంగా ఆలోచించడం మానేస్తారని, నేటి యువతరం రాత్రుళ్లు నిద్రపోకుండా సెల్‌ఫోన్లు వాడుతున్నారని, ఇది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. గూగుల్ ఏ గురువునూ మించింది కాదన్నారు. తల్లిదండ్రులు, గురువులను విద్యార్థులు గౌరవించాలని హితబోధ చేశారు. ఆరోగ్యంగా ఉండటానికి విద్యార్థులు యోగా, వ్యాయామం కచ్చితంగా చేయాలన్నారు. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటించినప్పుడే ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయన్నారు. చదువు పట్ల అశ్రద్ధ చూపకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, భారతదేశంలోనే అత్యున్నతమైన యూనివర్సిటీలు, విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానాన్ని విద్యాసంస్థలు అనుసరించాలని సూచించారు. అనంతరం పాటలు, పద్యాలతో అలరించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించి అభినందించారు.

అణు జలాంతర్గామి స్థావరం!

» అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో నేవీ ప్రత్యామ్నాయ బేస్

» 2026లో ప్రారంభించేందుకు కేంద్రం ప్రణాళిక

విశాఖ నుంచి 50కి.మీ. దూరంలో రహస్య కేంద్రం



విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సముద్ర రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా మరో కీలక ముందడుగు పడనుంది. తూర్పు తీరంలో రక్షణ అవసరాల కోసం నిర్మిస్తున్న నేవీ ప్రత్యామ్నాయ స్థావరం 'ఐఎన్ఎస్ వర్ష'ను 2026లో ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది పూర్తిగా వ్యూహాత్మక స్థావరం. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి 50 కి.మీ. దూరాన అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలో సముద్ర తీరాన్ని ఆనుకొని దీన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం 670 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అవసరమైన సహకారం అందిస్తోంది. దీని తొలి దశ నిర్మాణం 2022 నాటికి, మలి దశ నిర్మాణం 2025 నాటికి పూర్తి కావలసి ఉంది. కానీ కొవిడ్ వంటి కారణాల వల్ల ఆలస్యమైంది. ఇప్పుడు తొలి దశ నిర్మాణం పూర్తి కావొచ్చింది. రాంబిల్లికి సమీపాన అంటే 20 కి.మీ. దూరంలోనే అచ్యుతాపురంలో బాబా అటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) ఉంది. ఐఎన్ఎస్ వర్షకు అవసరమైన సహకారమంతా అక్కడి నుంచే అందుతుంది. బార్క్‌కు అచ్యుతాపురంలో 2,200 ఎకరాలు కేటాయించారు. అంటే ఇక్కడ భవిష్యత్తులో ఏ స్థాయిలో కార్యకలాపాలు జరగబోతున్నాయో ఊహించుకోవచ్చు. రాంబిల్లి స్థావరంలో అణు జలాంతర్గాముల నిర్మాణమే కాకుండా.. మరమ్మతులు, నిర్వహణ వంటి అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. ఈ స్థావరంలో బంకర్లు, సొరంగ వ్యవస్థలు, ఇన్నర్, ఔటర్ హార్బర్ వంటి సౌకర్యాలున్నాయి. హైసెక్యూరిటీతో ఏర్పాటు చేస్తున్న ఈ వ్యూహాత్మక స్థావరం బంగాళాఖాతం, హిందూమహాసముద్ర ప్రాంతంలోని జలాల్లో నిఘాను పెంచనుంది. ముఖ్యంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా చర్యలపై నిఘా పెట్టేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. పొరుగుదేశాలైన చైనా, పాకిస్థాన్ తన నౌకాదళాలను ఆధునీకరించుకుంటున్న నేపథ్యంలో భారత్ కూడా కొత్త నౌకా స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

రాంబిల్లి ఎందుకంత ప్రత్యేకం..?

ఐఎన్ఎస్ వర్షను సబ్‌మెరైన్ల కోసమే నిర్మించారు. శత్రువుల కంట పడకుండా వాటిని రహస్యంగా దాచడానికి ఇలాంటి బేస్‌లను రష్యా, చైనా వంటి దేశాలు నిర్మించుకున్నాయి. ఆ కోవలోనే భారత్ కూడా రాంబిల్లిని వ్యూహాత్మక స్థావరంగా ఎంచుకుంది. చైనాకు దీటైన సమాధానం చెప్పడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇది భారత నౌకాదళానికి సబ్‌మెరైన్ల హబ్‌గా ఉంటుంది. నేవీ అధికారులు ఇందులో పనిచేస్తున్నప్పటికీ ఏ సబ్‌మెరైన్ ఎక్కడికి.. ఎప్పుడు వెళ్లాలనే నిర్ణయాలను మాత్రం ఢిల్లీలోని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ నిర్ణయిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఢిల్లీ కనుసన్నల్లో ఈ హబ్ పనిచేస్తుంది. ఇక్కడ 12 సబ్‌మెరైన్లను డాక్ చేసుకోవచ్చు. అందులో అణు జలాంతర్గాములకే అధిక ప్రాధాన్యం. హైనాన్ ద్వీపం వద్ద చైనాకు చెందిన అణు జలాంతర్గామి స్థావరం తరహాలోనే.. రాంబిల్లి వద్ద నీటి లోతు ఎక్కువగా ఉంటుంది. దీంతో జలాంతర్గాములు ఉపగ్రహాల కంటపడకుండానే లోపలికి ప్రవేశించగలవు, బయటకు నిష్క్రమించగలవు. వాటిని శాటిలైట్లు గానీ, నిఘా విమానాలు గానీ కనిపెట్టే అవకాశం లేదు. సముద్రంలో టన్నెళ్లను నియమించి, వాటి ద్వారా సబ్‌మెరైన్లు హబ్‌కు చేరుకునేలా నిర్మాణం చేశారు. దీనికి పదేళ్లకుపైగా పట్టింది. 2014 ఆగస్టులో ఇక్కడ స్థావరాన్ని నిర్మిస్తున్నట్టు వార్తలు వెలువడ్డాయి.

ఈ ఏడాదిలోనే అర్థమాన్ అందుబాటులోకి..

విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో 2004 నుంచి న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణం జరుగుతోంది. స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్స్ (ఎస్ఎస్‌బీఎన్) పేరుతో నాలుగు న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెజల్ (ఏటీవీ) ప్రాజెక్టును 2004లో ప్రారంభించారు. ఇందులో మొదటిదైన అరిహంత్ నిర్మాణానికి రష్యా సహకారం తీసుకున్నారు. దీన్ని 2009లో లాంచ్ చేసి అనేక సీ ట్రయల్స్ అనంతరం 2016 ఆగస్టులో నేవీకి అందించారు. రెండోదైన ఐఎన్ఎస్ అరిఘాత్‌ను 2017లో సీ ట్రయల్స్‌కు పంపించారు. గతేడాది ఆగస్టు 29న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. వీటిని 'అరిహంత్ క్లాస్' అణు జలాంతర్గాములుగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో మిగిలిన రెండు సబ్‌మెరైన్ల నిర్మాణానికి రూ.40వేల కోట్లు ఇవ్వనున్నట్టు ఆరు నెలల క్రితం ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో నిర్మిస్తున్న మూడో న్యూక్లియర్ సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ అర్థమాన్. ఇది గతేడాది (2024) అక్టోబరులోనే సీ ట్రయల్స్‌కు వెళ్లింది. దీన్ని త్వరలో కమిషనింగ్ చేసి నేవీకి అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్ కంటే అర్థమాన్ పెద్దగా ఉంటుంది. 7వేల టన్నుల సామర్థ్యం కలిగిన ఈ సబ్‌మెరైన్.. 3,500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల మరిన్ని కే-4 క్షిపణులను మోసుకెళ్లగలదు. దీని తర్వాత నిర్మిస్తున్న న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను ప్రాజెక్ట్ ఎస్-4గా వ్యవహరిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇది కూడా నిర్మాణం పూర్తి చేసుకొని సీ ట్రయల్స్‌లో ఉంది.

పశ్చిమ తీరానికి కార్వార్.. తూర్పు తీరానికి వర్ష..

ప్రాజెక్ట్ సీబర్డ్‌లో భాగంగా కర్ణాటకలోని కార్వార్ స్థావరం పశ్చిమ తీరాన్ని కాపాడుతోంది. ఇదే తరహాలో ప్రాజెక్ట్ వర్ష ద్వారా రాంబిల్లి స్థావరం తూర్పు తీరానికి రక్షణగా నిలవనుంది. కార్వార్ నౌకాదళ స్థావరంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారమే పలు ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను ప్రారంభించారు. తాజా పరిణామాలతో ఈ స్థావరంలో 32 నౌకలు, సబ్‌మెరైన్‌లతోపాటు మరికొన్ని నౌకలు అందుబాటులోకి రానున్నాయి.

టెన్త్ ఫలితాలకు ముందే ఇంటర్‌లో చేరొచ్చు

» ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బ్రిడ్జి కోర్సు

» గణితం, సైన్స్, ఆంగ్లంపై ప్రాథమిక బోధన

» ఈ నెల 23 వరకు ఆ సబ్జెక్టులపై తరగతులు

» ఫలితాలు వచ్చాక పూర్తిస్థాయిలో ప్రవేశాలు

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాశారా? ఇంటర్మీడియెట్‌లో చేరాలని అనుకుంటున్నారా? అయితే... ఫలితాలు వచ్చే వరకు ఎదురు చూడాల్సిన అవసరం లేదు. పదో తరగతి ఫలితాలతో సంబంధం లేకుండా ఇంటర్ విద్యామండలి.. ఇంటర్మీడియెట్‌లో చేరే అవకాశాన్ని కల్పించింది. 2025-26 విద్యా సంవత్సరాన్ని ఈ ఏడాది నుంచి ఏప్రిల్‌లోనే ప్రారంభించిన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థుల నమోదును పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఈ నెలాఖరు నాటికి టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలవుతాయి. ఏటా జూన్‌లో కాలేజీలు ఉన్నందున ఫలితాలపై ఎలాంటి గందరగోళం లేదు. కానీ, ఈసారి ఫలితాల కంటే ముందే తరగతులు ప్రారంభించినందున విద్యార్థులందరినీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేర్చుకుంటున్నారు. ఆయా కాలేజీల్లో ఫస్టియర్‌లో చేరే విద్యార్థుల పేర్లు నమోదు చేసుకుని బ్రిడ్జి కోర్సు ప్రారంభిస్తారు. ఈ నెల 23 వరకు బ్రిడ్జి కోర్సు కొనసాగుతుంది. 24 నుంచి వేసవి సెలవులు ఉంటాయి. ఆ తర్వాత వచ్చే టెన్త్ ఫలితాల ఆధారంగా విద్యార్థులకు ప్రభుత్వ కాలేజీల్లో పూర్తిస్థాయి ప్రవేశాల(అడ్మిషన్ల) ప్రక్రియ చేపడతారు. టెన్త్ ఫలితాల తర్వాత చేపట్టే అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. అయితే, ఈలోగా విద్యార్థులను కాలేజీల్లో చేర్చుకుంటే వారు అక్కడే కొనసాగుతారని ఇంటర్ బోర్డు భావిస్తోంది.

ప్రభుత్వ కాలేజీల్లోనూ బ్రిడ్జి కోర్సు

ప్రభుత్వ కాలేజీల్లో కూడా ఇప్పుడు బ్రిడ్జి కోర్సు ప్రారంభిస్తున్నారు. గణితం, సైన్స్, ఆంగ్లం సబ్జెక్టులపై ఇప్పటి నుంచి ఈ నెల 23 వరకు తరగతులు నిర్వహిస్తారు. జూన్ 1 నుంచి పూర్తిస్థాయిలో ఇంటర్ సబ్జెక్టుల బోధన ప్రారంభిస్తారు. మరోవైపు.. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈ నెల 12 తర్వాత విడుదల చేయాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది.

లెక్చరర్ పోస్టుల భర్తీకి జూన్‌లో రాత పరీక్ష

» 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహణ

లెక్చరర్ పోస్టులకు రాత పరీక్ష తేదీలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. పాలిటెక్నిక్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, టీటీడీ డిగ్రీ కాలేజీలో లెక్చరర్ పోస్టులకు జూన్ 16 నుంచి రాత పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపింది. 20 నుంచి 22 వరకు మూడు రోజులు మినహా 26 వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొంది. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఒకటి కంటే ఎక్కువ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జనరల్ స్టడీస్ పేపరును ఒక్కసారి రాస్తే సరిపోతుందని స్పష్టంచేసింది.

10 నుంచి గ్రూప్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఇటీవల గ్రూప్-2 ఫలితాలను ప్రకటించిన ఏపీపీఎస్సీ.. ఈ నెల 10 నుంచి విజయవాడలోని తమ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించనున్నట్టు తెలిపింది. 10, 11, 15, 16, 17 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థులు హాజరు కావాలని సూచించింది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారి తుది జాబితాను విడుదల చేస్తుంది.

అల్పపీడనం బలపడే అవకాశం లేదు!

» పెరగనున్న ఎండలు.. నేడు, రేపు పలుచోట్ల పిడుగులతో వానలు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడే అవకాశం లేదని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. అయితే పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే సమయంలో వాయువ్య భారతం నుంచి వచ్చే వేడిగాలులు అల్పపీడనం దిశగా వీస్తాయన్నారు. దీంతో వచ్చే మూడు రోజుల్లో ఎండలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. మరోవైపు వేర్వేరుగా ఉపరితల ద్రోణుల విస్తరణతో కోస్తా, రాయలసీమల్లో సోమవారం అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన వానలు కురుస్తాయని, ఈదురుగాలులకు ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడు పేర్కొన్నారు. అలాగే, ఈ నెల 10, 11 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా, సోమవారం నంద్యాల సహా పలుచోట్ల 41 డిగ్రీలు దాటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వినియోగదారుల రక్షణ కమిషన్ల సెలక్షన్ కమిటీ ఏర్పాటు

» చైర్‌పర్సన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య నియామకం

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగదారుల రక్షణ కమిషన్, జిల్లా కమిషన్‌లకు అధ్యక్షులు, సభ్యుల నియామకానికి ప్రభుత్వం సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేసిన జస్టిస్ నైనాల జయసూర్యను ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నామినేట్ చేసిన లా సెక్రటరీని, ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల ఇన్‌చార్జి కార్యదర్శిని సభ్యులుగా నియమించింది.

3.18కోట్లతో ఎస్సీ గురుకులాల్లో మినరల్ వాటర్

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం-అజయ్ 2023-24 నిధులతో 53 డాక్టర్ అంబేడ్కర్ గురుకులాల్లో(ఎస్సీ) మినరల్ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ప్లాంట్‌కు రూ.6 లక్షల చొప్పున 53 ప్లాంట్లకు రూ.3.18 కోట్లు మంజూరు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

జూన్ 12 నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి

జూన్ 12 నాటికి రెండు లక్షల టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందేలా పనులు వేగవంతం చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

జగన్ హెలికాప్టర్ దిగకుండా అడ్డుకునే దమ్ము మాకుంది

» చంద్రబాబు మాకు అలాంటి సంస్కృతి నేర్పలేదు: సునీత



అనంతపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డిని పాపిరెడ్డిపల్లికి రానివ్వకుండా అడ్డుకునే దమ్ము, ధైర్యం... రెండూ మాకున్నాయి' అని అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరిలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం సునీత మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటనకు రావడంపై స్పందించారు. 'మాలో ఉన్నది చంద్రబాబు, టీడీపీ రక్తం. రాప్తాడు నియోజకవర్గంలో జగన్ పర్యటనపై మా పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పరిటాల రవి పులివెందులకు వెళ్లినప్పుడు జగన్ కుటుంబం అడ్డుకుంది. అందుకే జగన్‌రెడ్డిని అడ్డుకోవాలనే అభిప్రాయం మా పార్టీ కార్యకర్తల నుంచి వ్యక్తమవుతోంది. జగన్‌రెడ్డి ఎక్కిన హెలికాప్టర్‌ని దిగకుండా వెనక్కి పంపే శక్తి మాకు ఉంది. అయితే మా నాయకుడు చంద్రబాబు అలాంటి సంస్కృతిని మాకు నేర్పలేదు. ఒక చావును రాజకీయం చేసేందుకు జగన్‌రెడ్డి వస్తున్నారు. అనుకోకుండా జరిగిన సంఘటనను ఫ్యాక్షన్ హత్యగా చిత్రీకరించి, తోపుదుర్తి సోదరులు రాజకీయం చేస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఒక మాజీ సీఎం ఇక్కడకు రావడం సరైంది కాదు. జగన్ వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఏదైనా సాయం చేసిపోవాలి. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి ఇక్కడ ప్రజల మధ్య చిచ్చుపెట్టవద్దు. బీసీల మీద జగన్‌కు అంత ప్రేమే ఉంటే రాప్తాడు ఇన్‌చార్జిగా ఒక బీసీని నియమించాలి. దమ్ము, ధైర్యం ఉంటే మంగళవారం పర్యటనలో ఈ ప్రకటన చేయాలి' అని సునీత అన్నారు.

కడపలో మహానాడు

» స్థల పరిశీలనలో పల్లా బృందం

కడప, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కడపలో మహానాడు నిర్వహణకు స్థల పరిశీలన చేశామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం ఆయన మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కాల్వ శ్రీనివాసులు, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, వరద రాజులరెడ్డి తదితరులతో కలిసి మూడు స్థలాలను పరిశీలించారు. వాటిలో ఒక స్థలాన్ని ఎంపిక చేస్తామన్నారు.

ఆదాయంలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు

హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే 2024-25 సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.20,452 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. జోన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం విశేషం.

వృద్ధురాలిపై హత్యాచారం కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

» సహకరించిన మరొకరికి ఐదేళ్ల జైలు

» బీఎన్ఎస్ఎస్ చట్ట ప్రకారం రాష్ట్రంలో మొదటి తీర్పు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో పక్షవాతంతో ఉన్న ఒక వృద్ధురాలి(64)పై 2024 జూలై 29 మధ్యాహ్నం ఇద్దరు ఆగంతకులు దాడి చేసి అత్యాచారానికి పాల్పడి బంగారు ఆభరణాలు అపహరించారు. తీవ్ర గాయాల పాలైన ఆమె ఆగస్టు 29న మరణించింది. కోనసీమ జిల్లా నారాయణపేటకు చెందిన బొక్కా రాజు అలియాస్ ధనుష్(29), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మీసాల మావుళ్లు(45)ను నిందితులుగా గుర్తించి పాలకొల్లు టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరులోని మహిళా కోర్టు కం ఐదవ జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ జరగ్గా, బొక్కా రాజు, మీసాల మావుళ్లకు అత్యాచారం కేసులో జీవిత ఖైదు, రూ.ఐదు వేల జరిమానా, హత్య కేసులో జీవిత ఖైదు, రూ.ఐదు వేల జరిమానా, దోపిడీ కేసులో పదేళ్ల జైలు, రూ.2వేల జరిమానా, వీరికి సహకరించిన గుజ్జుల రామకృష్ణకు ఐదేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధించారు. ఈ మేరకు బీఎన్ఎస్ఎస్ చట్ట ప్రకారం రాష్ట్రంలో మొట్టమొదటి తీర్పును జడ్జి జి.రాజేశ్వరి సోమవారం వెల్లడించారు.

ఆ దంపతుల కొడుకు నా బిడ్డే!!

యూఏఈలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హిందూ దంపతులతో పాక్ యువకుడి పేచీ

» తనను ఆమె పెళ్లాడిందని, బాబును ఇస్లాం పద్ధతిలో పెంచుకుంటానని న్యాయస్థానంలో వాదన

» చిన్నారి తండ్రి ఆ పాకిస్థానీయేనని తేల్చిన డీఎన్ఏ టెస్టు

» అతడికే బిడ్డను అప్పగించాలని న్యాయస్థానం తీర్పు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్‌లో స్థిరపడ్డ ఏపీకి చెందిన ఓ హిందూ దంపతులకు ఇద్దరు కూతుళ్ల తర్వాత ఓ బాబు కలిగాడు. అతడి వయసు ప్రస్తుతం ఐదేళ్లు. ఉన్నట్టుండి ఓ పాకిస్థాన్ యువకుడొచ్చి ఆ బాబు తన బిడ్డేనని.. తనకే దక్కాలని ఆ దంపతులతో వాదించాడు. తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డను ముస్లిం సంప్రదాయ పద్ధతిలో పెంచుకుంటానని.. తనకు అప్పగించాలని గొడవకు దిగాడు. డీఎన్ఏ టెస్టులోనూ ఆ బిడ్డకు తండ్రి ఆ పాకిస్థానీయేనని తేలడం విశేషం. అయి తే ఆ కన్నతల్లి మాత్రం బిడ్డను ఇచ్చేందుకు ససేమిరా అంటోంది. తాను హిందువునని.. తన పేగు తెంచుకొని పుట్టిన బిడ్డ.. జన్మతః హిందువే అవుతాడని.. అందుకే బాబు తనకే దక్కాలని ఆ తల్లి వాదిస్తోంది. ఆమెకు భర్త కూడా మద్దతునిచ్చాడు. బిడ్డ తమ ప్రాణం అని.. ఇచ్చేది లేదంటూ ఆమెకు దన్నుగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దంపతులు, వారి ఇద్దరు పిల్లలు యూఏఈలో చాలాకాలంగా ఉంటున్నారు. షార్జాలో ఈ దంపతులకు పాకిస్థాన్‌కు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ మహిళకు మూడో సంతానంగా బాబు పుట్టాడు. అయితే ఐదేళ్ల తర్వాత గత డిసెంబరులో ఆ బాబుకు తానే తండ్రినంటూ సదరు పాకిస్థాన్ యువకుడు వాదించాడు. అతడి ఈ వాదనపై ఆ దంపతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ పాకిస్థానీ విజ్ఞప్తి మేరకు యూఏఈ అధికారులు డీఎన్ఏ పరీక్ష నిర్వహించారు. అందులో బాబుకు తండ్రి.. పాకిస్థానీయే తేలింది. అయితే.. ఆ మహిళతో తాను బిడ్డను కనడమే కాదు, ఆమెను తాను పెళ్లి కూడా చేసుకున్నానంటూ న్యాయస్థానం దృష్టికి తెచ్చాడు. ఇన్నాళ్లు.. తన కొడుకును ఆమె హిందూ సంప్రదాయం ప్రకారం పెంచిందని, బిడ్డకు తండ్రిని తానే కాబట్టి తనకు అప్పగిస్తే ముస్లిం సంప్రదాయ పద్ధతిలో పెంచుకుంటానని కోర్టుకు తెలిపాడు వాదనలన్నీ విన్న న్యాయస్థానం చిన్నారిని పాకిస్థాన్ జాతీయుడికే అప్పగించాలని తీర్పిచ్చింది. దీనిపై ఆ తెలుగు కుటుంబం ఉన్నత న్యాయస్థానానికి అప్పీలుకు వెళ్లింది.. చిన్నారితో సహా తల్లిదండ్రులు దేశం విడిచి వెళ్లకుండా అధికారులు ఆంక్షలు విధించారు. అయితే ఈ మొత్తం న్యాయ ప్రక్రియలో తమ వాదనను తెలుగు కుటుంబం సరిగ్గా వినిపించలేకపోయింది. ఇంటిపెద్ద ఉన్న ఉద్యోగం కోల్పోవడం.. ఫలితంగా ఆర్థిక సమస్యల కారణంగా న్యాయవాదులను పెట్టుకోలేకపోవడం.. చెప్పుకొంటే పరువు రోడ్డున పడుతుందనే భావనతో తమ సమస్యను ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో కుమిలిపోతుండటం.. స్థానిక చట్టాలపై అవగాహన లేకపోవడంతో సరైన వాదనలను వినిపించలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటికే పెళ్లయి ఇద్దరు పిల్లలకు తల్లిగా భర్తతో కలిసి ఉంటున్న మహిలను ఆ పాకిస్థానీ ఏ చట్టం ప్రకారం పెళ్లి చేసుకున్నాడు? జీవిత భాగస్వామి ఉండగా మరోవ్యక్తిని పెళ్లి చేసుకునేందుకు గల్ఫ్ చట్టాలూ అనుమతించవు కదా? ఒకవేళ పాకిస్థానీయుడిని పెళ్లాడాలంటే భర్తకు తొలుత ఆమెకు విడాకులివ్వాలి.. అందునా గల్ఫ్ దేశాల్లో ఓ ముస్లింను పెళ్లి చేసుకునే వారు ముస్లిమేతరులైతే ఇస్లాంను స్వీకరించాలి కదా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసు చాలా సంక్లిష్టతతో కూడుకొని ఉన్నదని.. ఒకవేళ దంపతులు పెట్టుకున్న అప్పీలు వీగిపోయినా కూడా పాకిస్థాన్ యువకుడికి చిక్కులే ఉంటాయని అంటున్నారు. ఎందుకంటే.. ఆ చిన్నారిని పాకిస్థాన్‌కు తీసుకెళ్లాలంటే ఆ దేశం పాస్‌పోర్టు అవసరం అని.. భారతీయ పౌరసత్వం, పాస్‌పోర్టు ఉన్న చిన్నారిని తీసుకెళ్లడం ఎలా సాధ్యం? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లంకతో మైత్రి

పరస్పర గౌరవం, చర్చల ద్వారా సమస్యల పరిష్కారం, శాంతి సామరస్యాలు, ఆర్థిక కలిమి, సంస్కృతి అనేవి ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలకు మార్గదర్శక సూత్రాలుగా ఉండాలి. దీనినే మన విదేశాంగ విధానం 'ఇరుగు పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం'గా నిర్వచించింది. 2008లో ఈ విధానానికి అంకురార్పణ చేశారు. నిజానికి దీని మూలాలు 1990 దశకంలో 11 నెలలు మాత్రమే అధికారంలో ఉన్న ప్రధానమంత్రి ఇందర్ కుమార్ గుజ్రాల్ సిద్ధాంతంలో ఉన్నాయి. పొరుగుదేశాల సమస్యలను అర్థం చేసుకుని వాటికి తగ్గట్లుగా వ్యవహరించడంలో స్వప్రయోజనాలను కూడా పక్కన పెట్టాలని గుజ్రాల్ విధాన నిర్దేశం చేశారు.

2008–10 మధ్య మన ఇరుగుపొరుగు దేశాలలో చరిత్రాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. 2008లో బంగ్లాదేశ్‌లో సైనిక ప్రభుత్వం స్థానంలో షేక్ హసీనా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మాల్దీవుల్లో అబ్దుల్ గయూమ్ మూడు దశాబ్దాల నియంతృత్వ పాలన అంతమై మహమ్మద్ నషీద్ ప్రజాస్వామ్యబద్ధంగా అధికారాన్ని చేపట్టారు. 2010లో మయన్మార్‌లో రెండు దశాబ్దాల సైనిక పాలన ముగిసి ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తదనంతర కాలంలో ఈ దేశాలలో ప్రజాస్వామ్య పాలన సుస్థిరంగా కొనసాగనప్పటికీ ప్రజాస్వామ్య మూలాలు బలపడ్డాయి.

మరో పొరుగుదేశం శ్రీలంకలో పరిణామాలు కొంచెం భిన్నమైనవి. మూడున్నర దశాబ్దాల పాటు ప్రజాజీవితాన్ని అల్లకల్లోలం చేసిన తమిళ వేర్పాటువాద సంస్థ ఎల్‌టీటీఈ ప్రభుత్వంతో యుద్ధంలో ఓడిపోయి, సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పొరుగుదేశాల ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్యం సువ్యవస్థితం కావడానికి భారత్ పలు విధాల సహాయసహకారాలు అందించింది. అయినప్పటికీ వివిధ కారణాలతో ఆ దేశాలతో భారత్ స్నేహ సంబంధాలు సజావుగా సాగలేదు. అవి భారత్ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే విధంగా పరిస్థితులు దిగజారిపోయాయి. ఆ ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు న్యూఢిల్లీ సంయమనంతో ఇరుగుపొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం విధానాన్ని అనుసరిస్తూ వస్తోంది. భారత్‌ను తీవ్రంగా వ్యతిరేకించి, చైనా వైపు మొగ్గిన మాల్దీవులు మళ్లీ భారత్ అనుకూల వైఖరి చూపుతోంది. శ్రీలంక నుంచి కూడా అటువంటి అనుకూలతను సాధించే ప్రయత్నాలలో భాగంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశంలో మూడు రోజులపాటు పర్యటించారు.

శ్రీలంక అధ్యక్షుడుగా అనూర కుమార దిస్సనాయకె అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ప్రప్రథమంగా ఆతిథ్యమిచ్చిన విదేశీ నాయకుడు మోదీయే. గత సెప్టెంబర్‌లో అధికారంలోకి వచ్చిన దిస్సనాయకె తన తొలి అధికారిక విదేశీ యాత్రకు డిసెంబర్‌లో భారత్ వచ్చారు. భారత్ ప్రయోజనాలకు భంగం వాటిల్లే కార్యకలాపాలను శ్రీలంక భూభాగంపై జరగనివ్వమని వాగ్దానం చేశారు. ఇప్పుడు కొలంబోలో మోదీ సమక్షంలో మరోసారి ఆ వాగ్దానం చేశారు. శ్రీలంక నుంచి ఐపీకెఎఫ్ (భారత శాంతి పరిరక్షణ దళం) ఉపసంహరించిన నాలుగు దశాబ్దాల అనంతరం ఉభయ దేశాల మధ్య రక్షణరంగంలో సహాయసహకారాల విషయమై ఒప్పందం కుదరడం విశేషం. హిందూ మహాసముద్రంలో చైనా కార్యకలాపాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం అమిత ప్రాధాన్యం సంతరించుకుంది. శామ్‌పూర్ విద్యుత్కేంద్రానికి ప్రధాని మోదీ, అధ్యక్షుడు దిస్సనాయకె సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ట్రికోమలీని ఎనర్జీహబ్‌గా అభివృద్ధిపరిచే విషయమై కూడా ఒక అవగాహన పత్రంపై రెండు దేశాలు సంతకాలు చేశాయి.

భారతదేశ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారు ఉద్దేశపూర్వకంగా శ్రీలంక ప్రాదేశిక జలాలలోకి ప్రవేశించడం లేదు కనుక వారిని మానవతా దృష్టితో చూడాలని కోరారు. తమిళనాడులో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే ప్రయత్నాలలో భాగంగానే మోదీ తన పర్యటనలో మత్స్యకారుల సమస్యను ప్రస్తావించారని కొందరు విమర్శించారు. హిందూ మహాసముద్ర తీరస్థ దేశాలలో ఏదో ఒక విధంగా తిష్ఠవేస్తున్న చైనాను అడ్డుకోవడానికి శ్రీలంకతో సంబంధాలకు అగ్రప్రాధాన్యమిచ్చి వాటిని పటిష్ఠపరచుకోవలిసి ఉన్నది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరంలో జాతీయ పాలకపక్షం, రాష్ట్ర అధికారపార్టీ, ఇతర రాజకీయ పక్షాలు సంయమనంతో వ్యవహరించడం చాలా ముఖ్యం. అలా వ్యవహరించినప్పుడు మాత్రమే ఇరుగుపొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం అన్న విధానం సార్థకమవుతుంది.

విజ్ఞత లేని 'త్రిభాషా' ధిక్కారం

'భారత్ భవిష్యత్తుపై రెండు దృక్కోణాలు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మార్చి 22న రామచంద్ర గుహ రాసిన వ్యాసంలో మోదీ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనబడింది. తమిళ, హిందీ భాషల మధ్య పోరాటం రెండు భిన్న భారత్ భావనలకు ప్రాతినిధ్యం వహిస్తుంది అంటున్నారు ఆయన. బ్రిటిష్ వాళ్ళు నూరిపోసిన ఆర్య, ద్రావిడ సిద్ధాంతాన్ని ఈయన బాగా ఔపోసన పట్టినట్లుంది. 'ఉత్తరాది ప్రజలు ఆర్యులు అని, దక్షిణాది ప్రజలు ద్రావిడులు అని, ఉత్తరాది హిందీ ఆర్యభాషైన సంస్కృతం నుంచి వచ్చిందని బ్రిటిష్‌వారు ఈ దేశంలో తమ పాలనను శాశ్వతం చేసుకోవడానికి ఓ కొత్త వాదాన్ని లేవదీశారు. దానిని అందిపుచ్చుకొని ద్రావిడవాద నాయకులు ఈ దేశ భాషైన హిందీని వ్యతిరేకిస్తూ, హింసాత్మక ఉద్యమాన్ని లేవదీసి జన నష్టం, ఆస్తి నష్టం కలిగించిన విషయం సుస్పష్టం.

ద్రావిడవాద నాయకులు హిందీని వ్యతిరేకించడం 1937 నుంచి నేటి వరకు కొనసాగుతూనే ఉంది. దేశీయ భాషైన హిందీని వ్యతిరేకించడంలో అర్థం లేదని జాతీయ నాయకులు మొదటినుంచి వాదిస్తూ వచ్చారు. 1950 నుంచి 1967 వరకు కాంగ్రెస్ కార్యకర్తలపై ద్రావిడవాద పార్టీ కార్యకర్తలు వీధి పోరాటాలు చేశారు. 1965లో ఈ ఉద్యమం హింసాత్మకంగా మారి, పారా మిలిటరీ దళాలు కాల్పులు జరపడంతో అనేకమంది మృత్యువాత పడ్డారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభను తమిళనాడులో మూసివేయాలని ఈ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ విషయంలో వ్యాసకర్త చాలా విషయాలను దాచారు. 'కాశీ–తమిళ్ సంగమం' నూతన పార్లమెంటు భవనంలో 'సెంగోల్' ప్రతిష్ఠాపన వెనుక ఈ దేశంలో సమైక్యతను సాధించడం అనే లక్ష్యం మోదీ ప్రభుత్వానికి ఉన్నదని జాతీయవాదుల అభిప్రాయం. వ్యాసకర్తకు ఇది రాజకీయ కోణంగా తోచింది.



రాష్ట్ర జాబితాలో ఉన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి శాసనాలు చేసే అధికారం ఉంటుంది. కొన్ని స్థానిక సంస్థలలో ప్రతిపక్ష పార్టీ వారు అధికారంలో ఉన్నంతమాత్రాన రాష్ట్ర శాసనాలను అమలు చేయబోమని ధిక్కరించవచ్చునా? వారికి ఆ హక్కు ఉంటుందా? కేంద్ర శాసనాలను తమిళనాడు ప్రభుత్వం ధిక్కరించడం ఈ కోవ కిందికి రాదా? త్రిభాషా సూత్రాన్ని ధిక్కరిస్తూ, ద్వి భాషలకు మాత్రమే మా రాష్ట్రంలో స్థానం ఉందని మూర్ఖంగా ప్రవర్తించే ద్రావిడవాద రాజకీయ నాయకుల పొగరుబోతు ధోరణిని తప్పు పట్టకుండా, ఉత్తర భారతంలో దక్షిణాది భాషను నేర్పడం లేదని కొందరు చేసే వాదనలు పసలేనివి. ఉత్తర భారతంలో రాష్ట్ర భాష, హిందీ, ఇంగ్లీష్ నేర్పుతూనే ఉన్నారు. ఇక కొన్నిచోట్ల సంస్కృతాన్ని విద్యార్థులు మార్కుల స్కోర్ కోసం తీసుకుంటున్నారు. ఒక వ్యక్తి అనేక భాషలను నేర్చుకోవడం వల్ల ఆలోచనా శక్తి, విషయ పరిజ్ఞానం పెరుగుతాయి. వ్యక్తి జీవితం సౌకర్యవంతమౌతుంది. ద్రావిడవాద రాజకీయ నాయకులకూ, వంతపాడే స్వయం ప్రకటిత మేధావులకు ఈ విషయంలో ఇంగిత జ్ఞానం లోపించింది.

ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ హిందువులు ఆంగ్ల భాషను త్యజించాలని కేరళ సమావేశంలో కోరినట్లు చెప్పిన మాట శుద్ధ అబద్ధం. ఆంగ్ల భాషపై మక్కువ అనవసరమని ఆయన చెప్పిన విషయాన్ని వక్రీకరించడం ఎందుకు? ఇక దళితులు ఆంగ్ల భాష నేర్చుకుంటే వద్దనేది ఎవరు? అగ్రకులాలపై ద్వేషాన్ని, ఈర్ష్యను, క్రోధాన్ని, ఆగ్రహాన్ని కలిగించడానికి ఈ దేశంలో కొందరు నిబద్ధులైనారు.

నరేంద్రమోదీ అధికారానికి రాకముందు ఈ దేశంలో హిందీ, ఇంగ్లీష్ రెండూ దేశవ్యాప్తంగా ప్రాచుర్యాన్ని పొందాయని చెప్పడంలో రామచంద్ర గుహ ఆంతర్యం ఏమిటి? ఇంగ్లీషు భాష సాంకేతిక భాష అయినందువల్ల దాని ప్రాధాన్యతను ఎవరు తగ్గించలేరనే ఆ డొంక తిరుగుడు మాటలు ఏమిటి? మోదీ ప్రభుత్వ హయాంలో ఎక్కడైనా సాంకేతిక కళాశాలలో ఆంగ్లం బదులు ప్రాంతీయ భాషల్లో బోధనను మొదలుపెట్టారా? అధికారాన్ని అడ్డుపెట్టుకుని, ఆంగ్లభాషను అణచివేసి, హిందీ భాషకు సంఘ్ పరివార్ ప్రాచుర్యాన్ని తెచ్చిపెడుతుందని వ్యాసకర్త వాపోవడం విచిత్రం. పార్లమెంట్‌లో ఎక్కువమంది హిందీలో ప్రసంగిస్తారు. ఇది స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి జరుగుతున్న వ్యవహారం. కొంతమంది ఆంగ్లంలో కూడా మాట్లాడతారు. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం ఏమైనా మార్పు చేసిందా?

ద్రావిడవాద రాజకీయాలలో హిందీని వ్యతిరేకించడం ఒక భాగం. అది వారి రాజకీయ మనుగడకు అవసరం. పైగా హిందుత్వం ఆధారంగా రాజకీయాలు నడిపే భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది కాబట్టి హిందీ భాషపైన వీరి వ్యతిరేకత హెచ్చుగా ఉంటుంది. ద్రావిడవాద రాజకీయ నాయకులు సహజంగానే హిందు మత వ్యతిరేకులు. రామాయణంపై, రామునిపై అవాకులు, చవాకులు మాట్లాడిన కరుణానిధి, సనాతన ధర్మాన్ని అనుసరించే హిందువులు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే బ్యాక్టీరియా లాంటివారు అని నోరు పారేసుకున్న రాష్ట్ర మంత్రి, ఆయన మనుమడు ఉదయనిధి ఈ తానులోని ముక్కలే!

హిందువుల కోసం పనిచేసే సంస్థలను దూషించడం, ద్వేషించడం, ఇస్లామిక్ శక్తులకు వంతపాడడం రామచంద్ర గుహ మనుగడలో భాగం. అందుకే ఆయన ద్రావిడవాద రాజకీయ నాయకులు హిందీని వ్యతిరేకించడాన్ని సమర్థించుకొచ్చాడు. రెండు దృక్కోణాల మధ్య సంఘర్షణగా సిద్ధాంతీకరించాడు.

● కొండా సుమంత్‌రెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కేంద్రం తగ్గాలి.. రాష్ట్రాలు పెరగాలి!

కాలస్పృహలేని దేశంగా భారత్‌ను పాశ్చాత్య మేధావులు ఒకప్పుడు వర్ణించారు. సమాజంలో జరిగే మార్పులను క్రమపద్ధతిలో నమోదుచేసి ముందు తరాలకు అందించాలన్న తపన మనకు చాలా తక్కువని చెప్పటమే వారి ఉద్దేశం. పాశ్చాత్య చరిత్రలోలాగా లౌకిక విశేషాలను అక్షరబద్ధం చేసే అలవాటు మనకు ఎక్కువగా లేని మాట నిజమే! చరిత్రలో ఏ సంఘటనకైనా కాలనిర్ణయం చేయటం మనకు కత్తిమీద సామే! దానికి కారణాలు అనేకం. పాత చరిత్రను కాసేపు పక్కనబెట్టి సమకాలీన రాజకీయాలను గమనిస్తే మరో విశిష్టత కనిపిస్తుంది. అదే కాలయాపన! అవసరమైన విషయాలపై వెంటనే మనం దృష్టిపెట్టం. రాజ్యాంగం వచ్చిన పదేళ్లలో అందరినీ అక్షరాస్యులను చేయాలనుకున్నాం. చేయలేకపోయాం. అంటరానితనాన్ని సంపూర్ణంగా రూపుమాపాలనుకున్నాం. దాన్నీ చేయలేకపోయాం. ఇలా ఒకటీరెండూ కాదు.. మన కాలయాపనలు గురించి చాలా ఉదాహరణలు ఇవ్వొచ్చు. వీటిల్లో ఒకటి ఇప్పుడు మన రాజకీయాలను ఊపేస్తోంది.



> ఏ కోణం నుంచి చూసినా 75 ఏళ్ల కిందట రాష్ట్రాలకు నిర్దేశించిన హక్కులు, అధికారాలు ఇప్పటి పరిస్థితుల్లో సరిపోవన్నది స్పష్టమవుతూనే ఉంది. 1991 తర్వాత మారిన ఆర్థిక విధానాలతో రాష్ట్రాలకు వ్యాపార, పారిశ్రామికాభివృద్ధిపరంగా లభిస్తోన్న వెసులుబాట్లు రాజకీయాధికారాల్లో కూడా ప్రతిఫలించాలి. పునర్వ్యవస్థీకరణ చుట్టూ రేగుతున్న వివాదాలు ఆ ప్రతిఫలన కోసం సాగుతున్న పెనుగులాటలే! దక్షిణాది ఆర్థిక ప్రగతి రాజకీయాధికారంలో అధిక వాటాకోసం గొంతెత్తేలా చేస్తుంది. దీన్ని జాతీయవాద వ్యతిరేక ధోరణిగా చూస్తే జరిగేది నష్టమే!

పదేళ్లకొకసారి జనాభా సేకరణచేసి లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించాలని రాజ్యాంగ నిబంధన ఉన్నా 50ఏళ్లపాటు కాలయాపన చేశాం. రాజకీయ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్పటి ప్రభుత్వాలు దాన్నే పరిష్కారం అనుకున్నాయి. ఇప్పుడు కూడా కాలయాపన సృష్టించిన సవాళ్లను ఎదుర్కోవటం కంటే మళ్లీ పాత దారి తొక్కాలనే వాదన కూడా వినిపిస్తోంది. మరో పాతికో, యాభై ఏళ్లో పునర్వ్యవస్థీకరణను వాయిదా వేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అయిపోదు. నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచటం వల్ల రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ అసమానతలు తొలగిపోవు. ఆర్థికంగా ముందంజలో ఉన్న రాష్ట్రాల ఆదాయాన్ని వెనుకబడిన రాష్ట్రాలకు ఎంతకాలం తరలిస్తారన్న ప్రశ్నలు ఇప్పటికే బలంగా వినిపిస్తున్నాయి. 'మేం ఇచ్చేదెంత? మాకు వచ్చేదెంత?' అనే ప్రశ్నలు రాజకీయాల్లో సర్వసాధారణమైపోయాయి. కుటుంబ నియంత్రణ లక్ష్యాలను సాధిస్తే ఆదాయాల్లో కోతలు వేస్తారా అంటూ నిలదీయటం నిత్యకృత్యమైంది. ఉత్తరాది వెనుకబాటు భారాన్ని దక్షిణాది ఎందుకు మోయాలని అడగటానికీ సంశయించటం లేదు.

ఎన్నికల్లో లబ్ధి కోసమేనంటూ ఈ విమర్శలను కొట్టేయటం తేలిక. ప్రాంతీయ పార్టీలే వాటిని చేస్తున్నాయని ఆక్షేపించటమూ సులువే! కానీ సమస్య లోతుల్లోకి వెళ్లిచూస్తే ఈ విమర్శలను నిర్హేతుకమైనవిగా భావించలేం. రాష్ట్రాల మధ్య అసమానతలను కాదనలేం. వాటిని పరిష్కరించకుండా ఉత్తర–దక్షిణాదుల మధ్య నెలకొన్న భేదభావనలను పోగొట్టలేం.

రాజకీయ ఆధిపత్యం ఆర్థిక అంశాలను ప్రభావితం చేస్తుంది. చట్టసభల్లో సంఖ్యాబలం రాజకీయ ఆధిపత్యాన్ని నిర్ణయిస్తుంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్రాల బలాలు చట్టసభల్లో తారుమారైతే.. ప్రాంతాల ఆధిపత్యంలోనూ తీవ్రమార్పు వస్తుంది. హిందీ రాష్ట్రాలకు ఆధికాధిపత్యం ఉందన్న భావన ఇప్పటికే బలంగా నాటుకుంది. ఇతర మార్పుల జోలికి వెళ్లకుండా కేవలం జనాభా ప్రాతిపదికగా వివిధ రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్యలో మార్పులు తెస్తే ఉత్తరాది ఆధిపత్యం మరింత పెరుగుతుందన్న భయమూ ఉంది. దీన్ని నివారించి రాష్ట్రాల మధ్య సమతూకం ఉండేలా చూడటమే పెద్ద సవాలుగా మారింది.

పునర్వ్యవస్థీకరణపై దక్షిణాది రాష్ట్రాల నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నా ఇంతవరకూ కేంద్ర ప్రభుత్వం తన ఆలోచన ఏమిటో స్పష్టంచేయలేదు. కోవిడ్ పేరుతో వాయిదావేసిన జనాభా లెక్కల సేకరణ ఎప్పుడు మొదలుపెడతారో వెల్లడించలేదు. జనాభా ఆధారంగా మాత్రమే పునర్వ్యవస్థీకరణను చేపడితే ఒప్పుకొనేది లేదని దక్షిణాది నేతలు చేస్తున్న ప్రకటనలపై కేంద్ర మంత్రులు అప్పుడప్పుడూ స్పందిస్తున్నారు. తమిళనాడు ఒక్క లోక్‌సభ స్థానాన్నీ కోల్పోదని హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. అదే నిజమైతే లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య మొత్తంగా పెరగాలి.

నియోజకవర్గాల పెంపు నిజమైతే దానికి అనుసరించే సూత్రం ఏమిటన్న ప్రశ్న వస్తుంది. అందుకు ఉన్న రాజ్యాంగ నిబంధనలు ఏమిటి? వాటికి అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చేపడితే వివాదాలు సమసిపోతాయా? రాష్ట్రాల మధ్య చిచ్చుకు కారణమవుతున్న ఆదాయ పంపిణీలో అసమానతలు అంతమవుతాయా? అన్న ప్రశ్నలూ తలెత్తుతాయి. వీటిని సమగ్రంగా విశ్లేషించటం ఇటీవలే మొదలైంది. జెమీ హింట్‌సన్, మిలన్ వైష్ణవ్ 2019లో ఈ సమస్యపై రాసిన వ్యాసం ఆధారంగా ఇప్పటికీ వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత 2023లో శ్రుతీ రాజగోపాలన్ మరికొన్ని అదనపు విషయాలను విశ్లేషించారు. రాజ్యసభలో ప్రాతినిధ్యం ఎలా ఉండాలో చెబుతూ కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలు చేశారు.

లోక్‌సభ సీట్ల పంపకం రాజ్యాంగంలోని 81, 82 అధికరణాలను అనుసరించి జరగాలి. జనాభా దామాషాను బట్టి లోక్‌సభ సీట్లను రాష్ట్రాల మధ్య పంచటమే కాదు.. ఓటర్ల సంఖ్య రీత్యా ఆ సీట్లు సమానస్థాయిలో ఉండాలని కూడా ఆ అధికరణలు నిర్దేశించాయి. ఒక ఓటుకు ఒక విలువ సూత్రం ప్రకారం ఆ నిబంధనలను పొందుపరచారు. ప్రస్తుతం మనకు 20 లక్షలలోపు ఉన్న నియోజకవర్గాలూ ఉన్నాయి. 40 లక్షల వరకూ ఓటర్లు ఉన్నవీ కనపడతాయి. అంటే ఓటు విలువలో సమానత్వం లేదు.



■ రాహుల్ కుమార్

1971 నాటి జనాభా లెక్కల ప్రకారం చేసిన పునర్వ్యవస్థీకరణ ఆధారంగానే ప్రస్తుత లోక్‌సభ, శాసనసభ సీట్లు ఉన్నాయి. ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 1976లో ఒకసారి, 2002లో మరోసారి 25 ఏళ్ల చొప్పున పునర్వ్యవస్థీకరణపై నిషేధం విధించారు. 2026 తర్వాత చేపట్టబోయే జనాభా లెక్కలను అనుసరించి మాత్రమే పునర్వ్యవస్థీకరణను చేపట్టాలని 84వ రాజ్యాంగ సవరణ(2002) నిర్దేశించింది. జనాభా సేకరణను త్వరలో చేపట్టినా తుది లెక్కలు రావటానికి రెండేళ్లైనా పట్టొచ్చు. ఏ జనాభా లెక్కలు ఆధారంగా పునర్వ్యవస్థీకరణను చేపట్టాలన్నది 84వ రాజ్యాంగ సవరణకు ప్రభుత్వం ఇచ్చే వ్యాఖ్యానమే కీలకంగా ఉంటుంది. ప్రభుత్వం కావాలనుకుంటే సీట్లల్లో మార్పులను 2031 జనాభా సేకరణ లెక్కలు వచ్చేదాకా వాయిదానూ వేయొచ్చు!

తరిగేవి... పెరిగేవి...

రాష్ట్రం	ప్రస్తుత స్థానాలు	2011 జనాభా లెక్కల ప్రకారం వచ్చే సీట్లు	2026 నాటికి వచ్చే సీట్లు	848 సీట్లకి పెంచితే రాష్ట్రాల వాటాలు
తమిళనాడు	39	32	31	49
ఆంధ్రప్రదేశ్ + తెలంగాణ	42	37	34	54
కేరళ	20	15	12	20
ఒరిస్సా	21	18	18	28
పశ్చిమ బెంగాల్	42	40	38	60
కర్ణాటక	28	27	26	41
హిమాచల్‌ప్రదేశ్	4	3	3	4
పంజాబ్	13	12	12	18
ఉత్తరాఖండ్	5	4	4	7
అస్సాం	14	14	14	21
జమ్ము కశ్మీర్	6	6	6	9
ఛత్తీస్‌గఢ్	11	11	12	19
ఢిల్లీ	7	7	8	12
మహారాష్ట్ర	48	49	48	76
గుజరాత్	26	27	27	43
హర్యానా	10	11	11	18
జార్ఖండ్	14	15	15	24
మధ్యప్రదేశ్	29	32	33	52
రాజస్థాన్	25	30	31	50
బిహార్	40	46	50	79
ఉత్తర్ ప్రదేశ్	80	88	91	143

నోట్: కేంద్రపాలిత ప్రాంతాలు + చిన్న రాష్ట్రాలు మినహా

పెరిగిన జనాభా లెక్కలను తీసుకుని పునర్వ్యవస్థీకరణ చేస్తే మార్పులు తీవ్రంగానే ఉంటాయి. ఉదాహరణకు 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలను సర్దుబాటు చేస్తే దక్షిణాది రాష్ట్రాలు కోల్పోయేది ఎక్కువని అయిదేళ్ల కిందటే జెమీ హింట్‌సన్, మిలన్ వైష్ణవ్ వివరించారు. హిందీ రాష్ట్రాలు బాగా లబ్ధిపొందుతాయనీ తేల్చారు. పైన ఇచ్చిన పట్టిక చూస్తే ఈ తేడాలు స్పష్టంగా కనపడతాయి. దక్షిణాది రాష్ట్రాలు 18 స్థానాలు కోల్పోతాయి. ఇక ఈ ఏడాదే (2026) పునర్వ్యవస్థీకరణ జరిగితే లాభనష్టాలు ఇంకా ఎక్కువగా ఉంటాయి. అప్పుడు దక్షిణాది 26 సీట్లను కోల్పోతుంది. హిందీ రాష్ట్రాలకు అదనంగా 35 సీట్లు చేరతాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రం ఒక్కోసీటు మాత్రం తగ్గుతుంది. మొత్తంమీద బీజేపీకి పరిస్థితి అనుకూలంగా మారుతుంది.

పునర్వ్యవస్థీకరణతో ప్రస్తుతం ఉన్న సీట్లను ఏ రాష్ట్రమూ కోల్పోకూడదన్న లక్ష్యంతో 2011 జనాభా లెక్కల ఆధారంగా కసరత్తు చేస్తే మొత్తం సీట్లను 718కి పెంచాల్సి వస్తుంది. ఇక 2026 జనాభాని పరిగణనలోకి తీసుకుంటే పెరిగే సీట్లు 848 అవుతాయి. అప్పుడు కేరళ మినహా అన్ని రాష్ట్రాలకు సీట్లు పెరుగుతాయి. కానీ ఉత్తర, పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల మధ్య తేడాలు ఇంకా ఎక్కువవుతాయి. మొత్తం సీట్లల్లో దక్షిణాది శాతం ఇప్పటికంటే తగ్గిపోతుంది.

రాజ్యసభలో రాష్ట్రాలకు కేటాయించే సీట్లు కూడా జనాభాను బట్టే ఉంటాయి. జనాభా ప్రాతిపదికగా ఆ సీట్లను పెంచినా పరిస్థితి మారదు. లోకసభ సీట్ల విషయంలో తలెత్తిన పరిస్థితే ఇక్కడా ఎదురవుతుంది. అమెరికా సెనేట్‌లోగా ప్రతి రాష్ట్రానికి రాజ్యసభలో సమాన ప్రాతినిధ్యం కల్పించి ద్రవ్య బిల్లులకు దాని ఆమోదం తప్పనిసరి చేస్తే కొంత పరిష్కారం లభించొచ్చు. ఉత్తరాది ఎంపీలు దీనికి సిద్ధపడతారా? అన్నది పెద్దప్రశ్న. ఆధిపత్యాన్ని ఎవరూ ఉదారంగా వదులుకోరు. దీనికి భిన్నంగా శ్రుతీ రాజగోపాలన్ మరొక ప్రతిపాదన చేశారు. జనాభా ఆధారంగా రాజ్యసభ సీట్లను నిర్ణయించే ఫార్ములాకు సవరణ చేపట్టి.. ఆర్థికాభివృద్ధి ప్రకారం కేటాయింపులో మార్పులు చేయవచ్చనీ సూచించారు. రాష్ట్రం సొంత తలసరి రెవెన్యూని బట్టి రాజ్యసభ సీట్లను తగ్గించటం గానీ పెంచటం గానీ చేయగలగాలి. శ్రుతి ఫార్ములా ప్రకారం జాతీయ తలసరి రెవెన్యూని ప్రాతిపదికగా తీసుకుని ఒక రాష్ట్రం సొంత రెవెన్యూ నిష్పత్తి అందులో ఎంత ఉందో చూడాలి. జాతీయ తలసరికి సమానంగా అది ఉంటే, జనాభా ప్రాతిపదికన కేటాయించే రాజ్యసభ సీట్లు యథాతథంగా ఉంటాయి. ఒకవేళ తక్కువ ఉంటే ఆ మేరకు సీట్లలో కోతపడుతుంది. ఎక్కువ ఉంటే సీట్లు పెరుగుతాయి. ఉదాహరణకు బిహార్ తలసరి సొంత రెవెన్యూ.. కోవిడ్‌కు ముందు రూ.2,356 ఉంది. జాతీయ సగటు రూ.8,771తో పోల్చితే దాని నిష్పత్తి 0.27 అవుతుంది. తాజా జనాభా (2026) ప్రకారం బిహార్‌కు 21 రాజ్యసభ సీట్లు లభిస్తాయి. కానీ సొంత రెవెన్యూ నిష్పత్తి (0.27) ప్రకారం 5–6 సీట్లే దక్కుతాయి. ఈ పద్ధతి ఆర్థికంగా ముందుండే దక్షిణ, పశ్చిమాదులకు బాగా లాభిస్తుంది. ఇట్లా రాష్ట్రాల రాజ్యసభ ప్రాతినిధ్యాన్ని సొంత రెవెన్యూతో ముడిపెట్టాలి. దాంతో వెనుకబడిన రాష్ట్రాలు కూడా ఆర్థికాభివృద్ధిని సాధించి రాజ్యసభలో ప్రాతినిధ్యం పెంచుకోటానికి కృషిచేస్తాయి.

> మరో పాతికో, యాభై ఏళ్లో పునర్వ్యవస్థీకరణను వాయిదా వేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అయిపోదు. నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచటం వల్ల రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ అసమానతలు తొలగిపోవు.

ఏ కోణం నుంచి చూసినా 75 ఏళ్ల కిందట రాష్ట్రాలకు నిర్దేశించిన హక్కులు, అధికారాలు ఇప్పటి పరిస్థితుల్లో సరిపోవన్నది స్పష్టమవుతూనే ఉంది. 1991 తర్వాత మారిన ఆర్థిక విధానాలతో రాష్ట్రాలకు వ్యాపార, పారిశ్రామికాభివృద్ధి పరంగా లభిస్తోన్న వెసులుబాట్లు రాజకీయాధికారాల్లో కూడా ప్రతిఫలించాలి. పునర్వ్యవస్థీకరణ చుట్టూ రేగుతున్న వివాదాలు ఆ ప్రతిఫలన కోసం సాగుతున్న పెనుగులాటలే! దక్షిణాది ఆర్థిక ప్రగతి రాజకీయాధికారంలో అధిక వాటాకోసం గొంతెత్తేలా చేస్తుంది. దీన్ని జాతీయవాద వ్యతిరేక ధోరణిగా చూస్తే జరిగేది నష్టమే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

శాంతి చర్చలకు సిద్ధమై పరిణతి చూపించారు!

చనిపోయేది ఎవరైతేనేమి, ముందుకే పోవాలని ఇరు పక్షాలూ అనుకొనే యుద్ధాలు కొన్ని ఉంటాయి. వాటిలో ఎవరి ప్రయోజనాలు వాళ్లకు ఉంటాయి. కానీ దురాక్రమణకు, స్వీయ సంరక్షణకు మధ్య సాగే యుద్ధాలు వీటికి భిన్నమైనవి. మధ్య భారతదేశంలో జరుగుతున్న యుద్ధం ఇలాంటిదే. ఈ యుద్ధంలో భారత ప్రభుత్వానికి సాధారణ ప్రజలే లక్ష్యం. బైటికి మాత్రం మావోయిస్టులతో తలపడుతున్నానని అంటోంది. కానీ మరణిస్తున్నవాళ్లలో మూడొంతుల మంది సాధారణ ప్రజలని మావోయిస్టులే చెబుతున్నారు.

ఈ హత్యాకాండ ఆగాలనే ప్రజాస్వామిక ఆందోళనలకు కొనసాగింపుగా హైదరాబాదులో శాంతి చర్చల కమిటీ ఏర్పడింది. "భారత ప్రభుత్వమూ, మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణను పాటించి శాంతి చర్చలకు సిద్ధం కావాలి" అని ఈ కమిటీ ప్రతిపాదించింది. ఈ యుద్ధంలో సాధారణ ప్రజల ప్రాణాలు పోవడానికి వీల్లేదనే మానవీయ ఆకాంక్షతో మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధపడింది. ఈ మేరకు గత నెల 28న ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది మానవ ప్రాణం పట్ల మావోయిస్టుల వైఖరిని తెలియజేస్తోంది. ఒకటిన్నర పేజీల ఈ ప్రకటనలో తమ పార్టీ నాయకుల, కార్యకర్తల మరణాల కంటే ఆదివాసుల ప్రాణాలకే వాళ్లు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.

నిజానికి మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధం కావడం ఇది మొదలు కాదు. 2002లో, 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాంతి చర్చలు ఒక దశ దాకా జరిగి విఫలమయ్యాయి. ఆ తర్వాత కూడా పశ్చిమ బెంగాల్‌లో మమత అధికారంలోకి వచ్చాక శాంతి చర్చల ప్రస్తావన వచ్చినప్పుడు మావోయిస్టు పార్టీ సానుకూలంగా స్పందించింది. 2023 డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వమే శాంతి చర్చల ప్రతిపాదన పదేపదే తీసుకొచ్చింది. దానికి రెండుసార్లు మావోయిస్టుపార్టీ దండకారణ్య కమిటీ సంసిద్ధత తెలియజేసింది. ప్రభుత్వమే శాంతి చర్చలకు సిద్ధమైంది కాబట్టి, సానుకూల వాతావరణం ఏర్పాటు చేయాలని, దీని కోసం కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలను బ్యారెక్‌లకే పరిమితం చేయాలని, కొత్త సైనిక క్యాంపులు ఏర్పాటు చేయరాదని సూచించింది. అయినా ప్రభుత్వం అడుగు ముందుకు వేయలేదు. ఒక పక్క శాంతి చర్చలు అంటూనే ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది.

ఇప్పుడు మళ్లీ హైదరాబాదులో ఏర్పడ్డ శాంతి చర్చల కమిటీ పౌర సమాజం వైపు నుంచి శాంతి చర్చల ప్రతిపాదన చేసింది. ఈసారి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీయే స్పందించింది. సాయుధ పోరాటం వల్లేనేగాక అనేక ఇతర ప్రక్రియల వల్ల ప్రజా ప్రయోజనాలు నెరవేరుతాయనే ప్రజాస్వామిక దృక్పథం ఉండటమే దీనికి కారణం. తీవ్రమైన యుద్ధం మధ్యలో చిక్కుకొని కూడా ప్రజల ప్రయోజనాల కోసం శాంతి చర్చలకు సిద్ధమని చెప్పడం మావోయిస్టుల రాజకీయ పరిణతిని సూచిస్తోంది. లక్షలాది బలగాలు, వందలాది సైనిక క్యాంపుల మధ్య ఆదివాసుల జీవితానికి భద్రత లేకుండా పోయింది కాబట్టి, గతంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందు దండకారణ్య కమిటీ పెట్టిన ప్రతిపాదనలనే ఇప్పుడు ఆ పార్టీ కేంద్ర కమిటీ పెట్టింది. ఈ విడత శాంతి చర్చల ప్రస్తావనకు ఇంత నేపథ్యం ఉన్నది.

> ఆపరేషన్ కగార్‌లో సాధారణ ప్రజల ప్రాణాలు పోవడానికి వీల్లేదనే మానవీయ ఆకాంక్షతో మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధపడింది. తీవ్రమైన యుద్ధం మధ్యలో చిక్కుకొని కూడా ప్రజల ప్రయోజనాల కోసం శాంతి చర్చలకు సిద్ధమని చెప్పడం మావోయిస్టుల రాజకీయ పరిణతిని సూచిస్తోంది. ఒకటిన్నర పేజీల ఆ ప్రకటనలో తమ పార్టీ నాయకుల, కార్యకర్తల మరణాల కంటే ఆదివాసుల ప్రాణాలకే మావోయిస్టులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.



అయితే ఈ మారణకాండ ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే జరగడం లేదు. అక్కడ తీవ్రంగా ఉన్నప్పటికీ మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిషా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా కగార్ యుద్ధం నడుస్తున్నది. అందువల్ల ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సహా, కేంద్రం ముందు శాంతి చర్చలకు తమ సమ్మతిని మావోయిస్టులు తెలియజేశారు. "మధ్య, తూర్పు భారతదేశంలోని పీడిత ప్రజల, పీడిత సాంఘిక సముదాయాల, పీడిత జాతులపై జరుగుతున్న కగార్ యుద్ధాన్ని నిలిపివేయాలి" అని మావోయిస్టులు డిమాండ్ చేశారు.


కాబట్టి ఇది మావోయిస్టులకు –ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య తలెత్తిన సమస్య కాదు. మధ్య, తూర్పు భారతదేశంలోని ఆదివాసీ, పీడిత ప్రజలకు – ప్రభుత్వానికి మధ్య నడుస్తున్న సంఘర్షణ. ఆ ప్రాంతాల్లోని సహజ సంపదలకు అక్కడున్న ఆదివాసీ ప్రజలు సంరక్షకులు. వాళ్ల అస్తిత్వానికి, స్వయం పాలనలోని రాజకీయ, సాంస్కృతిక జీవన విధానానికి భారత రాజ్యాంగం గుర్తింపును ఇచ్చింది. చట్టబద్ధమైన రక్షణ కల్పించింది. ప్రభుత్వం దీన్ని ఉల్లంఘించి అభివృద్ధి అనే పేరుతో ఆదివాసీ ప్రాంతాల కార్పొరేటీకరణకు పాల్పడుతోంది. ప్రభుత్వ అభివృద్ధి నమూనా వల్ల తలెత్తిన ఈ యుద్ధం ఆదివాసులను బలి తీసుకుంటోంది. దీన్ని ఆపడానికి శాంతి చర్చల కమిటీ చేసిన ప్రతిపాదనలను మావోయిస్టులు గౌరవించారు. "ప్రజల ప్రయోజనాల కోసం మేము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే" అని స్పష్టంగా ప్రకటించారు.

ఈ యుద్ధంలో భారత ప్రభుత్వం తన అజమాయిషీలో ఉండే సైనిక బలగాలే గాక ఆదివాసీ యువతను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకొని, వారి చేతనే ఆదివాసులను హత్య చేయిస్తున్నదని కూడా మావోయిస్టులు తమ ప్రకటనలో అన్నారు. అట్లాగే గత ఏడాది నుంచి వందలమంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రభుత్వం చెబుతోంది. అణచివేతలాగే బలవంతపు లొంగుబాటు కూడా ప్రభుత్వ వ్యూహంలో భాగం. వీళ్లంతా ఆదివాసులు. దండకారణ్య ప్రజలపై జరుగుతున్న యుద్ధంలో ఈ 'లొంగిపోయిన నక్సలైట్లను' భాగం చేసే ప్రమాదం ఉన్నది. అంటే ఒక రకమైన అంతర్యుద్ధ వాతావరణం అక్కడ నెలకొని ఉన్నది. ఏ రకంగా చూసినా ఇది ప్రజల ఉనికిని పూర్తిగా దెబ్బతీస్తుంది.

ఈ పరిస్థితుల్లో మావోయిస్టులు కేవలం ఆదివాసీల గురించేగాక గైరాదివాసీల ప్రయోజనాల గురించి కూడా ఆలోచించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేస్తే ఈ అన్ని సమూహాల మౌలిక సమస్యలను ముందుకు తీసుకొస్తారు. పాలకుల అభివృద్ధి నమూనా వల్ల తలెత్తిన ఈ హత్యాకాండ ఆగాలని కోరుకుంటున్నారు కాబట్టి మావోయిస్టులు దీన్ని కేవలం రాజకీయార్థిక విషయంగానే చూడ్డం లేదు. రాజ్యాంగబద్ధ పాలనలోని సామాజిక, సాంస్కృతిక విషయాలను సహితం ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం "మత మైనారిటీలపై వివక్షతను రాజ్యాంగబద్ధం చేస్తోంది" అని చెబుతూ, ఆదివాసీ–గైరాదివాసీ సంస్కృతీ సంప్రదాయాల రక్షణ, మాతృభాషల, పర్యావరణ రక్షణ వైపు నుంచి కూడా మాట్లాడారు.

మావోయిస్టుల ప్రకటన రాగానే ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం చర్చలకు సిద్ధమే అంటూ, ఆయుధాలు వదిలిపెట్టాలని అన్నది. మావోయిస్టులు ఆయుధాలు వదిలేస్తే ఇక చర్చలు జరగాల్సిన పనే ఉండదు. శాంతి చర్చలకు మావోయిస్టులు సూత్రబద్ధ, నిర్మాణాత్మక ప్రతిపాదనలు సూచిస్తే, ప్రభుత్వం మాత్రం చర్చలు జరగనవసరం లేని కండీషన్ పెట్టింది. ఈ అసంబద్ధతను ప్రజాస్వామికవాదులు గుర్తించాలి. చర్చనీయాంశం చేయాలి. ఈ పని కూడా మావోయిస్టుల కోసం కాదు. వాళ్లూ కోరుకుంటున్న ప్రజల ప్రయోజనాల కోసం.

■ పాణి



నయా నగరి..!

10 నెలల్లో 100 పరిష్కారాలు

మారుతున్న బెజవాడ.. అభివృద్ధికి అడుగుజాడ

- విమానాశ్రయంలో ఊపందుకున్న పనులు
- నగరంవైపు చూస్తున్న కీలక ఐటీ కంపెనీలు
- అస్తవ్యస్తంగా ఉన్న రహదారులకు మహర్దశ
- రియల్ ఎస్టేట్ రంగంలో పెను మార్పులు
- అందమైన జాతీయ రహదారులతో కొత్తకళ
- పెరిగిన పౌరస్పృహ..85 శాతం హెల్మెట్‌ధారణ



మెట్రో రైల్ ప్రాజెక్టులో కదలిక.. రియల్ రంగంలో కీలక మార్పులు.. సరికొత్త జాతీయ రహదారులు.. వేగంగా విమానాశ్రయ పనులు.. క్యూ కడుతున్న ఐటీ పరిశ్రమలు.. తగ్గిన వీఐపీల రాకపోకల కష్టాలు.. ట్రాఫిక్ నిబంధనలపై పౌరుల్లో పెరిగిన అవగాహన.. హెల్మెట్‌ధారణ.. పది నెలల కాలంలో ఎంత మార్పు..! ప్రస్తుతం నగరవాసులు ఇదే ఆనందాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. గతంలో దుస్థితికి, ఇప్పటి పరిస్థితికి బేరీజు వేసుకుంటూ వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడను చూసి మురిసిపోతున్నారు. కీలకమైన రహదారుల అభివృద్ధి పనులను స్వాగతిస్తున్న వారు భవిష్యత్తులో నయా నగరిని తలచుకుంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. - కథనం 6లో




అద్దంలా మెరిసిపోతున్న విజయవాడ వెస్ట్ బైపాస్

జిల్లాలో న్యాయాధికారుల బదిలీ

ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి హిమబిందుకు న్యాయసేవా ప్రాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా పోస్టింగ్ 6లో

గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు తోడు దుమ్మూధూళి, జోరువర్షం కూడా రావడంతో బెజవాడ గజగజలాడింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణానికి నగరవాసులు అతలాకుతలం కాగా, విజయవాడ రూరల్ మండలాల్లోని రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. మావిడి, మొక్కజొన్న నేలరాలగా, కల్లాల్లో ఉన్న ధాన్యంపై పట్టాలు కప్పే సమయం కూడా లేకుండాపోయింది. మీనాక్షి నగర్‌లో ఓ రేకుల షెడ్డు కూలిపోగా, జి.కొండూరులో గోడ కూలి వ్యక్తి మరణించాడు. మరో రెండు మూడు రోజుల పాటు ఈ వాతావరణం కొనసాగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

గాలివాన బీభత్సం



ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో గాలి దుమ్మూధూళి (ఇన్‌సెట్‌లో) మైలవరంలో జోరువాన

జిల్లాను కుదిపేసిన ఈదురుగాలులు, వర్షాలు

ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం



మైలవరంలో నేలరాలిన మామిడికాయలు

- నగరంలో భారీగాలులకు జనజీవనం అస్తవ్యస్తం
- రూరల్ మండలాల్లో పంటలకు తీవ్రనష్టం
- నేలరాలిన మామిడి కాయలు, మొక్కజొన్న
- కల్లాల్లోని ధాన్యంపై పట్టాలు కూడా కప్పుకోలేని స్థితి
- జి.కొండూరులో కోళ్లఫారం గోడ కూలి కండక్టర్ మృతి
- మీనాక్షి నగర్‌లో కూలిన రేకుల షెడ్డు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అప్పటి వరకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చెట్లన్నీ అటూ ఇటూ ఊగాయి. గాలులకు దుమ్మూధూళి పైకి లేచింది. జిల్లాలో సోమవారం సాయంత్రం గంటపాటు కనిపించిన దృశ్యాలివి. విజయవాడతో పాటు నగరానికి 30-40 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ముందు ఈదురుగాలులు.. ఆ తర్వాత వర్షం మొదలైంది. గాలులకు దుమ్మూధూళి పైకి లేవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. మామిడి నేల రాలింది. మైలవరం, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలం, వీరులపాడు మండలం జుజ్జూరులో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. రెడ్డిగూడెంలో భారీవర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలంలో కల్లాల్లో ఉన్న ధాన్యంపై పట్టాలు కప్పే సమయం ఇవ్వకుండా గాలులు బీభత్సం సృష్టించాయి. హోరున కురిసిన వర్షానికి ధాన్యం తడిచి ముద్దయింది. జి.కొండూరు మండలంలో మిర్చిపంట మిగతా 6లో..

థండర్‌స్టార్మ్‌ల వల్లే..


వరుసగా కొన్ని రోజులపాటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు నమోదైతే తర్వాత థండర్‌స్టార్మ్‌లు ఏర్పడతాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. అందులో భాగంగానే ఈదురుగాలులు, వర్షాలు వస్తున్నాయని వారు అభిప్రాయ పడుతున్నారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో గంటకు 100 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. ఈ పరిస్థితి మరో రెండు, మూడు రోజులు ఉంటుందని పేర్కొంటున్నారు.

కండిషన్ సీరియస్..!

డేంజర్ బెల్స్ మోగిస్తున్న ఉమ్మడి కృష్ణాజిల్లా ఆరోగ్య గణాంకాలు

- హృద్రోగ సమస్యల్లో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా ఫస్ట్
- డయాబెటిస్‌లో ఎన్టీఆర్, కృష్ణాలు.. రెండు, మూడు స్థానాలు
- షుగర్, న్యూరో, కేన్సర్, లివర్ వ్యాధుల్లోనూ హెచ్చు కేసులు
- గణాంకాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు

'ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులారా.. పారాహుషార్. మీ ఆరోగ్యాలను కాపాడుకోండి. లేదంటే ప్రమాదం పొంచి ఉంది.' నిజమే.. ప్రాణాంతక వ్యాధులకు ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా ప్రజలు దగ్గరవుతుండగా, కృష్ణాజిల్లా ఆ తర్వాత స్థానంలో నిలుస్తోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, చెడు వ్యసనాల కారణంగా హృద్రోగాలతో పాటు బీపీ, షుగర్, కేన్సర్, ఇతర వ్యాధులకు ఉమ్మడి కృష్ణాజిల్లావాసులు బాగా దగ్గరవుతుండగా, వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు సోమవారం జిల్లాలవారీగా హెల్త్ రిపోర్టులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి ప్రమాద తీవ్రతను, ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సీఎం చంద్రబాబు విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లాలో అనారోగ్య డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. హృద్రోగాలు, కేన్సర్, బీపీ, షుగర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు రెండు జిల్లాల ప్రజలు దగ్గరగా ఉన్నారు. గుండె సంబంధ వ్యాధుల్లో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానం, కృష్ణాజిల్లా ఆరో స్థానంలో నిలవడం కలవరపడాల్సిన విషయం. ఎన్టీఆర్ జిల్లాలో సగటున 15,665 మందికి గుండెజబ్బులు వస్తున్నాయి. ఈ ఏడాది కొత్తగా మొత్తం 13,106 కేసులు నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 50-54 ఏళ్లు, కృష్ణాజిల్లాలో 60-64 ఏళ్ల వారికి ఎక్కువగా గుండెవ్యాధులు వస్తున్నాయి. ఆహారపు అలవాట్లు సరిగ్గా లేకపోవటం, దురలవాట్ల కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది.

డయాబెటిస్‌లో టాప్-2

59,921 డయాబెటిస్ కేసులతో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలవగా, 58,136 కేసులతో కృష్ణాజిల్లా మూడో స్థానంలో ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో 45-59 ఏళ్లు, కృష్ణాజిల్లాలో 50-54 ఏళ్ల వారికి డయాబెటిస్ ఎక్కువగా వస్తోంది. బీపీ, డయాబెటిస్‌లను కలిపి చూసినా కూడా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు రాష్ట్రంలోనే 2, 3 స్థానాల్లో ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 1,25,339 కేసులు, కృష్ణాజిల్లాలో 1,11,932 కేసులు ఉన్నాయి.

కేన్సర్, కాలేయ వ్యాధుల్లోనూ..

కేన్సర్ కేసుల్లో ఎన్టీఆర్ జిల్లా దూసుకెళ్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 5,151 కేసులతో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ మిగతా 6లో..

బీపీలోనూ తగ్గేదేలే..!

బీపీ కేసుల్లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు వరుసగా 3, 5 స్థానాల్లో నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లాలో 98,337 కేసులు నమోదు కాగా, కృష్ణాజిల్లాలో 94,266 కేసులు నమోదయ్యాయి. ఎన్టీఆర్‌లో 50-54 సంవత్సరాల్లోపు ఉన్న వారికి, కృష్ణాజిల్లాలో 60-64 ఏళ్ల వారికి బీపీ ఎక్కువగా వస్తోంది.

వచ్చేనెల 10న మొదటి విడత చెల్లింపులు

- కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం, రైతుల రెండో విడత చర్చలు
- చెల్లింపులకు యాజమాన్యం ఆమోదం
- ముందుగా రుణాలు తీసుకోని రైతులకు..



రైతులతో ఎమ్మెల్యే తాతయ్య సమావేశం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కోల్డ్ స్టోరేజీ బాధితులకు తొలి విడతగా వచ్చేనెల 10న రూ.2 కోట్ల మేర చెల్లింపులు జరిపేందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఎస్, వీవీకే కల్యాణ మండపంలో సోమవారం కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం, రైతులతో సమావేశం నిర్వహించారు. మిర్చి, అపరాలను నిల్వ చేశాక యాజమాన్యం నుంచి అసలు రుణాలు తీసుకోని రైతులకు టిక్కీకి రూ.2 వేల చొప్పున చెల్లించేందుకు యాజమాన్యం చేసిన ప్రతిపాదనను రైతులు అంగీకరించారు. తమ వద్ద ఉన్న లెక్కల ఆధారంగా వచ్చేనెల 10వ తేదీన నగదు అందజేస్తామని యాజమాన్యం ప్రతినిధి తెలిపారు. రెండో విడతలో కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం వద్ద ముందుగా డబ్బు తీసుకున్న రైతులకు చెల్లింపులు చేస్తామని పేర్కొన్నారు. ఏఎంసీ సెక్రటరీ ఎన్వీ నరసింహారావు, జగ్గయ్యపేట ఎస్సై జి.రాజు, ఆర్ఐ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.





- కొత్తగా పాస్‌పోర్టు కార్యాలయం.. నేడే ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రభవనాన్ని తలపించేలా విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం కొలువుతీరింది. బందరు రోడ్డులోని హోటల్ మనోరమ పక్కన ఉన్న స్టాలిన్ భవనం నాల్గో అంతస్థులో ఈ కార్యాలయం ఏవిధంగా తీర్చిదిద్దారన్న దానిపై పాస్‌పోర్టు శాఖ సోమవారం మీడియా టూర్ నిర్వహించింది. ఈ కేంద్రాన్ని మంగళవారం కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. సందర్శకుల కోసం తీర్చిదిద్దిన అధునాతన సదుపాయాలను పాస్‌పోర్టు ఆఫీసర్ శివ హర్ష మీడియాకు వివరించారు. ఆకట్టుకునే లాంజ్, వెయిటింగ్ హాల్, పాస్‌పోర్ట్ ఆఫీసర్ల వర్కింగ్ సెక్షన్, పాస్‌పోర్టు పాలసీ, మీటింగ్ హాల్, పాస్‌పోర్టు ఆఫీసర్ చాంబర్, లైబ్రరీ, ఇతర వెయిటింగ్ హాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అమరావతికి రియల్ బూమ్

రియల్ సంస్థలకు ప్రభుత్వ ఆహ్వానాలు

- బెంగళూరు టాప్-5 కంపెనీలతో మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ భేటీ.. సానుకూల స్పందన

విజయవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతికి రియల్ బూమ్ తీసుకొచ్చేందుకు సీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. దేశీయంగా టాప్-10లో ఉన్న రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలను ఆహ్వానించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ముందుగా ఇండియాలో సిలికాన్ సిటీగా పేరొందిన బెంగళూరులోని టాప్-5 రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలకు సీఆర్‌డీఏ అధికారులు తాజాగా ఆహ్వానం పలికారు. దేశంలోనే అగ్రశేణి రియల్ ఎస్టేట్ మార్కెట్లలో బెంగళూరు కూడా ఒకటి కావటంతో సీఆర్‌డీఏ అధికారులు ముందుగా దీనిని ఎంచుకున్నారు. ఇటీవలే బెంగళూరు వెళ్లిన మునిసిపల్ మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబులు అక్కడ టాప్-5 సంస్థలతో భేటీ అయ్యారు. అమరావతిని ప్రపంచ స్థాయిలో ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నారో వివరించి.. అక్కడ పెట్టుబడులు పెడితే తాము భూములు ఇస్తామని ఆఫర్ చేశారు. అమరావతిలో హైరైజ్, రెసిడెన్షియల్, కమర్షియల్, వర్క్ ప్లేసెస్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సిందిగా కోరారు. బెంగళూరులోని టాప్-5 కంపెనీల్లో ప్రెస్టీజ్, శోభా, బ్రిగేడ్, గోద్రేజ్, మంథన్ ఎస్టేట్స్ ఉన్నాయి. తాము అమరావతి రావటానికి సిద్ధంగానే ఉన్నామన్న ఆసక్తిని తెలిపాయి. కొన్ని సందేహాలను కూడా వ్యక్తం చేశాయి. అమరావతి నిర్మాణం జరుగుతున్న దశలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు వెంటనే డిమాండ్ ఉంటుందా అనే సందేహాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. అమరావతిని ప్రజా రాజధానిగా తీర్చిదిద్దటానికి అన్ని కార్యక్రమాలను చేపట్టామని, అమరావతి చుట్టూ రియల్ బూమ్ కేంద్రీకృతమైందని, తప్పకుండా ప్రాజెక్టులు విజయవంతమవుతాయని మంత్రి, కమిషనర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్టాంప్ డ్యూటీ వంటి కొన్ని వినహాయింపులు కూడా కోరినట్టు తెలిసింది. ఇలాంటి వినహాయింపులపై ముఖ్యమంత్రి స్థాయిలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

టాప్-10 రియల్ ఎస్టేట్ సంస్థలతో సీఎం భేటీ

త్వరలో దేశంలోని టాప్-10 రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో భేటీ కానున్నారు. దేశంలోని టాప్-10 సంస్థలను అమరావతికి ఆహ్వానించి ఇక్కడ చేపడుతున్న ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో చూపించనున్నారు. ఆ తర్వాత సీఎం స్థాయిలో సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇచ్చే ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం ఉంటుంది.

అదానీ, హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్స్ ఆసక్తి

అమరావతి రాజధానిపై అదానీ, హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్స్ వంటి బడా నిర్మాణ సంస్థలు కూడా ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన డీఎస్ఆర్ గ్రూప్ కూడా అమరావతిలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై ఆసక్తి చూపిస్తోంది.

దుర్గమ్మకు పూల సొబగులు

ముగిసిన వసంత నవరాత్రుల పుష్పార్చన



6లో

దుర్గమ్మకు పూల సొబగులు

- దుర్గగుడిలో ముగిసిన వసంత నవరాత్రుల పుష్పార్చన
- నేటినుంచి చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో సోమవారం రెండు విశిష్ట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అపరాజిత కనకదుర్గమ్మకు వసంత నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు రోజుకొకరకం పుష్పాలతో అర్చించారు. కనకదుర్గమ్మను పుష్పాలతో పూజించటం వలన భక్తులకు మనశ్శాంతి, ఏకాగ్రత లభిస్తాయని నమ్మిక. దేవస్థానంలో చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని కనకాంబరాలు, చేమంతులు, గులాబీలు, సన్నజాజులు, మల్లెలు, మందారాలు, సంపెంగలు, లిల్లీ, మరువం, దవనం, కమలాలు, ఎర్ర గన్నేరు, ఎర్ర తామర.. ఇలా అనేక పుష్ప కదంబంతో దుర్గమ్మను తొమ్మిదిరోజులు అర్చించారు. సోమవారం ముగింపుగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణాహుతిని నిర్వహించారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

శ్రీరామచంద్రమూర్తికి సోమవారం దుర్గగుడిలోని వేదికపై పట్టాభిషేక మహోత్సవాన్ని మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. జానకమ్మను ఆదివారం పెండ్లాడిన రఘురాముడు పట్టాభిషిక్తుడయ్యాడు. శాస్త్రానుగుణంగా అర్చకులు పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా జిల్లా జడ్జీల బదిలీ

- హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పార్థసారథి

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి(పీడీజే) వైవీఎస్‌బీజీ పార్థసారథి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా నియమితులయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం మేరకు ఆర్‌జీ నియామకంపై హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్స్/రిజిస్ట్రార్ జనరల్(ఎఫ్‌ఏసీ) సోమవారం ఉత్తర్వులిచ్చారు. మరోవైపు సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 54 మంది పీడీజేలు, డీజేలను బదిలీ చేసి, వారికి కొత్త పోస్టింగులు ఇస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా ఉన్న ఎం.బబిత విజయనగరం ప్రిన్సిపల్ జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. అనంతపురం, చిత్తూరు జిల్లాల పీడీజేలుగా ఉన్న జి.శ్రీనివాస్, ఇ.భీమారావు వరుసగా నెల్లూరు, అనంతపురం జిల్లాలకు అదే స్థానాలకు బదిలీ అయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్.శ్రీదేవి ఏలూరు పీడీజేగా వెళ్లనున్నారు. విశాఖపట్నం జిల్లా పీడీజే ఆలపాటి గిరిధర్ ఏపీ వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా పీడీజే సి.యామిని కడప జిల్లా పీడీజేగా బదిలీ అయ్యారు. ఇక్కడి పీడీజే గొల్ల శ్రీదేవి అనంతపురం ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్, లేబర్ కోర్టు పీవోగా బదిలీ అయ్యారు. విజయనగరం పీడీజే బి.సాయికల్యాణ్ చక్రవర్తి గుంటూరు జిల్లా పీడీజేగా బదిలీ అయ్యారు. వీరంతా ఈనెల 21వ తేదీలోపు కొత్త బాధ్యతలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్స్ నోటిఫికేషన్ ఇచ్చారు.

రబీ ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి: రామకృష్ణ

అమరావతి: రైతులు రబీలో పండించిన ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేసి, ఆ వెంటనే మద్దతు ధర చెల్లించే చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సోమవారం ఆయనలేఖ రాశారు. 'ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలులో రైతులు, కౌలురైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువెళుతుంటే తేమ శాతం అధికంగా ఉందంటూ తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రామకృష్ణ కోరారు.

వల్లభనేని వంశీకి బెయిల్

- భూ వివాదం కేసులో గన్నవరం కోర్టు మంజూరు

గన్నవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి భూ వివాదం కేసులో గన్నవరం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. తనకు అగ్రిమెంట్ చేసిన పొలాన్ని ఆన్‌లైన్ చేయిస్తానని నమ్మించి, డాక్యుమెంట్‌లు, పాస్‌బుక్స్ తీసుకుని మోసం చేయటమే కాకుండా అదేమని అడిగినందుకు బెదిరించి, కుట్రపూరితంగా తప్పుడు పత్రాలు సృష్టించి వేరే వాళ్లకు రిజిస్ట్రేషన్ చేయించారని వంశీతోపాటు అతని అనుచరులపై కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన శనగల శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మరో కేసులో విజయవాడ జైలులో ఉన్న వంశీని ఆత్కూరు పోలీసులు గన్నవరం కోర్టులో హాజరు పరచగా ఈ నెల 15 వరకూ రిమాండ్ విధించారు. కేసులో బెయిల్ మంజూరు చేయాలని వంశీ తరఫున న్యాయవాది పిటిషన్ వేయగా, ఇరుపక్షాల వాదనలు ఉన్న న్యాయాధికారి సోమవారం బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చారు. ఇద్దరు జామీనుదారులు రూ.25వేలు చొప్పున పూచీకత్తు సమర్పించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని షరతులు విధించారు.

సచివాలయ బ్లాకుల్లో ఎంకే మీనా ఆకస్మిక తనిఖీలు

అమరావతి: ఇటీవల అమరావతి సచివాలయం రెండవ బ్లాకులోని బ్యాటరీల రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి (పొలిటికల్) ముఖేష్ కుమార్ మీనా సోమవారం సచివాలయంలోని అన్ని బ్లాకులు, ఆవరణలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చెత్త తొలగింపు, పరిశుభ్రత తదితర అంశాలపై అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆయనతోపాటు సీఆర్‌డీఏ, విద్యుత్‌శాఖ అధికారులు అన్ని బ్లాకుల్లోని యూపీఎస్ బ్యాటరీ గ్యాలరీతోపాటు వివిధ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ ఆడిట్ నిర్వహించారు. మంత్రులు, కార్యదర్శుల పేషీలు, చాంబర్లు, ముఖ్యమైన పరికరాలు, కంప్యూటర్ సర్వర్లు ఉన్న ప్రాంతాలను పరిశీలించి.. ఆయా ప్రాంతాల్లో మెయిన్ సప్లయ్‌తో పాటుగా డీసీ పవర్ సప్లై కూడా చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

వైసీపీ హయాంలో ఆర్టీసీ స్థలాల లీజుల్లో భారీ అవినీతి

- విజయవాడ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీకి చెందిన వందల కోట్ల రూపాయల ఆస్తులను అతి తక్కువ ధరకు ధారాదత్తం చేసిందని, ఫలితంగా సంస్థకు భారీ నష్టం వాటిల్లిందని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఏలూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను అయినవాళ్లకు అతి తక్కువ ధరకు 32 ఏళ్ల లీజుకిచ్చిందని పేర్కొన్నారు. దీని వెనుక అవినీతిపై విచారణ చేపడతామని తెలిపారు. ఆర్టీసీలో చాలా మంది ఉద్యోగులకు నేటికీ వైసీపీ వాసన పోలేదని, గత ప్రభుత్వ హయాంలో ఉన్న అధికారులు ఇంకా అదే పదవుల్లో కొనసాగడంతో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ బలంగా ఉందని, అయితే జనవరిలో కొత్తగా 80 బస్సులు రోడ్డెక్కాల్సి ఉండగా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా డిపోలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారుల వల్లే ఆర్టీసీ నష్టాల బాటలో నడిచిందన్నారు.

కృష్ణా దీవుల్లో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ వర్శిటీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణానది దీవులలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు సోమవారం స్థల పరిశీలన జరిగింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కలెక్టర్ లక్ష్మీశలు ఇబ్రహీంపట్నం ఎగువన కృష్ణానదిలో ఉన్న చినలంక, పెదలంక దీవులను సందర్శించారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయా లేదా అన్నది పరిశీలించారు. ప్రధానంగా ఇక్కడ వరద మట్టం ఏ స్థాయిలో ఉందన్నది పరిశీలించారు. అమరావతి రాజధానికి అత్యంత సమీపంలో ఈ దీవులు ఉన్నాయి. చినలంక దీవి ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉండగా.. పెదలంక దీవి గుంటూరు జిల్లా పరిధిలోకి వస్తుంది. ఈ రెండు దీవులను పరిశీలించిన మీదట రెండు, మూడు రోజుల్లో కలెక్టర్ లక్ష్మీశ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

నయా..నగరి!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదినెలల్లో విజయవాడ నగరంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. పట్టణాభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన దిశగా అడుగులు పడుతున్నాయి. అంతర్గత ట్రాఫిక్ సమస్యలు తప్ప గతంలో మాదిరిగా వీవీపీల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రజల్లో ట్రాఫిక్‌పై అవగాహన, హెల్మెట్ ధారణ గణనీయంగా పెరిగింది. నగరానికి సందర్శకుల తాకిడి పెరిగింది. ఐటీ కంపెనీలు బెజవాడ వైపు చూస్తున్నాయి. అవుటర్ రింగ్ రోడ్డు ఆశలతో రియల్ ఎస్టేట్ రంగం పురోగమిస్తోంది. విజయవాడలో గత పదినెలల మార్పులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

10 నెలలు..100 పరిష్కారాలు

- మారుతున్న నగర ముఖచిత్రం
- పట్టణాభివృద్ధి దిశగా కీలక అడుగులు
- పరుగు పెడుతున్న రహదారుల పనులు
- బెజవాడవైపు ఐటీ కంపెనీల చూపు
- పెరుగుతున్న పౌర స్పృహ



నూతన ఏటీసీ టవర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ నగరాభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రధానంగా నగరంలో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. గతంలో ఉన్న అడ్డంకులను తొలగించి విస్తరణ పనులు చేపడుతున్నారు. నగరంలో గవర్నర్‌పేట, సూర్యారావుపేట ప్రాంతాల్లో రెండు దశాబ్దాలుగా పెద్దగా రోడ్ల అభివృద్ధి జరగలేదు. ఇప్పుడు ఆ ప్రాంతాల్లో కొత్తగా రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. గుంతల స్థానంలో చక్కటి రోడ్లు దర్శనమిస్తున్నాయి. కార్పొరేషన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతుండగా.. సీఆర్‌డీఏ కూడా పట్టణాభివృద్ధికి తనవంతు పాత్ర పోషిస్తోంది. గ్రేటర్ విజయవాడ విలీన జాబితాలో ఉన్న శక్తి కళ్యాణమండపం రోడ్డును విస్తరించింది. విజయవాడ, ఆటోనగర్‌లలో సొంత నిధులతో రోడ్ల అభివృద్ధి, విస్తరణకు శ్రీకారం చుట్టింది.

స్టామ్ వాటర్ డ్రైయినేజీకి శ్రీకారం

విజయవాడ నగరంలో గత టీడీపీ ప్రభుత్వంలోనే అప్పటి కేంద్ర ప్రభుత్వ సహకారం రూ.1000కోట్లతో స్టామ్ వాటర్ డ్రెయినేజీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. 'అప్పట్లో ఈ పనులు శరవేగంగా జరిగినా.. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం రాకతో పనులో కదలిక వచ్చింది. గత వరదలను దృష్టిలో ఉంచుకుని నూరుశాతం కాలువలను నిర్మాణానికి చర్యలు చేపడతున్నారు.



పెరుగుతోన్న పౌర సదుపాయాలు

నగరంలో ప్రజలకు సదుపాయాల కల్పన పెరుగుతోంది. స్మార్ట్ లైటింగ్‌లో భాగంగా ఎల్‌ఈడీ అప్‌గ్రెడేషన్ జరుగుతోంది. పార్కులు, రోడ్లు, సర్క్యులేటింగ్ ఏరియాలలో ఈ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానాలను అవలంబిస్తున్నారు. ఎక్కడికక్కడ స్మార్ట్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో కొన్ని ఏఐ ఆధారిత స్మార్ట్ సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. స్మార్ట్ వాటర్ మీటరింగ్ సిస్టమ్‌కు శ్రీకారం చుట్టారు.



మెట్రో రైల్‌కు కదలిక

మూలన పడ్డ మెట్రో రైల్ ప్రాజెక్టుకు కదలిక వచ్చింది. తొలి విడతలో గన్నవరం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు తొలిదశలో భూ సేకరణ పనుల ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. కోచ్ డిపోకు స్థలాన్వేషణ చేస్తున్నారు. పాసింజర్ మొబిలిటీ సర్వే జరుగుతోంది.



రియల్ రంగానికి ఊపు

స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా పుంజుకుంటోంది. అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు వస్తుండటంతో పొరుగు రాష్ట్రాల రియల్టర్లు కూడా అమరావతి వైపు చూసే పరిస్థితి ఏర్పడింది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ చుట్టూ భూ క్రయ విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఓఆర్‌ఆర్ పనులు మొదలైతే మరింత క్రయ విక్రయాలు జరిగే పరిస్థితి ఉంది.

కొత్త జాతీయ రహదారులతో మహర్దశ

విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో జక్కంపూడి నుంచి ఖమ్మం జిల్లా వరకు 30 కిలోమీటర్ల నిడివిలో నిర్మాణానికి 245 ఎకరాల భూముల సేకరణలో ఇప్పటికే 90శాతం పైగా పూర్తి చేయటం జరిగింది. విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు మరో ఐదునెలల్లో అందుబాటులోకి రానున్నాయి.

విమానాశ్రయంలో ఊపందుకున్న పనులు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు ఊపందుకున్నాయి. 40 శాతం నుంచి 70 శాతం వరకు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొత్త ఆప్రాన్ అందుబాటులోకి వచ్చింది. నూతన ఏటీసీ టవర్ పనులు తుది దశలో ఉన్నాయి. మరో నాలుగు నెలల్లో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ అందుబాటులోకి రానున్నది.

ఐటీ పరిశ్రమల దిశగా అడుగులు



గత ఐదేళ్లలో విజయవాడ, కేసరపల్లి సెజ్‌ల నుంచి తరలిపోయిన ఐటీ పరిశ్రమలు తిరిగి విజయవాడ వైపు చూస్తున్నాయి. ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభించాయి. ఎన్నారై సౌజన్యంతో ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) నేతృత్వంలో అంకుర సంస్థలకు విన్‌సిటీ ఆహ్వానం పలుకుతోంది.

గ్రీన్ ఎనర్జీ దిశగా అడుగులు



సోలార్ పవర్ ప్రాజెక్టుల ప్రోత్సాహకం బాగా జరుగుతోంది. ప్రధానంగా పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో ముందుకు తీసుకు వెళ్లేందుకు కృషి జరుగుతోంది. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను మొదటి దశలో నూరుశాతం సూర్యఘర్ కిందకు తీసుకు వచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పెరుగుతున్న పౌర స్పృహ

నగరంలో పౌర స్పృహ పెరుగుతోంది. హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరి చేయటంతో సత్ఫలితాలను ఇస్తోంది. నూటికి 85 శాతం మందికి పైగా హెల్మెట్లు వినియోగిస్తున్నారు. ప్రజల్లో పెద్ద ఎత్తున మార్పు వచ్చింది. నూరుశాతం దిశగా అడుగులు పడుతున్నాయి.

తగ్గిన వీఐపీ ట్రాఫిక్ కష్టాలు

నగరంలో వీఐపీ వాహనాల రాకపోకలతో గతం కంటే ట్రాఫిక్ సమస్యలు తగ్గాయి. గతంలో అంతర్గత ట్రాఫిక్ సమస్యలకు తోడు.. వీఐపీల వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్థంభించేది. ఇప్పుడు అంతర్గత ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తగ్గింది. ప్రజలు గంటల తరబడి వేచిఉండే పరిస్థితి లేదు.

జిల్లాలో న్యాయాధికారుల బదిలీ

- ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి హిమబిందుకు న్యాయసేవా ప్రాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా పోస్టింగ్

విజయవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ఎస్పీఈ అండ్ ఏసీబీ కమ్ మూడో అదనపు జిల్లా, సెషన్స్(ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు) న్యాయాధికారి బి.సత్యవెంకట హిమబిందు బదిలీ అయ్యారు. ఆమెను అమరావతిలోని రాష్ట్ర న్యాయసేవా ప్రాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా బదిలీ చేశారు. రాష్ట్రంలో 54 మంది న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ బదిలీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు న్యాయాధికారులను ఇతర జిల్లాకు పంపారు. గుంటూరులోని పోక్సో కోర్టు న్యాయాధికారిగా ఉన్న ఎ.అనితను విజయవాడలోని ప్రజాప్రతినిధుల కేసు విచారణ కోర్టుకు బదిలీ చేశారు. కడపలోని ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి షేక్ ఇంతియాజ్ అహ్మద్‌ను విజయవాడలోని 14వ అదనపు సెషన్స్ జడ్జి కం అడిషనల్ ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. విశాఖపట్నంలోని వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఉన్న జి.గోపి మచిలీపట్నంలోని జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. విజయవాడలోని 12వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఉన్న పి.భాస్కరరావును ఏలూరులోని ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. విజయవాడలోని 14వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయాధికారి యు.ఇందిరా ప్రియదర్శిని ఏలూరులోని భూ సంస్కరణల అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గా బదిలీ అయ్యారు. విజయవాడలోని ఏడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయాధికారి ఎస్.నాగేశ్వరరావు విశాఖపట్నంలోని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. విజయవాడలోని మహిళా కోర్టు న్యాయాధికారి పి.రాజారావును విశాఖపట్నంలోని అదనపు ఫ్యామిలీకోర్టుకు బదిలీ చేశారు. కర్నూలులోని ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా ఉన్న జి.భూపాల్‌రెడ్డిని విజయవాడలోని ఏసీబీ కోర్టుకు బదిలీ చేశారు. ఏలూరులోని ఐదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయాధికారిగా ఉన్న జి.రాజేశ్వరిని విజయవాడలోని మహిళా కోర్టుకు బదిలీచేశారు. విజయవాడలోని సహకార ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఉన్న టి.వెంకటేశ్వర్లు ఇక్కడే నాలుగో అదనపు జిల్లా కమ్ ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారిగా నియమితులయ్యారు. విజయవాడలోని ఫ్యామిలీ కోర్టు కమ్ నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జిగా ఉన్న కె.సునీతను సహకార ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమించారు. మదనపల్లెలోని రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు న్యాయాధికారి బందెల అబ్రహంను విజయవాడలోని ఏడో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఏలూరులోని ఒకటో అదనపు జిల్లా స్పెషల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎం.సునీల్‌కుమారును విజయవాడలోని 12వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు.

సంపద సృష్టి, వృద్ధిరేటుపై దృష్టిపెట్టండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ప్రజాసమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు, సమాజ అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, సంపద సృష్టి, వృద్ధిరేటుపై ప్రతిశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని ముందుకు తీసుకెళ్తూ ఔత్సాహికులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించాలని, పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను, పథకాలను సద్వినియోగం చేసుకొనేలా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈనెల 10న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర్ణాంధ్ర విజన్ 2047, వృద్ధి ఇంజన్లపై అధికారులకు వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

కలెక్టరేట్ : సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులతో పాటు ఓలా, బ్లింకిట్, స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫాం కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖలు, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొనేందుకు ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక నమోదు శిబిరాలపై కార్మిక శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసంఘటిత రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు.

రంగా పీటీ వారెంట్ అనుమతించిన కోర్టు

విజయవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ముదునూరి సత్యవర్థన్ కిడ్నాప్ కేసులో ఐదో నిందితుడిగా ఉన్న ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగాపై పటమట పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం అనుమతించింది. రంగా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ప్రథమ నిందితుడిగా ఉన్నాడు. అతడిని సీఐడీ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో రంగా విజయవాడలోని జిల్లా జైలులో ఉన్నాడు. సత్యవర్థన్ కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్నందున అతడిని కోర్టులో హాజరుపరిచేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీనికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం అనుమతించింది.

రెండోసారి వంశీ బెయిల్ పిటిషన్

విజయవాడ జిల్లా జైలులో ఉన్న వల్లభనేని వంశీమోహన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో రెండోసారి బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కొద్దిరోజుల క్రితమే ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. దీంతో రెండోసారి వంశీ తరఫున న్యాయవాది సత్యశ్రీ సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

అమరావతిలో నార్కోటిక్స్ పోలీసుస్టేషన్

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, అక్రమ రవాణా, డ్రగ్స్ విక్రయంపై ఉక్కుపాదం మోపుతోన్న రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. అమరావతి కేంద్రంగా నార్కోటిక్స్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తూ సోమవారం హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. డీఎస్పీ హోదా అధికారి ఎస్‌హెచ్‌వోగా ఉండే ఈ స్టేషన్ పరిధి రాష్ట్రవ్యాప్తంగా ఉంటుంది. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ ఎక్కడైనా కేసు నమోదు చేసేందుకు ప్రభుత్వం అధికారం ఇచ్చింది. 'ఈగల్' ఐజీ రవికృష్ణ పర్యవేక్షణలో 459 మంది సిబ్బంది, జిల్లాల పోలీసులు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదిస్తుంది. రాష్ట్రంలోని 26 జిల్లా కేంద్రాల్లో జిల్లా మాదకద్రవ్యాల నియంత్రణ విభాగాలు (డీఎన్‌సీసీ) ఏర్పాటు చేసుకుని.. ఈగల్ విభాగం గంజాయి, డ్రగ్స్ కట్టడికి చర్యలు చేపడుతుంది. ఎన్‌డీపీఎస్ సంబంధిత సెక్షన్ల కింద స్మగ్లర్లు, సాగుదారులు, విక్రేతలపై కేసు నమోదు చేసి గుంటూరు, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలోని కోర్టుల్లో ఈగల్ అధికారులు నిందితులను ప్రవేశపెడతారు. గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని ఈగల్ అధిపతి ఆకే రవికృష్ణ కోరారు.

గాలివాన బీభత్సం

(5వ పేజీ తరువాయి)

తడిచిపోయింది. రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్టు విరిగిపోయింది. మైలవరం మండలంలో మామిడి కాయలు రాలిపోయాయి. ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి గ్రామంలో మొక్కజొన్న రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. వీరులపాడు మండలం జుజ్జూరులో మొక్కజొన్న పంట మొత్తం నేలవాలింది. విస్సన్నపేటలో వర్షం కురవకపోయినా ఈదురుగాలులు మాత్రం భారీగా వీచాయి. ఈ గాలులకు ఓ తాటిచెట్టు పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి.

వెంటాడిన మృత్యువు

ఈదురు గాలుల బీభత్సానికి ఓ వ్యక్తి మృతిచెందాడు. జి.కొండూరుకు చెందిన ఉయ్యూరు మంగారావు (45) ఆర్టీసీలో కండక్టర్. సోమవారం సాయంత్రం ఇద్దరు స్నేహితులతో కలిసి పినపాక రోడ్డు పైకి వెళ్లారు. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడి వర్షం పడటంతో సమీపంలో పాడుబడిన కోళ్లఫారం వద్దకు పరుగులు తీశారు. వారు వెళ్లిన క్షణంలోనే గాలుల వేగానికి కోళ్లఫారం గోడ కూలిపోయింది. అతని వెనుక ఉన్న ఇద్దరు స్నేహితులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

కండిషన్ సీరియస్


(5వ పేజీ తరువాయి)

ఏడో స్థానంలో ఉంది. 4,376 కేసులతో కృష్ణా 17వ స్థానంలో నిలిచింది. 1,351 కాలేయ సంబంధ కేసులతో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే 9వ స్థానంలో, 1,002 కేసులతో కృష్ణాజిల్లా 17వ స్థానంలో నిలిచాయి. 50-54 ఏళ్లలోపు వారిలోనే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

మిగిలిన వ్యాధుల్లోనూ..

రెండు జిల్లాల్లో న్యూరో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. 4,154 కేసులతో కృష్ణాజిల్లా పదో స్థానం, 4,063 కేసులతో ఎన్టీఆర్ జిల్లా 11వ స్థానంలో నిలిచాయి. అలాగే, 6,291 కిడ్నీ కేసులతో ఎన్టీఆర్ 16వస్థానంలో, 4,761 కేసులతో కృష్ణా 22వ స్థానంలో నిలిచాయి.

మహిళ దారుణ హత్య!



జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రోకలి బండతో మోది భార్యను దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్ తెలిపిన సమాచారం మేరకు.. పసుపులేటి మురళీకృష్ణ, మంగమ్మ అలియాస్ సునీత (40)తో కలిసి 12 ఏళ్లగా తిరుమలగిరి గ్రామంలో నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మద్యం సేవించి వచ్చిన మురళీకృష్ణను భార్య రాత్రి ఇంట్లోకి రానీయకుండా బయటే ఉంచింది. సోమవారం ఉదయం మంగమ్మ తలుపు తీయడంతో నన్ను వీధిలో ఉంచుతావా అంటూ మురళీకృష్ణ రోకలి బండతో మోదటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఏసీపీ తిలక్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు అక్కడకు చేరుకుని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహిళ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

త్వరలో బెజవాడకు 100 ఎలక్ట్రికల్ బస్సులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అతి త్వరలో బెజవాడకు ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్నాయి. పీఎం ఈ బస్ సేవా పథకం కింద ఈ బస్సులు రాబోతున్నాయి. పూర్తి అద్దె ప్రాతిపదికన రాబోయే ఈ బస్సులను విజయవాడకు 100 కేటాయించటం జరిగింది. ఇప్పటికే విద్యాధరపురం బస్‌స్టేషన్‌ను ఎలక్ట్రికల్ బస్సుల డిపోగా తీర్చిదిద్దుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్‌ను ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడే ఈ బస్సుల నిర్వహణ చేపట్టే సంస్థ ఛార్జింగ్ ఇతర మెయింటినెన్స్ వ్యవహారాలను చూస్తుంది. విజయవాడ నగరంలో సిటీ ఆపరేషన్‌లో భాగంగా ఈ బస్సులను నడుపుతారు. ఎలక్ట్రికల్ బస్సులకు బాడీ బిల్డింగ్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. బాడీ బిల్డింగ్ పనులు పూర్తి కాగానే దశల వారీగా విజయవాడకు చేరుకోనున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123,132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి: ఇన్‌చార్జి కమిషనర్

కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా ఇన్‌చార్జి కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 14 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చడానికి బాబు కృషి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు 10నెలల పాలనలోనే మన రాష్ట్ర జీడీపీ దేశంలో 2వ స్థానానికి చేరిందని, అంతేకాకుండా వృద్ధిరేటుతో పాటు అభివృద్ధిలో కూడా రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధిలోని మూడో డివిజన్‌లోని కామినేని నగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ రూ.15లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణపనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం డివిజన్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన పార్టీ కార్యకర్త జి.గోవిందరాజులకు ప్లాట్ ఫారం రిక్షాను ఎమ్మెల్యే ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంపదను సృష్టించి వాటి ద్వారా మాత్రమే సంక్షేమ పథకాలను అమలు చేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రజల అవసరాలు తీర్చడంలోపాటు భవిష్యత్ తరాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కూడా కల్పించడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని గద్దె తెలిపారు. ఈ కార్యక్రమంలో గుళ్ళపల్లి నారాయణరావు, తాడిబాబురావు, గుత్తికొండ మోహనరావు, జి.కృష్ణమోహన్‌రావు, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

జాబ్‌మేళాలో 91 మంది ఎంపిక

గుణదల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం ఎస్ఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 91మందికి ఉద్యోగావకాశాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ మాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో పలు కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన 91మందికి నియామక పత్రాలు అక్కడికక్కడే అందజేశారు. జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి కోరారు.

వివాహిత అనుమానాస్పద మృతి

గుణదల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్లుగా మాచవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గుణదల మైత్రీనగర్లో మురారి శివనాగ ప్రసాద్, రజిత(32) దంపతులు ఉంటున్నారు. వీరికి 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇరువురు పిల్లలు. రజిత కూలిపనులకు వెళుతుంటుంది. శివనాగ ప్రసాద్ బుక్‌స్టాల్లో పనిచేస్తుంటాడు. ఇదిలా ఉండగా ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం భర్త శివనాగ ప్రసాద్ లేచి చూసేసరికి భార్య ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని కనబడింది. సమాచారం అందుకున్న రజిత చెల్లెలు గూడూరు నుంచి వచ్చి తన అక్క మరణంపై అనుమానాలు ఉన్నాయని విచారణ చేసి న్యాయం చేయాలంటూ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలి చెల్లెలు ఫిర్యాదు మేరకు వివాహిత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.

నగరంలో శరవేగంగా డీసిల్టింగ్ పనులు



కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైన ఉండకుండా నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులను చేపట్టాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా సోమవారం సర్కిల్-1 పరిధిలోని 46వ డివిజన్ ఐరన్ యార్డ్, 44వ డివిజన్ బైపాస్ రోడ్డులోని డ్రెయిన్లలో, సర్కిల్-2 పరిధిలోని సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నుంచి నూజివీడు రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లోని అవుట్ ఫాల్‌డ్రెయిన్లలో, సర్కిల్-3 పరిధిలోని గుణదల, ఆటోనగర్ గుంటతిప్ప డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంలో నగరపాలకసంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో డీసిల్టింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

పన్నులు చెల్లించండి
ఐదు శాతం రిబేట్ పొందండి

నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు 2025-26కు ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీని పొందవచ్చునని డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని క్యాష్ కౌంటర్లే కాకుండా ప్రజలు సచివాలయంలో కూడా పన్నులు చెల్లించవచ్చని, ఆన్‌లైన్‌లో కూడా పన్నులు చెల్లించినా ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై ఐదు శాతం రాయితీ సౌకర్యం ఉందని పేర్కొన్నారు.

మానసిక, శారీరక ప్రశాంతతకు యోగా



కృష్ణలంకలోని అమరజీవి పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాలలో ప్రచార రథయాత్రలో ప్రజలు

కృష్ణలంక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సహజ యోగ ధ్యాన ప్రక్రియలను అవలంభించడం ద్వారా భగవంతుని శక్తిని నింపుకొని, శారీరక, మానసిక, భావనాత్మక, ఆధ్యాత్మిక ఉన్నతి పొందొచ్చని సహజయోగ ట్రస్ట్ నగర కో ఆర్డినేటర్లు యర్రంశెట్టి గాంధీ, టి.రవీంద్రబాబు అన్నారు. మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహజయోగ ప్రచార రథయాత్ర సోమవారం కృష్ణలంక బస్టాండ్ ప్రాంతం నుంచి వారధి వరకు కొనసాగింది. కృష్ణలంకలోని అమరజీవి పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాలలో వాకర్లకు సహజ యోగ పరిచయ కార్యక్రమం జరిగింది. సాయంత్రం నవభారత్ ఉన్నత పాఠశాలలో సహజ యోగ ధ్యాన ప్రక్రియలపై అవగాహనా సదస్సు జరిగింది. అనంతరం పురుషోత్తమపట్నం రవి, విజయలక్ష్మీ దంపతుల ఇంట్లో మాతాజీ నిర్మలాదేవి, ఆమె భర్త శ్రీవాస్తవ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.జయశంకర్, రావి నాగేశ్వరరావు, డి.సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పీ4తో చేయూత

ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించే కార్యక్రమం పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్ (పీ4) విధానమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఎస్సీ సెల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఇతర మౌలిక వసతులకు చేయూతగా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించిన పీ4 కార్యక్రమం సమాజంలో ఒక విప్లవాత్మకమైన మార్పు తెస్తుందన్నారు. పీ4 కార్యక్రమం పేదలకు, ప్రభుత్వానికి మధ్య వారధి లాంటిదన్నారు. పార్టీలకు అతీతంగా పేదలందరికీ పీ4 చేయూతగా నిలుస్తుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈనెల 11 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని, సహకారాన్ని తన ఆఫీసు నుంచి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి రామారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా మురళి, నియోజకవర్గంలోని ఆయా విభాగాల ఎస్సీ సెల్ అధ్యక్షులు, నాయకులు, పాల్గొన్నారు.

ఉద్యోగ, వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోండి

బెంజిసర్కిల్: విద్యార్థినులు అమరావతిలో ఉద్యోగ, వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకొని తమ భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. మారిస్ స్టెల్లా కళాశాలలో ఫైనలియర్ విద్యార్థినులకు సోమవారం ఏర్పాటు చేసిన నావిగేట్ ది కెరియర్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ఎంపీ శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసంగించారు. విద్యార్థులు ఏరంగంలో ఆసక్తిగా ఉన్నారో చెబితే వారికి ఆ రంగంలో నైపుణ్యత పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కేశినేని ఫౌండేషన్ ద్వారా విద్యార్థుల కోసం కెరియర్ కౌన్సిలర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జెస్సింతా క్వాడ్రాస్, మార్పు ట్రస్ట్ చైర్మన్ సూజీ, కెరియర్ కౌన్సిలర్‌లు సంపత్ తాజ్ మణి, కోమండూరి శేషసాయిరామ్ కౌశిక్, చార్టర్ అకౌంటెంట్ పర్వేజ్, ఎంఎస్ఎంఈ జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మాదిగాని గురునాథం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు ఎంపీ చిన్ని సమాధానాలు ఇచ్చారు.

రైతు శ్రేయస్సుకు పరితపించే వడ్డే

- ప్రముఖ సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి
- 'ప్రభుత్వ పథకాలు.. ప్రాధాన్యతల్లో సవరణల ఆవశ్యకతపై సీఎంకు వడ్డే బహిరంగ లేఖ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల నాయకులు

విజయవాడ (గాంధీనగర్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నిరంతరం రైతు, ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే గొప్ప వ్యక్తి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అని ప్రముఖ సినీ నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణ మూర్తి పేర్కొన్నారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో- ప్రాధాన్యతల్లో సవరణల ఆవశ్యకతపై సీఎం చంద్రబాబుకు వడ్డే బహిరంగ లేఖ' పుస్తకావిష్కరణ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన నారాయణమూర్తి మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి, రైతు, ప్రజలకు మంచి చేసేందుకు అనేక సూచనలు ఈ పుస్తకంలో వడ్డే పేర్కొన్నా రని, వీటిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ పుస్తకాన్ని సీఎం చంద్రబాబు సహా మంత్రులు, ప్రజాప్రతినిధులు చదవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని, దీన్ని అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. పార్లమెంట్‌లో సభ్యుల సంఖ్య తగ్గుతుందన్నారు. నియోజకవర్గాల పునర్విభ జనను వ్యతిరేకించాలని సీఎం, డిప్యూటీ సీఎంలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సహా అన్ని రాజకీయ పార్టీలను ఆయన కోరారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, విధానపరమైన నిర్ణయాల్లో ప్రభుత్వం ఆలోచన సరళి మారాల్సిన అవశ్యకత ఉందన్నారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుకు వేలాది కోట్లు ఖర్చు చేయడం కన్నా కేవలం 200 కోట్లు రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఖర్చు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 2009లో భారీ వరదల వల్ల శ్రీశైలం ప్రాజెక్టు వద్ద పడిన గుంతను నేటికీ పూడ్చలేదని విమర్శించారు. బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించకపోవడం క్షమార్హం కాదన్నారు. రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అనేక రాష్ట్రాల్లో నష్టాల్లో నడుస్తున్న మెట్రోరైల్ ప్రాజెక్టు విజయవాడలో చేపట్టడం సరైంది కాదన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రాజెక్టుల సాధన సమితి నాయకుడు బొజ్జల దశరథరామిరెడ్డి, రైతు సంఘం నేతలు వై.కేశవరావు, సింహాద్రీ ఝాన్సీ, డి.హరినాథ్, పి.జలమయ్య పాల్గొన్నారు.





స్థానికులు అడ్డుకున్న టిప్పర్లు

కానూరు రోడ్డు వెంట తగులబడుతున్న చెత్త

కానూరులో చెత్త డంపింగ్‌పై

రెండోరోజూ స్థానికుల ఆందోళన

పెనమలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కానూరు నుంచి ఎనికేపాడు వెళ్లే రోడ్డులో విపరీతంగా చేస్తున్న చెత్త డంపింగ్‌పై స్థానికులు రెండో రోజూ తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం చెత్త టిప్పర్లు కానూరు రోడ్డు వెంట డంపింగ్ చేయడానికి వచ్చాయని తెలుసుకొన్న స్థానికులు వెంటనే రోడ్డు వద్దకు చేరుకొని టిప్పర్లను అడ్డుకొని డంపింగ్ చేయనివ్వలేదు. దీంతో టిప్పర్ల డ్రైవర్లకు, స్థానికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. తమ ప్రాంతంలో ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా డంపింగ్ చేయడం కుదరదని, డంపింగ్ వ్యర్థాలతో తాము తీవ్ర వాయుకాలుష్యానికి, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురౌతున్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల వెంట చెత్తను తగులబెడుతుండడంతో రోడ్డు వెంట ప్రయాణం నరకప్రాయంగా మారిందని టిప్పర్ల డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. తమ ప్రాంతంలో చెత్త డంపింగ్ చేయడానికి వీల్లేదంటూ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే అధికారుల నుంచి ఎటువంటి చర్యలు లేకపోవడంతో రెండో రోజు డంపింగ్ చేయడానికి వచ్చిన టిప్పర్లను తిరిగి స్థానికులు అడ్డుకొన్నారు.

డంపింగ్ చేయకుండా ఆదివారం అడ్డుకున్నా మళ్లీ డంపింగ్‌కు టిప్పర్లు రావడంతో స్థానికుల ఆగ్రహం కట్టలు తెంచుకొంది. డంపింగ్‌ను అనుమతించేది లేదని భీష్మించారు చేసేదేమీ లేక డ్రైవర్లు వాహనాలను నిలిపివేశారు. డంపింగ్ చేసే పక్షంలో టైర్లలో గాలి తీసివేయడానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.

జనసేనలోకి ముస్లిం మైనార్టీ నాయకులు

పటమట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు సమక్షంలో తూర్పు నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీ నాయకులు భారీ ఎత్తున జనసేన తీర్థం తీసుకున్నారు. వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ షఫీ సహా పలువురు నేతలకు జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ అన్ని కుల మతాలను సమానంగా చూస్తారన్నారు. జగన్ కుట్రలను ముస్లిం, మైనా ర్టీలు తెలుసుకొని వైసీపీని వీడి బయటకు రావాలని విజ్ఞప్తి చేశారు.

మట్టిలో మాణిక్యం 'నవ్య'



గోల్డ్‌మెడల్ అవార్డు అందుకుంటున్న నవ్య

కృష్ణలంక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పేదకుటుంబంలో పుట్టి, మున్సిపల్ స్కూల్‌లో విద్యనభ్యసించి బీటెక్‌లో గోల్డ్‌మెడల్ సాధించి ఎంటెక్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ చేయబోతున్న కృష్ణలంక రాణిగారితోటకు చెందిన నవ్య మట్టిలో మాణిక్యంగా నిలిచింది. తండ్రి లారీడ్రైవర్, తల్లి గృహిణి. చదువుపై ఆసక్తితో నవ్య గేట్‌లో ఆలిండియాలో 120వ ర్యాంక్ సాధించింది. మేనమామ ప్రోత్సాహం.. స్వయంకృషి, పట్టుదలతో తాను ఈ స్థాయికి ఎదిగినట్టు ఆమె చెబుతోంది. చెన్నయ్‌లోని భరత్ యూనివర్సిటీలో బీటెక్ టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ అందుకోవడంతో ఆమె కుటుంబసభ్యులు ఆనందంలో మునిగిపోయారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- వినియోగదారుల నుంచి రూ.5.68లక్షల జరిమానా వసూలు

విద్యాధరపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భవానీపురం సెక్షన్ పరిధి విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి, నగర ఇన్‌చార్జి ఈఈ యు.హనుమయ్య ఆధ్వర్యంలో అధికారులు 42 బృందాలుగా ఏర్పడి 3,148 గృహ సర్వీసులు, 366 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 146 సర్వీసులకు అదనపులోడు 250కెడబ్ల్యూ మొత్తానికి రూ.5,68,800లు జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును రెగ్యులేషన్ చేసుకోవటానికి 50 శాతం సబ్సిడీతో ఈఏడాది జూన్ 30వరకు అవకాశం ఉందని వారు తెలిపారు. ఈ తనిఖీలలో విజయవాడ నగర డి1 డీఈఈ ఎంవీవీ రామకృష్ణ, ఏఈవో పి.ప్రసాద్, ఏఈ కె.వి.ఎస్ రామప్రసాద్, నగర డివిజన్ పరిధిలోని సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ

సర్వోత్తమ గ్రంథాలయంలో ఈనెల 25నుంచి జూన్ 5వరకు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంచేందుకు కేజీ నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఈనెల 25నుంచి జూన్ 5 వరకు వేసవి శిక్షణ జరగనుంది. ● లిటిల్ రీడింగ్ చాప్-2025- పిల్లల్లో చదివే అలవాటు పెంచేందుకు ఈసమ్మర్ క్యాంప్‌లో వంద గంటలు పైగా చదివిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్, 50 గంటలకు పైగా చదివిన వారికి సిల్వర్ మెడల్ ఇవ్వనున్నారు. ● లెర్నింగ్ న్యూ వర్డ్ పేర- ఈనెల 25నుంచి జూన్ 10వరకు గ్రంథాలయానికి వచ్చి పుస్తకం చదివి తాను తెలుసుకున్న కొత్త పదాలు, వాటి అర్థాలు రాయాలి. ● ఈ వేసవిలో విద్యార్థులు వారు సందర్శించిన ప్రదేశాలు, అక్కడి విశేషాలతో కూడిన వ్యాసం జూన్ 8న ఈ క్యాంప్‌లో రాయాల్సి ఉంది. ● వినోద, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు మే 5నుంచి 12 వరకు సర్వోత్తమ గ్రంథాలయంలో థియేటర్ వర్క్‌షాప్ నిర్వహిస్తారు. దీనిలో పాల్గొనే వారు ఈనెల 10లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ● విద్యార్థుల్లో రచనా శక్తిని పెంపొందించేందుకు వారికి ఆసక్తి గలిగిన ఏదైనా అంశంపై కవితలు, కథలు స్వదస్తూరితో రచన చేసి జూన్ 8లోగా సమ్మర్ క్యాంప్‌లో అందజేయాలని సర్వోత్తమ గ్రంథాలయం వేసవి శిక్షణ నిర్వాహకులు తెలిపారు.

అన్నదానం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకలు ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం లెనిన్ సెంటర్‌లోని శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్‌పేట స్టేషన్ సీఐ ఏ. నాగ మురళీకృష్ణ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాబా భక్తులు బత్తిన లక్ష్మీకాంత్, దుర్గ, ఫణేంద్ర, పద్మ దంపతుల దాతృత్వంతో అన్నదానం చేశారు.

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x లఖ్‌నవూ — మ.3.30 నుంచి, వేదిక: కోల్‌కతా

పంజాబ్ x చెన్నై — రా.7.30 నుంచి, వేదిక: చండీగఢ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్





నాన్నంటే.. ఎంతో భయం!

న్యూఢిల్లీ: చిన్నప్పుడు తనకు నాన్న పాన్ సింగ్ అంటే ఎంతో భయమనే విషయాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో మహేంద్ర సింగ్ ధోనీ బయటపెట్టాడు. ఆయన వల్లే ఎంతో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటైందని తెలిపాడు. తన కెరీర్‌ను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పాడు. 'నాన్న ఎంతో కఠినంగా ఉండేవారు. కానీ, ఎన్నడూ కోప్పడలేదు. ఎప్పుడూ సమయపాలన పాటించేవారు. అది నాకు కూడా అలవడిందని తెలిపాడు. తన తండ్రి వల్లే జీవితంలో ఎప్పుడూ అభద్రతా భావానికి గురికాలేదన్నాడు.

ఆర్‌సీబీ.. హమ్మయ్య

- ఆఖరి ఓవర్‌లో అద్భుతం
- విరాట్, రజత్ హాఫ్ సెంచరీలు
- పోరాడి ఓడిన ముంబై
- రాణించిన తిలక్



ముంబై: ఐపీఎల్ అభిమానులకిది అదిరిపోయే మ్యాచ్. బ్యాటింగ్‌లో చెలరేగిన బెంగళూరు ప్రత్యర్థి ముంబై ముందు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచినా.. ఆఖరి బంతి వరకూ ఉత్కంఠను రేకెత్తించింది. ఓ దశలో ముంబై ఓటమి లాంఛనమే అనిపించినా తిలక్ వర్మ (29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 42)ల దంచుడు ఆర్‌సీబీలో గుబులు రేపింది. కానీ కీలక దశలో వారి వికెట్లు తీసి తిరిగి పోటీలోకి రావడంతో పాటు, చివరి ఓవర్‌లో స్పిన్నర్ క్రునాల్ (4/45) మూడు వికెట్లు పడగొట్టి ఆర్‌సీబీని గట్టెక్కించాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రజత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే వాంఖడేలో ఈ జట్టు పదేళ్ల తర్వాత గెలవడం మరో విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 67), దేవ్‌దత్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37), రజత్ పటీదార్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 64), జితేశ్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 40 నాటౌట్) చెలరేగారు. హార్దిక్, బౌల్ట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హాజెల్‌వుడ్, యష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

చివర్లో బోల్తా: భారీ ఛేదనలో ముంబై ఆరంభం నుంచే ఇబ్బందిపడింది. ఆర్‌సీబీ బౌలర్లు కట్టడి చేయడంతో ఓపెనర్లు రోహిత్ (17), రికెల్టన్ (17) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అటు విల్ జాక్స్ (22)తో కలిసి సూర్యకుమార్ (28) మూడో వికెట్‌కు 41 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే సూర్య భారీ షాట్లు ఆడేందుకు కష్టపడ్డాడు. రెండు క్యాచ్ అవుట్స్ ప్రమాదం నుంచి తప్పించుకున్న తను చివరకు 12వ ఓవర్‌లో యష్‌కు చిక్కాడు. అప్పటికి స్కోరు 99/4గా ఉండడంతో ఇక ముంబైకి భారీ ఓటమి ఖాయమనిపించింది. కానీ ఈ దశలో తిలక్, హార్దిక్ బ్యాట్లు ఝుళిపించి వణుకు పుట్టించారు. 13వ ఓవర్‌లో తిలక్ 6,4,4.. 14వ ఓవర్‌లో హార్దిక్ 6,4,6,4తో 39 పరుగులు రావడంతో మ్యాచ్ ముంబై వైపు తిరిగింది. అలాగే తిలక్ 16వ ఓవర్‌లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ అంతా సవ్యంగా సాగుతున్న దశలో ముంబై వరుస ఓవర్లలో ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయింది. సమీకరణం 6 బంతుల్లో 19 రన్స్‌కి చేరింది. అయితే క్రునాల్ ఆరు పరుగులే ఇచ్చి శాంట్నర్ (8), చాహర్ (0), నమన్ (11)ల వికెట్లు తీసి ఆర్‌సీబీని సంబరాల్లో ముంచాడు.

ఆరంభం నుంచే దంచుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ జట్టు స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఓపెనర్ విరాట్ అనూహ్యంగా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగగా, దేవ్‌దత్, కెప్టెన్ రజత్, జితేశ్ కూడా అదరగొట్టడంతో బెంగళూరు భారీ స్కోరందుకుంది. చివరి ఐదు ఓవర్లలో జట్టు 70 పరుగులు సాధించింది. బుమ్రా ఒక్కడే కాస్త కట్టడి చేశాడు. అయితే తొలి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ సాల్ట్ (4)ను పేసర్ బౌల్ట్ బౌల్డ్ చేసినా.. జట్టు ఆటలో మాత్రం జోరు తగ్గలేదు. ముంబైపై బెంగళూరు తమ అత్యధిక పవర్‌ప్లే స్కోరు (73/1)ను సాధించింది. పడిక్కళ్‌ను స్పిన్నర్ విఘ్నేష్ అవుట్ చేసి రెండో వికెట్‌కు 52 బంతుల్లోనే 91 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. అనంతరం 10-13 ఓవర్ల మధ్య పరుగులు నెమ్మదించాయి. అయితే శాంట్నర్ ఓవర్‌లో 20 పరుగులు రావడంతో తిరిగి లయ అందుకుంది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్, లివింగ్‌స్టోన్ (0)లను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ డెత్ ఓవర్లలో పటీదార్‌కు జితేశ్ జత కలవడంతో ముంబై బౌలర్లు గతి తప్పారు. 16వ ఓవర్‌లో జితేశ్ 4,6 రజత్ 4తో బౌల్ట్ 18 రన్స్ సమర్పించుకున్నాడు. ఇక ఆ తర్వాత పటీదార్ 6,6,4తో 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. హార్దిక్ వేసిన ఈ 17వ ఓవర్‌లో ఏకంగా 23 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో జితేశ్ రెండు సిక్సర్లతో స్కోరు 200 దాటగా రజత్ వికెట్‌ను కోల్పోయింది. వీరి మధ్య ఐదో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. చివరి ఓవర్‌లో బుమ్రా 8 పరుగులే ఇచ్చి కాస్త ఊరటనిచ్చాడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (బి) బౌల్ట్ 4; విరాట్ (సి) నమన్ (బి) హార్దిక్ 67; పడిక్కళ్ (సి) జాక్స్ (బి) విఘ్నేష్ 37; పటీదార్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 64; లివింగ్‌స్టోన్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0; జితేశ్ (నాటౌట్) 40; డేవిడ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 221/5. వికెట్ల పతనం:** 1-4, 2-95, 3-143, 4-144, 5-213; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-57-2; దీపక్ 2-0-29-0; బుమ్రా 4-0-29-0; జాక్స్ 1-0-10-0; శాంట్నర్ 4-0-40-0; హార్దిక్ 4-0-45-2; విఘ్నేష్ 1-0-10-1.

ముంబై: రోహిత్ (బి) యశ్ దయాల్ 17, రికెల్టన్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 17, విల్ జాక్స్ (సి) కోహ్లీ (బి) క్రునాల్ 22, సూర్యకుమార్ (సి) లివింగ్‌స్టోన్ (బి) యశ్ దయాల్ 28, తిలక్ వర్మ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 56, హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) హాజెల్‌వుడ్ 42, నమన్ ధిర్ (సి)యశ్ దయాల్ (బి) క్రునాల్ 11, శాంట్నర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 8, దీపక్ చాహర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 0, బౌల్ట్ (నాటౌట్) 1, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 7 ; మొత్తం 20 ఓవర్లలో 209/9 ; వికెట్ల పతనం :** 1-21, 2-38, 3-79, 4-99, 5-188, 6-194, 7-203, 8-203, 9/209 ; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-48-1, యశ్ దయాల్ 4-0-46-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, సుయాష్ శర్మ 4-0-32-0, క్రునాల్ 4-0-45-4.

మనోళ్లు మురిపిస్తారా?

బరిలో సింధు, సేన్, ప్రణయ్



నేటినుంచి బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్

నింగ్బో (చైనా): ఇటీవలి కాలంలో జరిగిన అన్ని ప్రధాన టోర్నీలలో భారత షట్లర్లు తీవ్రంగా నిరాశ పరిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మనోళ్లు ఎలా రాణిస్తారోనన్న ఉత్కంఠ ఏర్పడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోడ్, అనుపమా ఉపాధ్యాయ, ఆకర్షి కశ్యప్ తలపడుతున్నారు. మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ద్వయం, పురుషుల్లో సాత్విక్/చిరాగ్ జంట టోర్నమెంట్‌లో పాల్గొనడంలేదు. తొలి రౌండ్‌లో తైపీకి చెందిన లీ చియాతో లక్ష్యసేన్ తలపడతాడు. గువాంగ్ జు (చైనా)తో ప్రణయ్, కంటపాన్ (ఇండోనేసియా)తో రజావత్, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ మొదటి రౌండ్‌లో అమీతుమీ తేల్చుకుంటారు. మహిళల సింగిల్స్‌లో...ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు-ఎస్తేర్ నురుమి (ఇండోనేసియా)తో టోర్నీని ప్రారంభిస్తుంది. ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ ఇంటనాన్‌ను అనుపమ, చైనా షట్లర్ ఫాంగ్‌ను మాళవిక, రెండో సీడ్ యీ హాన్ (చైనా)ను ఆకర్షి ఢీకొంటారు. మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి జంట-తైపీ జోడీ యున్ సంగ్/చీన్ యుతో తలపడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ కుమార్, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్/రుత్విక శివాని, సతీష్ కరుణాకరన్/ఆద్య, ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

2019 తర్వాత టీ20ల్లో తన ఫాస్టెస్ట్ (29 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసిన విరాట్ కోహ్లీ. అలాగే ఈ ఫార్మాట్‌లో 13 వేల రన్స్ పూర్తి చేసిన ఐదో బ్యాటర్ అయ్యాడు.

1 ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు (184) తీసిన పేసర్‌గా భువనేశ్వర్. బ్రావో (183)ను అధిగమించాడు.

వాంఖడేలో ఆర్‌సీబీకిది రెండో అత్యధిక స్కోరు (221/5). 2015లో 235/1 రన్స్ చేసింది. **2**

నర్మదకు ఆరో స్థానం

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో సోమవారం భారత షూటర్లు నిరాశపర్చారు. సోమవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో నర్మద నితిన్ 166.3 పాయింట్లతో ఆరో స్థానంలో, సోనమ్ ఉత్తమ్ 124.4 పాయింట్లతో ఎనిమిది స్థానంలో నిలిచారు. జీఫీ వాంగ్ (చైనా) స్వర్ణం నెగ్గగా.. యుంజీ క్వాన్ (కొరియా) రజతం, ఆడ్రే గోగ్నియాత్ (స్విట్జర్లాండ్) కాంస్యం దక్కించుకొన్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో నర్మద ఆరో స్థానం, సోనమ్ తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.



ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా బ్రూక్

లండన్: ఇంగ్లండ్‌క్రికెట్ పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు ఇక నుంచి హ్యారీ బ్రూక్ సారథ్యం వహించనున్నాడు. ఈ మేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారిక ప్రకటన చేసింది. చాంపియన్స్ ట్రోఫీలో జట్టు పేలవ ప్రదర్శన కారణంగా జోస్ బట్లర్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈనేపథ్యంలో వైస్ కెప్టెన్‌గా ఉన్న 26 ఏళ్ల బ్రూక్‌కు వన్డే, టీ20 జట్ల పగ్గాలు అప్పగించారు. టెస్టు కెప్టెన్ స్టోక్స్‌కే పరిమిత ఓవర్ల కెప్టెన్సీని అప్పగిస్తారనే కామెంట్స్ వినిపించినా.. ఈసీబీ బ్రూక్ వైపు మొగ్గు చూపింది. 2022లో అరంగేట్రం చేసిన బ్రూక్ ఇంగ్లండ్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడుతున్నాడు.

ఇషాంత్‌కు జరిమానా

హైదరాబాద్: గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. అంతేకాకుండా ఓ డీమెరిట్ పాయింట్ కూడా అతడి ఖాతాలో చేరింది. ఆదివారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇషాంత్ ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ 2.2 రూల్‌ను అతిక్రమించినట్టు తేలింది. క్రికెట్ సామగ్రి, జెర్సీ, మైదానంలోని వస్తువులను అగౌరవపర్చడం దీనికిందికి వస్తుంది. రెఫరీ శ్రీనాథ్ విధించిన ఈ జరిమానాను ఇషాంత్ అంగీకరించాడు.

టాంజానియా చరిత్ర

తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత



న్యూఢిల్లీ: ఆఫ్రికా క్రికెట్ జట్టు టాంజానియా చరిత్ర సృష్టించింది. తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. నైజీరియాలో జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో ఆరు జట్ల రౌండ్ రాబిన్ లీగ్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ టాంజానియా విజయాలు సాధించింది. ఈ క్రమంలో 2026లో జరిగే జూనియర్ వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన 12వ జట్టుగా టాంజానియా నిలిచింది. 16 జట్ల టోర్నీలో ఆతిథ్య జట్టుగా జింబాబ్వేతోపాటు గత టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసిన 10 జట్లు నేరుగా క్వాలిఫై అయ్యాయి. ఆసియా, ఈస్ట్ ఆసియా పసిఫిక్, ఐరోపా, అమెరికా రీజియన్ల నుంచి ఒక్కో జట్టు అర్హత సాధించాల్సి ఉంది.

గుట్టుగా వ్యాధుల విస్తరణ

లక్షణాలు లేకుండా పెరుగుతున్న జబ్బులు

దీర్ఘకాల వ్యాధులతో జీవిస్తున్న లక్షలాది మంది

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బీపీ, షుగర్, ఫ్యాటీలివర్

అపోలో 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు.. పైకి ఏ లక్షణమూ కనిపించదు! లోలోపలే శరీరానికి తీరని నష్టం చేస్తుంది!! మధుమేహం.. అధికంగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలున్నా చాలామంది పట్టించుకోరు!! ఈ రెండింటికీ తోడు.. ఇటీవలికాలంలో బాగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్!! పరీక్ష చేస్తే కానీ బయటపడని ఈ జీవనశైలి రుగ్మతలు తమకు ఉన్నాయన్న విషయం కూడా తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాలం గడిపేస్తున్నట్టు అపోలో ఆస్పత్రి సోమవారం విడుదల చేసిన 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న అపోలో ఆస్పత్రుల్లో 25 లక్షలమందికిపైగా వ్యక్తులకు చేసిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా రూపొందించిన నివేదిక ఇది.

దేశవ్యాప్త గణాంకాలు..

దేశవ్యాప్తంగా 4.5 లక్షల మందికి బీపీ పరీక్ష చేయగా.. వారిలో 26% మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. 23% మంది మధుమేహంతో, 65 శాతం మంది ఫ్యాటీలివర్‌తో, 46 శాతం మంది అథెరోస్క్లెరోసిస్ (రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయే) సమస్యతో బాధపడుతున్నట్టు అపోలో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా.. ఫ్యాటీలివర్ బారిన పడినవారిలో 85 శాతం మందికి అసలు మద్యపానం అలవాటే లేదని.. అథెరోస్క్లెరోసిస్ బాధితుల్లో 2.5 శాతం మంది 40 ఏళ్లలోపువారే కావడం ఆందోళనకరమని నివేదిక పేర్కొంది. అలాగే.. రుతుక్రమం ఆగిపోయిన తర్వాత మహిళలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. అపోలో పరీక్షలు చేసినవారిలో మెనోపాజ్‌కు ముందు మధుమేహం బారిన పడినవారు 14% ఉంటే.. మెనోపాజ్ తర్వాత ఆ సంఖ్య 40 శాతానికి చేరిందని పేర్కొంది. బాలల్లోనూ, యువతలోనూ పెరుగుతున్న ఊబకాయంపై ఆ నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాథమిక పాఠశాలల పిల్లల్లో 8 శాతం మంది, కాలేజీ విద్యార్థులు 28 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. యువతలో 19 శాతం మందిలో ముందస్తు రక్తపోటు (ప్రీహైపర్‌టెన్షన్) సమస్య కనిపించడం. పౌష్టికాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం, యువతలో ఒత్తిడి పెరిగిపోవడం ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. ఇక.. దేశవ్యాప్తంగా 53 వేల మందికి నిద్ర రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు చేయగా వారిలో 24 శాతం మంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఏప్నియాతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. రక్తహీనత సమస్యతో 45% మంది మహిళలు, 26% మంది పురుషులు బాధపడుతుండగా.. విటమిన్ డి లోపం స్త్రీ, పురుషుల్లో వరుసగా 77%, 82 శాతంగా ఉంది. విటమిన్ బి12 లోపం 38 శాతం మంది పురుషులు, 27 శాతం మంది మహిళల్లో ఉన్నట్టు తేలింది. 40 ఏళ్లలోపు వారిలో ఈ లోపం మరింత స్పష్టంగా కనిపించింది. బి12 లోపం ఉన్నవారు వైద్యులను సంప్రదించి, దాన్ని సరిచేసుకోకపోతే.. పలు ఆరోగ్యసమస్యల బారినపడే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. అదే సమయంలో.. ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుని అనారోగ్య సమస్యలను గుర్తించి, వైద్యుల సలహా సూచనలను పాటించిన 59 శాతం మందిలో హెచ్‌బీఏ1సీ (గడిచిన 2-3 నెలల సగటు షుగర్ లెవల్స్) స్థాయిలు తగ్గాయని, 51 శాతం మందికి అధిక రక్తపోటు స్థాయిలు తగ్గాయని నివేదికలో తేలింది.

ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై దృష్టిపెట్టాలి

బీపీ, షుగర్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలున్నా.. వాటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది వైద్యపరీక్షలు చేయించుకోవట్లేదని, అలా కాకుండా ముందుగా పరీక్షలు చేయించుకుంటే వీటిలో చాలా జబ్బులు వచ్చే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని నివేదిక సూచించింది. నివేదికలోని అంశాలపై అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్ అంటే భవిష్యత్‌లో నిర్ణయం తీసుకునే అంశం కాదని, ప్రస్తుతం దేశ శ్రేయస్సుకు అదే మూలస్తంభం అని ఆయన అభిప్రాయపడ్డారు. మద్యం సేవించకపోయినా ఫ్యాటీ లివర్ వ్యాధి రావడం.. కొత్త రోగనిర్ధారణ పరీక్షల అవసరాన్ని తెలియజేస్తోందని, సంప్రదాయ స్క్రీనింగ్ పరీక్షలు ఇక ఎంతమాత్రం సరిపోవని అపోలో ఆస్పత్రుల ఎండీ సునీతా రెడ్డి అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

శక్తిమంతమైన లుక్‌లో...



అశ్విన్‌బాబు హీరోగా ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అభినయ, రియా సుమన్, ఆయేషా ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి అశ్విన్‌బాబు లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో ఆయన పాత్ర శక్తిమంతంగా ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ యాక్షన్ మిస్టరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఎం.ఆర్.వర్మ, డీఓపీ: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌరహరి.

గోదారి అందాల నడుమ..



విక్టరీ వెంకటేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో 'గోదారి గట్టుపైన' పాట ఎంత పాపులర్ అయిందో చెప్పనక్కర్లేదు. ఆ పాటలోని మొదటి పదాన్ని తమ సినిమాకు టైటిల్‌గా నిర్ణయించింది రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ. 'గోదారి గట్టుపైన' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. సుభాష్‌చంద్ర దర్శకుడు. నిధి ప్రదీప్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ఒక చల్లని సాయంత్రం వేళ ప్రశాంతమైన గోదావరి ఒడ్డున మీ స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో.. మా సినిమా కూడా అంతే ప్రశాంతంగా ఉంటుంది. అందమైన భావోద్వేగాలతో ఉంటుంది. గోదావరి జిల్లాలు వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో రూపుదిద్దుకుంటోంది. పశ్చిమ గోదావరి ప్రాంతంలోని సుందరమైన ప్రకృతి దృశ్యాలు ప్రేక్షకులకు కనువిందు చేస్తాయి' అని దర్శకుడు చెప్పారు. రాజీవ్ కనకాల, లైలా, దేవీ ప్రసాద్, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభినవ్ రావు ఈ చిత్రానికి నిర్మాత.


ముచ్చటగా బంధాలే!



విజయశాంతి, కల్యాణ్‌రామ్ తల్లీకొడుకులుగా నటిస్తున్న 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రం ఈ నెల 18న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ యాక్షన్ ప్యాక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో వీరిద్దరి పాత్రలు చాలా కీలకం. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బులుసు నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ సింగిల్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. సెకండ్ సింగిల్ 'ముచ్చటగా బంధాలే' ను బుధవారం చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో విడుదల చేయనున్నారు. తల్లీకొడుకుల అనుబంధాన్ని అద్భుతంగా వివరించే పాట ఇది. ఇటీవలె సినిమా ప్రమోషన్స్ ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా చేసిన స్పెషల్ ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని అందించారు. రామ్‌ప్రసాద్ ఛాయాగ్రాహకుడు.



షారుఖ్‌తో మళ్లీ..



షారుఖ్ ఖాన్ కొత్త చిత్రం 'కింగ్' గురించి వినిపిస్తున్న ఒక కొత్త వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. షారుఖ్, ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రలు పోషించే ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రను దీపిక పదుకోన్ పోషించనున్నారట. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా.. సుహానాకు ఆమెకు తల్లిగా నటించడం ప్రత్యేకతేగా మరి. షారుఖ్, దర్శకుడు సిద్దార్థ్ ఆనంద్ ఆ పాత్ర ప్రాధాన్యం గురించి దీపికకు చెప్పి ఆమెను ఒప్పించారట. షారుఖ్ చిత్రంలో దీపిక మళ్లీ నటిస్తున్నందుకు ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు కానీ ఇందులో ఆమెది తల్లి పాత్ర అని తెలియగానే నీరస పడిపోతున్నారు. ఎందుకంటే.. 'దీపికకు 39 ఏళ్లు, సుహానాకు 24 ఏళ్లు. వీరిద్దరికి పదిహేనేళ్ల ఏజ్ గ్యాపే ఉంది కనుక తల్లీకూతుళ్లుగా కంటే అక్కాచెల్లెళ్లుగా చూపిస్తే బాగుంటుంది.. ఆలోచించండి ఖాన్ సాబ్ అని అభిమానులు అభ్యర్థిస్తున్నారట.

ఎక్స్‌లోకి రీ ఎంట్రీ

నటి సమంత సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చారు. ఈ సందర్భంగా తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' టీజర్‌ను అభిమానులతో పంచుకున్నారు. "పెద్ద కలలతో మా టీమ్ చేసిన చిన్ని ప్రయత్నమిది.. ఎంతో ప్రేమతో చేసిన ఈ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రీగుల దర్శకత్వం వహించిన ఈ చిత్ర టీజర్ ఇటీవలే విడుదలైంది. త్వరలోనే రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా, 2012లో ఎక్స్(అప్పట్లో ట్విట్టర్) ఖాతాను ప్రారంభించారు సమంత. ఇటీవలె అందులో పెట్టిన అన్ని పోస్టులను తొలగించారు. అప్పటినుంచి ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్, వ్యక్తిగత విషయాలు, ఫొటోలు షేర్ చేస్తున్నారు. ఇప్పుడీ చిత్రాన్ని ప్రమోట్ చేయడానికి ఆమె ఎక్స్ ఖాతాను తిరిగి ఉపయోగించడంతో నెటిజన్లు ఖుషీ అవుతున్నారు. ఆమెను స్వాగతిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఏకే వస్తున్నాడు..




తమిళ హీరో అజిత్‌కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. త్రిష కృష్ణన్ కథానాయికగా నటించారు. షాయాజీ షిండే, జాకీ ష్రాఫ్, ప్రభు, సునీల్, అర్జున్‌దాస్, సిమ్రాన్, ప్రియాప్రకాశ్ వారియర్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 10న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నువ్వు పెద్ద విలన్‌వని విన్నా.. కానీ నా గేమ్‌లో నేనేరా నీకు విలన్', 'ఏకే వస్తున్నాడు దారివదలండ్రా', 'వాడు భయాన్ని భయపెట్టేవాడు' వంటి సంభాషణలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.

రెండో సారి క్యాన్సర్... భార్యకు ధైర్యం చెప్పిన హీరో



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా సతీమణి, నటి, దర్శకురాలు తహీరా కశ్యప్ రెండోసారి క్యాన్సర్ బారిన పడ్డారు. తనకు తిరిగి రొమ్ము క్యాన్సర్ సోకినట్టు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఎటువంటి అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళ్లాలని తహీరా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తహీరా తన రొమ్ము క్యాన్సర్ విషయం వెల్లడించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని కోరారు. భార్య పెట్టిన పోస్ట్‌కు వెంటనే స్పందిస్తూ 'మై హీరో' అని కామెంట్ పెట్టారు. 2018 లో ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఇక అప్పటినుంచి చికిత్సలో భాగంగా జరిగే ప్రతి చర్యనీ ఆమె సోషల్ మీడియాలో పంచుకుంటూ తనలా క్యాన్సర్‌తో బాధ పడేవారికి ధైర్యాన్ని ఇచ్చారు.



క్యాన్సర్ కేర్



ఇమ్యునోథెరపీతో కాలేయ క్యాన్సర్ ఖతం

కాలేయంతో తిష్ఠ వేసి, సంప్రదాయ చికిత్సలకు లొంగని క్యాన్సర్‌కు ముకుతాడు వేసే ఇమ్యునోథెరపీ చికిత్స అందుబాటులోకొచ్చింది. కణితిని కృశించేలా చేయడంతో పాటు, సర్జరీ, కీమోథెరపీ చికిత్సలకు తగ్గట్టు వ్యాధి తీవ్రతను తగ్గించే ఈ చికిత్సతో సత్ఫలితాన్ని సాధించవచ్చంటున్నారు వైద్యులు.

సాధారణంగా కాలేయ క్యాన్సర్లలో రెండు రకాలుంటాయి. ఒక రకం క్యాన్సర్ శరీరంలోని ఇతరత్రా అవయవాల నుంచి కాలేయానికి సోకుతూ ఉంటుంది. ఇంకొక రకం క్యాన్సర్, కాలేయంలోనే పుడుతూ ఉంటుంది. పొట్ట, పెద్ద పేగులు... ఇలా జీర్ణ వ్యవస్థ నుంచి కాలేయానికి పాకే క్యాన్సర్లను, 'హెపటో సెల్యులర్ కార్సినోమా' (హెచ్‌సియు) అంటారు. సాధారణంగా శరీరంలో పుట్టుకొచ్చే రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ల లాంటి ఇతర క్యాన్సర్లు కాలక్రమేణా తగ్గిపోతూ ఉంటే, కాలేయ క్యాన్సర్ ఒక్కటే అంతకంతకూ పెరిగిపోతూ ఉంది. పైగా ప్రపంచవ్యాప్తంగా హెచ్‌సియు ఆరవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా, ప్రపంచవ్యాప్తంగా మరణానికి కారణమయ్యే మూడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా గుర్తింపు పొందింది. కాలేయ క్యాన్సర్ అత్యంత ప్రాణాంతకమైన క్యాన్సర్‌గా పరిణమించడానికి కారణం, అప్పటికే సిర్రోసిస్‌తో దెబ్బతిన్న కాలేయంలో క్యాన్సర్ గడ్డ పెరగడమే! సాధారణంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ లేదా థైరాయిడ్ క్యాన్సర్లు ఆయా అవయవాలకు సోకిన సందర్భాల్లో, ఆయా అవయవాలు అప్పటివరకూ ఆరోగ్యంగానే ఉంటాయి. కాబట్టి ఆ క్యాన్సర్‌లను నయం చేయడం సులభతరం అవుతూ ఉంటుంది. కానీ హెపటో సెల్యులర్ కార్సినోమాలో, సిర్రోసిస్‌తో ముందు నుంచే దెబ్బతిన్న కాలేయానికి క్యాన్సర్ సోకుతుంది. కాబట్టి ఈ క్యాన్సర్ చికిత్స క్లిష్టమవుతుంది.

కారణాలు అనేకం

గతంలో మన దేశంలో, కాలేయ క్యాన్సర్‌కు హెపటైటిస్ బి, సి వైరస్‌లు ప్రధాన కారకాలుగా ఉండేవి. దీంతో సిర్రోసిస్‌కు గురైన కాలేయంలో క్యాన్సర్ కణుతులు పెరుగుతూ ఉండేవి. కానీ ప్రస్తుతం కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం మూలంగా కాలేయ క్యాన్సర్ సోకే సందర్భాలు పెరిగిపోతున్నాయి. అలాగే టైప్2 మధుమేహం, ఊబకాయాలు కూడా కాలేయ కొవ్వుకు తోడ్పడి, కాలేయ సిర్రోసిస్‌కూ, అంతిమంగా కాలేయ క్యాన్సర్‌కూ దారి తీస్తున్నాయి. కాలేయ కొవ్వు సమస్య ఉన్నప్పుడు కాలేయం సిర్రోసిస్ దశకు చేరుకునేలోపే క్యాన్సర్ కణుతులు ఏర్పడే ప్రమాదం 30 శాతం మేరకు ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వారు అప్రమత్తంగా ఉంటూ, క్రమం తప్పకుండా అల్ట్రాసౌండ్, సిటి స్కాన్, ట్యూమర్ మార్కర్ పరీక్షలు చేయించుకుంటూ, పరిస్థితి అనుమానాస్పదంగా కనిపించినప్పుడు ఎమ్మారై చేయించుకుని చికిత్సలను ఆశ్రయించాలి.

పలు రకాల చికిత్సలతో...

కాలేయ క్యాన్సర్‌కు వైద్యులు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తూ ఉంటారు. కణితితో పాటు దాని చుట్టూరా ఉన్న కణజాలాన్ని తొలగించడం లేదా కాలేయ మార్పిడి చేపట్టడం... ఈ రెండు చికిత్సలనే వైద్యులు ఆశ్రయిస్తూ ఉంటారు. ఒకవేళ కణితిని తొలగించే పరిస్థితి లేనప్పుడు, కణితిని కాల్చేసే మైక్రోవేవ్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ చికిత్సలను అనుసరిస్తారు. అలాగే క్రయోథెరపీ ద్వారా కణితిని ఘనీభవించేలా చేయడం లేదా కణితిని చంపేలా దానితో అనుసంధానమై ఉన్న రక్తనాళం ద్వారా నేరుగా కణితికి ఔషధాన్ని సరఫరా చేసే చికిత్సను కూడా వైద్యులు ఎంచుకుంటారు. కొన్ని సందర్భాల్లో రేడియేషన్ పైపూత కలిగిన బీడ్స్‌ను కణితికి రక్తసరఫరా చేసే రక్తనాళంలో ప్రవేశపెడతారు. మునుపు, బయటి నుంచి అందించే రేడియేషన్ వల్ల, సిర్రోసిస్ బారిన పడి ముందునుంచే దెబ్బతిన్న కాలేయం మరింత దెబ్బతినే పరిస్థితి తలెత్తుతూ ఉండేది. కానీ ఈ నష్టాన్ని నివారించడం కోసం అత్యాధునిక చికిత్సా విధానం అమల్లోకొచ్చింది. అదే.. 'ఎమ్ఆర్ లినాక్'!

సమర్థమైన ఇమ్యునోథెరపీ

ఎమ్ఆర్ లినాక్ చికిత్సలో రేడియేషన్ సూటిగా క్యాన్సర్ కణితికే తప్ప, దాని చుట్టూరా ఉన్న కణజాలానికి సోకదు. దాంతో రేడియేషన్ సహాయంతో క్యాన్సర్ కణితిని సమర్థంగా కాల్చేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ కాలేయంలో ఒకటి కంటే ఎక్కువ కణుతులు ఉన్నప్పుడు, ఇలాంటి రేడియేషన్‌తో ఒకొక్క కణితినీ కాల్చుకుంటూ వెళ్లడం వీలుపడదు. ఇలాంటి సందర్భాల్లో వైద్యులు సిస్టమిక్ థెరపీని ఎంచుకుంటారు. సాధారణంగా పలు రకాల క్యాన్సర్ల చికిత్సల్లో మొదట సర్జరీ, ఆ తర్వాత కీమో ఇవ్వడం జరుగుతుంది. కానీ కాలేయ కణుతులు కీమోథెరపీకి పెద్దగా స్పందించవు. కాబట్టి ఈ తరహా కాలేయ క్యాన్సర్‌కు అందించే కీమోథెరపీ, నోటి మాత్రలతో కొనసాగుతుంది. అలాగే సమర్థమైన ఇమ్యునోథెరపీ కూడా సత్ఫలితాన్ని అందిస్తుంది. ఈ థెరపీలో శరీరానికి అందించే ఏజెంట్స్ వ్యాధినిరోధక వ్యవస్థను చైతన్యం చేస్తాయి. శరీరంలో కణితికి సంబంధించిన కణాలు ప్రయాణిస్తూ ఉన్నప్పుడు, నిఘా కణాలు ఈ అసాధారణ కణాలను కనిపెట్టి, అవి తిష్ఠవేసిన అవయవం దగ్గరకు చేరుకుని వాటిని అంతమొందిస్తూ ఉంటాయి. కానీ కొందర్లో ఈ నిఘా కణాలు చురుకుదనాన్ని కోల్పోతాయి. ఇలాంటి సందర్భాల్లోనే కణుతులు ఏర్పడతాయి. ఇమ్యునోథెరపీ చికిత్సతో వ్యాధినిరోధక వ్యవస్థను కుదుపుకు గురి చేసి, చురుకుదనాన్ని కోల్పోయిన కణాలను చైతన్యపరచడం జరుగుతుంది. అయితే ఇమ్యునోథెరపీలో రెండు రకాల ఔషధాలను అందిస్తారు. ఒకటి వ్యాధినిరోధక కణాల సంఖ్యను పెంచితే, ఇంకొకటి కణితి చుట్టూరా కొత్త రక్తనాళాలు పెరగకుండా నివారిస్తుంది.

మునుపు కాలేయ క్యాన్సర్ చివరి దశకు చేరుకున్న వారికి, జీవించే అవకాశాలు ఎంతో పరిమితంగా ఉండేవి. వీరి జీవితకాలం కొన్ని నెలలకే పరిమితమై ఉండేది. తాజా ఇమ్యునోథెరపీతో ఈ సమయాన్ని కొన్నేళ్లకు పెంచే వీలు కలుగుతోంది. మరీముఖ్యంగా ట్రైడ్ చికిత్సా విధానంతో ఐదేళ్ల వరకూ ఆయుష్షును పెంచుకునే వెసులుబాటు కలుగుతోంది. మునుపు ఈ దశకు చేరుకున్న రోగులకు సర్జరీ, కాలేయ మార్పిడిలను ఆశ్రయించే పరిస్థితి ఉండేది కాదు. కానీ తాజా ఇమ్యునోథెరపీతో కాలేయ మార్పిడికి వీలుగా, కాలేయంలోని కణుతుల సంఖ్యను తగ్గించే సౌలభ్యం దక్కుతోంది.

ఈ లక్షణాల మీద కన్నేసి...

- పైపొట్ట నిండుగా ఉన్నట్టు అనిపించడం
- పక్కటెముకల అడుగున ముడి ఏర్పడినట్టు అసౌకర్యం కలుగుతూ ఉండడం
- కామెర్లు
- పొట్ట వాపు, పొట్టలో నీరు
- ఆకలి మందగించడం
- బరువు తగ్గడం
- వాంతులు, తలతిరుగుడు

నివారణ ఇలా...



సిర్రోసిస్‌ను నియంత్రించగలిగితే హెపటో సెల్యులర్ కార్సినోమా అనే కాలేయ క్యాన్సర్‌ను నివారించుకోవచ్చు. కాబట్టి ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారణాలైన హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, స్థూలకాయం, మధుమేహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. హెపటైటిస్ బి వ్యాక్సిన్లు తీసుకోవాలి. మధుమేహాన్ని సకాలంలో గుర్తించి చికిత్స మొదలుపెట్టాలి. మధుమేహం అదుపు తప్పకుండా చూసుకోవడంతో పటు సమతులాహారంతో బరువును అదుపులో పెట్టుకోవాలి. అలాగే కాలేయాన్ని దెబ్బతీసే మద్యపానం లాంటి దురలవాట్లను మానుకోవాలి.



డాక్టర్ ధర్మేష్ కపూర్
సీనియర్ హెపటాలజిస్ట్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.

పారాహుషార్

బబుల్‌గమ్‌లో ప్లాస్టిక్



నోట్లో ఒక బబుల్‌గమ్ పడేసి, అదే పనిగా నములుతూ కాలక్షేపం చేసేవాళ్లుంటారు. దీంతో నోట్లో లాలాజలం పెరిగి, దంతాలు శుభ్రపడతాయని నమ్మేవాళ్లూ ఉన్నారు. అయితే బబుల్‌గమ్‌లో హానికారక ప్లాస్టిక్ అణువులు దాగి ఉంటాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. క్వీన్స్ యూనివర్శిటీ బెల్‌ఫాస్ట్‌లో చేపట్టిన ఒక అధ్యయనంలో బబుల్‌గమ్‌లో హానికారక పదార్థాలు దాగి ఉన్నాయనే విషయం వెల్లడైంది. జోర్నల్ ఆఫ్ హజార్డస్ మెటీరియల్స్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, ఒక గంట పాటు చూయింగ్ గమ్‌ను నమిలిన వ్యక్తి లాలాజలంలో రెండున్నర లక్షల మైక్రోప్లాస్టిక్స్‌ను కనిపెట్టగలిగినట్టు పరిశోధకులు పేర్కొన్నారు. ఈ పరిశోధకులు, ఆటోమేటెడ్ రామన్ స్పెక్ట్రోస్కోపీ అనే పద్ధతి ద్వారా చూయింగ్‌గమ్‌ను నమలడం వల్ల మన లాలాజలంలోకి ఎన్ని ప్లాస్టిక్ అణువులు ప్రవేశిస్తాయన్నది అంచనా వేశారు. ఇలా సూక్ష్మ రూపాల్లో మన శరీరంలోకి చేరుకునే మైక్రో, నానో ప్లాస్టిక్ అణువులు, మన జీర్ణ వ్యవస్థ, ఊపిరితిత్తులు, పునరుత్పత్తి వ్యవస్థలను దెబ్బతీస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిశోధనా బృందంతో కలిసి పనిచేసిన క్వీన్స్ యూనివర్శిటీ మరొక పరిశోధకుడు, ఉదిత్ పంత్, చూయింగ్‌గమ్‌లో ఉన్న మైక్రోప్లాస్టిక్స్ గురించి వివరిస్తూ, చూయింగ్‌గమ్‌ను నమలడం మొదలుపెట్టిన మొదటి 20నిమిషాలు, 20 నుంచి 40 నిమిషాలు, 40 నుంచి 60 నిమిషాల వ్యవధుల్లోని వేర్వేరు లాలాజలాలను పరిశీలించినప్పుడు, ఆ మూడు నమూనాల్లో మైక్రో, నానో ప్లాస్టిక్స్ కనిపించాయి. మానవ శరీరం మీద ఈ కణాల దీర్ఘకాలిక ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్నది కచ్చితంగా తెలియదు కాబట్టి సాధ్యమైనంత వరకూ ఈ ప్లాస్టిక్స్ కలిగి ఉండే చూయింగ్‌గమ్‌లకు దూరంగా ఉండడమే మేలని పంత్, హెచ్చరిస్తున్నారు.

మూత్రం నలుపు రంగులో ఉందా?

కొన్ని రుగ్మతలు చిత్రమైన లక్షణాల ద్వారా బయల్పడుతూ ఉంటాయి. అల్కాప్టోనూరియా ఈ కోవకు చెందినదే! హోమోజెన్టిసేట్ అనే ఎంజైమ్ లోపంతో తలెత్తే ఈ రుగ్మత 'నల్లని మూత్రం'తో బయల్పడుతూ ఉంటుంది. మరిన్ని విషయాలు తెలుసుకుందాం!

అల్కాప్టోనూరియా, అత్యంత అరుదైన జన్యు సమస్య. ఇది అంతిమంగా కీళ్ల జబ్బులు, మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు దారి తీస్తుంది. శరీరంలోని హోమోజెన్టిసిక్ ఆమ్లం విచ్ఛిన్నానికి హోమోజెన్టిసేట్ అనే ఈ ఎంజైమ్ అవసరం. ఈ ఎంజైమ్ లోపించినప్పుడు, హోమోజెన్టిసిక్ ఆమ్లం శరీరంలో పెరిగిపోయి, మూత్రం ద్వారా బయటకు వచ్చేస్తూ ఉంటుంది. మూత్రం గాలికి బహిర్గతమైనప్పుడు



వ్యాధి నిర్ధారణ

దాన్లోని ఆమ్లం గాలితో ప్రతిచర్య జరిపి, మూత్రం నలుపు రంగులోకి మారిపోతుంది. అల్కాప్టోనూరియాలో కనిపించే ప్రధాన లక్షణమిది. ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో ఈ పరిస్థితి కణజాలం దెబ్బతినే ఓక్రోనోసిస్ అనే సమస్యకు దారి తీస్తుంది.

దీర్ఘకాల సమస్యలు

- **కీళ్ల క్షీణత:** మృదులాస్థిలో పేరుకునే హోమోజెన్టిసిక్ ఆమ్ల నిల్వల మూలంగా కీళ్లు పెళుసుగా మారి, సులభంగా విరిగిపోతాయి. 30 నుంచి 40 ఏళ్ల లోపే ప్రత్యేకించి వెన్ను, తుంటి, మోకీళ్లు తీవ్ర ఆర్థ్రయిటిస్‌కు లోనవుతాయి.
- **మూత్రపిండాల్లో, ప్రోస్టేట్‌లో రాళ్లు:** మూత్రపిండాల్లో, ప్రోస్టేట్‌లో స్ఫటికాల్లా ఏర్పడే హోహోజినిస్టిక్ ఆమ్లం అంతిమంగా రాళ్ల రూపాన్ని సంతరించుకుంటుంది.
- **మంగు:** చర్మం పైన, కనుగుడ్లలోని తెల్లని భాగాల్లో మంగు మచ్చలు ఏర్పడతాయి.

నిర్ధారణ

ప్రస్తుతం ఈ రుగ్మతను సమర్థంగా సరిదిద్దే చికిత్సలు అందుబాటులో లేకపోయినా, లక్షణాలను నియంత్రించడం ద్వారా రోగుల జీవననాణ్యతను మెరుగుపరుచుకునే వీలుంది. నొప్పి నుంచి ఉపశమనం, కీళ్ల పనితీరును మెరుగ్గా ఉంచుకోవడం, మూత్రపిండాలు, ప్రోస్టేట్ పనితీరులను ఓ కంట కనిపెడుతూ ఉండడం ప్రధానమని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన

పసికందులు సురక్షితంగా..

పసికందులకు సుతిమెత్తని దుస్తులు ఎంచుకుంటాం. నాణ్యమైన సబ్బులు, పౌడర్లను వాడుకుంటాం. అయితే వాటిలో దాగి ఉండే హానికారక రసాయనాలను మనం నిర్లక్ష్యం చేస్తున్నామా? పసిపిల్లల ఉత్పత్తుల్లో దాగి ఉండే హానికారకాలు, సురక్షితమైన ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

అత్యధికంగా రసాయనాలకు బహిర్గతమైనవీ, పిల్లల చర్మానికి ఎక్కువ సమయం పాటు తగులుతూ ఉండేవే అత్యంత విషపూరితమైన పసిపిల్లల ఉత్పత్తులని వైద్యులు అంటున్నారు. పసిపిల్లల దుస్తుల తయారీలో ఉపయోగించే ఫార్మాల్డిహైడ్, విషపూరిత రంగులు పిల్లలకు అలర్జీలు, చర్మ సమస్యలను తెచ్చి పెడతాయి. అత్యంత తరచుగా ఉపయోగించే ప్లాస్టిక్ పాల సీసాలు, బొమ్మలు, డయాపర్లు, పౌడర్లు, లోషన్లు, షాంపూల్లో కూడా అత్యధిక విష మోతాదులు ఉంటున్నట్టు వైద్యులు అంటున్నారు. ఇలాంటి విషపూరిత రసాయనాలకు బహిర్గతమయ్యే పిల్లల్లో ఎదుగుదల లోపాలు, శ్వాసకోశ సమస్యలు, నాడీసంబంధ రుగ్మతలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడుకోవాలంటే, విష రహిత, బిస్ఫినాల్ రహిత, సేంద్రీయ ఉత్పత్తులను ఎంచుకోవాలి. తరచూ ఉపయోగించే బొమ్మలు, గిన్నెలు, స్పూన్లు



లాంటి వాటిని తరచూ శుభ్రంగా కడుగుతూ ఉండాలి. అలాగే పాలు పట్టడం కోసం ప్లాస్టిక్ బదులుగా స్టీలు, లేదా గాజు సీసాలను ఎంచుకోవాలి. అలాగే ఘాటు వాసన కలిగి ఉండే సబ్బులు, షాంపూల వాడకం మానేయాలి. అలాగే ఈ జాగ్రత్తలు పాటించాలి.

- **లేబుల్స్:** ఉత్పత్తుల లేబుళ్ల మీద పారాబెన్ ఫ్రీ, సల్ఫేట్ ఫ్రీ, బిపిఎ ఫ్రీ అని రాసి ఉన్న వాటినే ఎంచుకోవాలి
- **ధృవీకరించినవి:** సేంద్రీయ లేదా విష రహిత ధృవీకరణల కోసం వెతకాలి
- **సహజసిద్ధమైనవి:** వృక్షాధారిత లోషన్లు, చెక్క బొమ్మలు ఎంచుకోవాలి
- **సువాసన లేనివి:** సబ్బులు, షాంపూలు సువాసన లేనివాటిని ఎంచుకోవాలి
- **కొత్తవి:** కొత్త దుస్తులు, బొమ్మలను కొన్న వెంటనే శుభ్రంగా కడగాలి
- **రీయూజబుల్:** వస్త్రంతో తయారైన డయాపర్లు, వైప్స్ వాడుకోవాలి

లైంగికారోగ్యం

ఆ ఆసక్తి కొరవడిందా?

మహిళల్లో లైంగికాసక్తి లోపం అత్యంత సహజం. జీవితంలోని వేర్వేరు దశల్లో, వేర్వేరు ఆరోగ్య కారణాలతో ఈ పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. అలాంటప్పుడు మానసికంగా కుంగిపోకుండా మూల కారణాన్ని సరిదిద్దుకోవడంతో పాటు, లైంగికాసక్తిని పెంచే మందులు వాడుకోవాలంటున్నారు వైద్యులు.

లైంగికాసక్తి లోపం ఏ వయసులోనైనా తలెత్తవచ్చు. లైంగిక కోరికలు తగ్గినప్పుడు, అందుకు కారణాలను వెతికి వాటిని సరిదిద్దుకోవడం మీద దృష్టి పెట్టాలే తప్ప, పరిస్థితితో సర్దుకుపోయే ప్రయత్నం చేయడం సరి కాదు. ఈ ఆసక్తి లోపించడానికి ప్రధాన కారణాలు ఏవంటే...

- **స్క్రీన్ టైమ్:** పక్క గదిలో ఉన్న భర్తతో వాట్సాప్ మెసేజీలతో సంభాషించే భార్యలున్నారు. లేదంటే ఒకే పడక మీద వేర్వేరు ఫోన్లలో మునిగిపోయే దంపతులూ ఉన్నారు. దంపతులిద్దరూ కలిసి తినడం, కలిసి బయటకు వెళ్లడం, కలిసి సినిమా చూడడం లాంటివన్నీ తగ్గిపోయి, ఎవరి ఫోన్లలో వాళ్లు మునిగిపోయే పరిస్థితి పెరుగుతోంది. సామాజిక మాధ్యమాలు, ఓటిటిలు, ఫోన్ కాల్స్... వీటితో అన్యోన్యంగా గడపవలసిన సమయాన్ని స్క్రీన్స్‌తో వృథా చేసుకునే ధోరణి ఇటీవలి కాలంలో పెరిగిపోతోంది. ఈ ధోరణితో లైంగికాసక్తి కుంటుపడడం అత్యంత సహజం.
- **ఆరోగ్య కారణాలు:** మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు లైంగికాసక్తి మీద ప్రభావాన్ని కనబరచడంతో పాటు, లైంగికాసక్తి లోపాన్ని పెంచుతూ ఉంటాయి. అలాగే ఈ సమస్యలకు వాడుకునే మందుల దుష్ప్రభావాల వల్ల కూడా లైంగికాసక్తి తగ్గుతుంది.
- **మానసిక కారణాలు:** మానసిక కుంగుబాటు, ఒత్తిడి, ఆందోళనలు కూడా లైంగికాసక్తిని కుంటుపరుస్తాయి. వీటిని అధిగమించేవరకూ సెక్స్ పట్ల ఆసక్తి పెరగకపోవచ్చు. అలాగే తమ శరీరంలో లేని లోపాలను ఊహించుకుని కుంగిపోయే మహిళలు ఉంటారు. లైంగికాసక్తి లోపానికి ఈ లక్షణం కూడా ఒక కారణమే!
- **హార్మోన్లలో హెచ్చుతగ్గులు:** గర్భిణిగా ఉన్నప్పుడు, పిల్లలకు పాలిచ్చేటప్పుడు, మెనోపాజ్‌కు చేరుకున్నప్పుడు.. ఇలా మహిళలు వారి జీవితంలో పలు దశల్లో హార్మోన్ల అవతకవకలకు లోనవుతూ, ఆయా సందర్భాల్లో లైంగికాసక్తిని కోల్పోతూ ఉంటారు. కొత్త తల్లులు పిల్లలకు పాలిచ్చినంత కాలం, లైంగికాసక్తి తగ్గిపోతుంది. ఇది అత్యంత సహజం. కొంత మంది ఆడపిల్లలకు పిసిఒడి ఉంటుంది. ఈ చికిత్సలో తీసుకునే హార్మోన్ మాత్రల వల్ల కోరికలు తగ్గిపోతాయి.

> పెరి మెనోపాజ్, మెనోపాజ్ దశలకు చేరుకున్న మహిళల్లో, హార్మోన్ల హెచ్చుతగ్గులకు శరీరం అలవాటుపడడానికి కనీసం రెండేళ్లు పడుతుంది. ఆ సమయంలో హార్మన్ల హెచ్చుతగ్గుల వల్ల లైంగికాసక్తి కొరవడుతుంది.

మందులున్నాయి

లైంగికాసక్తి లోపానికి మూల కారణాలను కనిపెట్టి, వాటిని సరిదిద్దుకోగలిగితే సమస్య పరిష్కారమవుతుంది. అధిక బరువు తగ్గి, థైరాయిడ్, పిసిఒడి, అధిక రక్తపోటు సమస్యలను అదుపు చేసుకోగలిగితే, ఆ సమస్యలకు వాడే మందుల మోతాదును తగ్గించుకోవచ్చు. తద్వారా కోల్పోయిన లైంగికాసక్తిని తిరిగి పొందవచ్చు. అయినప్పటికీ లైంగికాసక్తి పెరగనప్పుడు, ఆ ఆసక్తిని పెంచే అదనపు మందులు కూడా అవసరమవుతాయి. ఇప్పుడు తాజాగా మూడు రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

మెనోపాజ్‌లో...

మెనోపాజ్‌కు చేరుకోగానే అక్కడితో లైంగిక జీవితం ముగిసిపోయిందని కుంగిపోయే మహిళలే ఎక్కువ మంది ఉంటారు. కానీ నిజానికి లైంగిక జీవితానికి సంబంధించిన రెండో దశ, నడి వయసులోనే మొదలవుతుంది. ఈ దశలో గర్భం దాల్చే భయం ఉండదు, పిల్లలను పెంచే బాధ్యతలు ఉండవు. తీరుబడిగా ఇళ్లలో కాలక్షేపం చేసే ఆ దశను అనవసరపు కుంగుబాటుతో వృథా చేసుకోకూడదు. వయసైపోయిందని బాధపడుతూ లైంగిక క్రీడకు దూరంగా ఉండిపోకూడదు. మరీ ముఖ్యంగా పెరి మెనోపాజ్, మెనోపాజ్ దశలకు చేరుకున్న మహిళల్లో, హార్మోన్ల హెచ్చుతగ్గులకు శరీరం అలవాటుపడడానికి కనీసం రెండేళ్లు పడుతుంది. ఆ సమయంలో హార్మన్ల హెచ్చుతగ్గుల వల్ల లైంగికాసక్తి కొరవడుతుంది. తర్వాత పరిస్థితి సర్దుకున్నప్పటికీ కొందర్లో తీవ్రమైన మానసిక, శారీరక సమస్యలు కూడా వేధిస్తాయి. అలాంటప్పుడు హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ తీసుకోవచ్చు. హార్మోన్ ప్యాచెస్ కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. వీటికి తోడు లైంగికాసక్తిని పెంచే మాత్రలు, శరీర అసౌకర్యాన్ని తొలగించే లూబ్రికెంట్లు కూడా వాడుకోవచ్చు. క్యాల్షియం మాత్రలతో ఎముకలను దృఢంగా ఉంచుకోగలిగితే, ఈ వయసులో ఒళ్లు నొప్పులు వేధించకుండా ఉంటాయి. వ్యాయామంతో శరీరాన్ని చురుగ్గా ఉంచుకుంటూ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, మనసును హుషారుగా ఉంచుకోగలిగితే, మెనోపాజ్‌లో సైతం, మునుపటిలా లైంగికాసక్తిని పుంజుకోగలుగుతారు.





డాక్టర్ షర్మిల మజుందార్
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్,
www.doctorsharmila.in

బ్లాక్ మండే



ప్రపంచ మార్కెట్లో ట్రంప్ సుంకంపాలు

కుప్పకూలిన ప్రామాణిక సూచీలు.. ఆరంభ ట్రేడింగ్‌లో 5 శాతానికి పైగా క్షీణించిన సెన్సెక్స్, నిఫ్టీ

క్షణాల్లో రూ.20 లక్షల కోట్లు ఆవిరి.. చివరికి 2,226 పాయింట్ల నష్టంతో


73,137.90 వద్ద ముగిసిన సెన్సెక్స్.. నిఫ్టీ 743 పాయింట్లు డౌన్.. 22,161 వద్ద క్లోజింగ్

మదుపరులకు రూ.14 లక్షల కోట్ల నష్టం

ముంబై: ప్రపంచ స్టాక్ మార్కెట్లను ట్రంప్ సుంకాలు కుదిపేస్తున్నాయి. ఆ ధాటికి సూచీలు కుప్పకూలుతున్నాయి. మన దలాల్‌స్ట్రీట్ కూడా రక్తమోడింది. భారీ పతనంతో మదుపరుల నష్టాల ఘోష మిన్నంటింది. ట్రేడింగ్ ఆరంభంలోనే సూచీలు 5 శాతానికి పైగా క్షీణించాయి. క్షణాల్లో రూ.20 లక్షల కోట్లకు పైగా మార్కెట్ సంపద హరించుకుపోయింది. ఈ 'సుంకష్టాలు' ఇంతటితో ఆగేలా.. ఇప్పట్లో తీరేలా కన్పించడం లేదు. ముందుంది ముసళ్ల పండగ. ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధం తీవ్రతరం కానుందని.. అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకోవడం దాదాపు ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అంటే, మార్కెట్లకు ఇది ట్రైలరేనా..? బేర్ మహా విశ్వరూపాన్ని త్వరలోనే చూడాల్సి వస్తుందా..? వేచి చూడాల్సిందే..

- బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ సోమవారం ట్రేడింగ్ ఆరంభంలోనే 3,939.68 పాయింట్లు (5.22 శాతం) పతనమై 71,425.01 వద్దకు జారుకుంది. ఆ తర్వాత కాస్త తేరుకున్న సూచీ, చివరికి 2,226.79 పాయింట్ల (2.95 శాతం) నష్టంతో 73,137.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ప్రారంభంలోనే 1,160.80 పాయింట్లు (5.06 శాతం) క్షీణించి 21,743.65 వద్దకు జారుకుంది. చివర్లో 742.85 పాయింట్ల (3.24 శాతం) నష్టంతో 22,161.60 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల దెబ్బకు సూచీలు భారీగా నష్టపోవడం వరుసగా ఇది మూడో రోజు.
- ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రారంభ ట్రేడింగ్‌లో రూ.20.16 లక్షల కోట్ల మేర కరిగిపోయింది. చివరికి రూ.14.09 లక్షల కోట్ల తరుగుదలతో రూ.389.25 లక్షల కోట్లకు (4.54 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.
- గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ ఫిబ్రవరి వరకు వరుసగా 5 నెలల పాటు దిద్దుబాటుకు లోనైన స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు గత నెలలో మళ్లీ 6 శాతం వరకు పుంజుకున్నాయి. ట్రంప్ సుంకాల ప్రభావంతో ఏర్పడిన వరుస నష్టాల కారణంగా సూచీలు మళ్లీ వేగంగా తగ్గుతూ వచ్చాయి. మార్చి 24 గరిష్ఠ స్థాయితో పోలిస్తే దాదాపు రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో హిందుస్థాన్ యూనిలీవర్ మినహా అన్నీ నష్టపోయాయి. టాటా స్టీల్ షేరు 7.73 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్ 5 శాతానికి పైగా పతనమవగా.. కోటక్ బ్యాంక్, ఎం అండ్ ఎం 4.33 శాతం వరకు నష్టపోయాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3 శాతానికి పైగా క్షీణించాయి.
- బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 4.13 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 3.46 శాతం నష్టపోయాయి. రంగాలవారీ సూచీలన్నీ నేలచూపులు చూశాయి. మెటల్ ఇండెక్స్ ఏకంగా 6.22 శాతం తరిగిపోయింది. రియల్టీ 5.69 శాతం పడిపోయింది. కమోడిటీస్, ఇండస్ట్రియల్స్ 4 శాతానికి పైగా తగ్గాయి.
- బీఎస్ఈలో 3,515 కంపెనీల షేర్లు నష్టపోగా.. 570 లాభపడ్డాయి. 140 యథాతథంగా ముగిశాయి. 775 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. 11 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 32 పైసలు క్షీణించి రూ.85.76 వద్ద ముగిసింది. గడిచిన ఐదు వారాల్లో రూపాయి మారకం విలువలో ఇదే అతిపెద్ద నష్టం. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో పాటు ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గినప్పటికీ ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉపసంహరణ మన కరెన్సీకి గండికొట్టాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి.
- అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ రకం ముడిచమురు పీపా ధర ఒకదశలో 3.61% తగ్గి 63.21 డాలర్లకు దిగివచ్చింది.

టాప్-5 కుబేరులకు 85,800 కోట్ల నష్టం



స్టాక్ మార్కెట్ మహా పతనంతో దేశంలోని ఐదుగురు అత్యంత ధనవంతుల సంపద ఒక్కరోజులోనే 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.85,800 కోట్లు) మేర తరిగిపోయింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ల జాబితా ప్రకారం.. భారత కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ ఆస్తి 290 కోట్ల డాలర్ల (రూ.24,882 కోట్లు) మేర తగ్గి మొత్తం 8,840 కోట్ల డాలర్లకు (రూ.7.58 లక్షల కోట్లు) పడిపోయింది. రెండో అతిపెద్ద ధనవంతుడు, అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ నెట్‌వర్త్ 280 కోట్ల డాలర్ల (రూ.24,024 కోట్లు) తగ్గుదలతో 5,760 కోట్ల డాలర్లకు (రూ.4.94 లక్షల కోట్లు) జారుకుంది. దేశంలో అత్యంత సంపన్న మహిళ, జిందాల్ గ్రూప్ చైర్‌పర్సన్ 230 కోట్ల డాలర్లు (రూ.19,734 కోట్లు) నష్టపోయారు. దాంతో ఆమె కుటుంబ ఆస్తి 3,380 కోట్ల డాలర్లకు (రూ.2.90 లక్షల కోట్లు) పడిపోయింది. హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ నెట్‌వర్త్ 90.2 కోట్ల డాలర్లు (రూ.7,740 కోట్లు) తగ్గి 3,150 కోట్ల డాలర్లకు (రూ.2.70 లక్షల కోట్లు) జారుకుంది. దేశంలో ఐదో అత్యంత సంపన్నుడు, సన్ ఫార్మా చైర్మన్ దిలీప్ సంఘ్వీ 63.2 కోట్ల డాలర్లు (రూ.5,423 కోట్లు) నష్టపోయారు. దాంతో ఆయన ఆస్తి 2,630 కోట్ల డాలర్లకు (రూ.2.26 లక్షల కోట్లు) పరిమితమైంది.

బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ లూజర్స్

%		షేరు ముగింపు ధర
-7.73	టాటా స్టీల్	129.60
-5.78	ఎల్ అండ్ టీ	3070.85
-5.54	టాటా మోటార్స్	579.85
-4.33	కోటక్ బ్యాంక్	2040.50
-4.11	ఎం అండ్ ఎం	2490.90
-3.75	ఇన్ఫోసిస్	1397.80
-3.72	యాక్సిస్ బ్యాంక్	1048.95
-3.54	ఐసీఐసీఐ బ్యాంక్	1287.65
-3.27	హెచ్‌సీఎల్ టెక్	1375.30
-3.24	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1758.15

గ్లోబల్ సూచీలు విలవిల

» మన మార్కెట్టే కాస్త మెరుగు

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లతో పోలిస్తే భారత సూచీలు తక్కువ నష్టాలతోనే సరిపెట్టుకున్నాయని చెప్పాలి. ఎందుకంటే, సోమవారం చైనాకు చెందిన షాంఘై ఇండెక్స్ 7.34 శాతం, జపాన్ నిక్కీ 7.83 శాతం, హాంకాంగ్‌కు చెందిన హాంగ్‌సెంగ్ 13.22 శాతం క్షీణించాయి. యూరప్ మార్కెట్లదీ అదే పరిస్థితి. గతవారం చివరి రెండు సెషన్లలో 10 శాతం వరకు క్షీణించిన ఐరోపా సూచీలు.. సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో 4 శాతం వరకు నష్టపోయాయి. గత శుక్రవారం అమెరికాలోని డౌజోన్స్ 5.50 శాతం, నాస్‌డాక్ 5.82 శాతం, ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్ 5.97 శాతం పతనమయ్యాయి. గత వారంలో చివరి రెండు సెషన్లలో అమెరికా స్టాక్ మార్కెట్లో 5 లక్షల కోట్ల డాలర్లకు (రూ.428 లక్షల కోట్లు) సంపద ఆవిరైంది. సోమవారం ట్రేడింగ్‌లోనూ యూఎస్ ఇండెక్స్‌లు తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో డౌజోన్స్ 700 పాయింట్ల వరకు తగ్గింది. ఎస్ అండ్ పీ, నాస్‌డాక్ సైతం ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

ప్రపంచ మార్కెట్ల పతనం

సూచీ	నష్టం(%)
ఆసియా	
షాంఘై(చైనా)	7.34
నికాయ్ (జపాన్)	7.83
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	13.22
ఐరోపా	
ఎఫ్‌టీఎస్ఈ(బ్రిటన్)	4.38
సీఏసీ (ఫ్రాన్స్)	4.78
డాక్స్ (జర్మనీ)	4.13
అమెరికా (భారత కాలమానం ప్రకారం రాత్రి 12.00 నాటికి)	
డౌజోన్స్	0.86
ఎస్ అండ్ పీ 500	0.04
నాస్‌డాక్	+0.30

మెల్టింగ్ మెటల్

సుంకాల దెబ్బకు లోహ రంగ షేర్ల ధరలు వేగంగా కరిగిపోతున్నాయి. మిగతా రంగాలతో పోలిస్తే మెటల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి తీవ్రతరమైంది. బీఎస్ఈలో నాల్కో షేరు 8.18 శాతం పతనమవగా.. టాటా స్టీల్ 7.73 శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 7.58 శాతం, సెయిల్ 7.06 శాతం, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ 6.90 శాతం, వేదాంత 6.90 శాతం, జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ 6.36 శాతం, హిందాల్కో 6.26 శాతం, ఎన్ఎండీసీ 5.75 శాతం, హిందుస్థాన్ జింక్ 4.89 శాతం, ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ 4.77 శాతం నష్టపోయాయి. దాంతో బీఎస్ఈలోని మెటల్ సూచీ 6 శాతానికి పైగా తగ్గింది.

గత 10 నెలల్లో అతిపెద్ద క్షీణత

మన ఈక్విటీ సూచీలకు గత 10 నెలల్లో ఇదే అతిపెద్ద ఒక్కరోజు క్షీణత. చివరగా, 2024 జూన్ 4న సెన్సెక్స్ 4,389.73 పాయింట్లు (5.74 శాతం), నిఫ్టీ 1,379.40 పాయింట్లు (5.93 శాతం) పతనమయ్యాయి. ఇంట్రాడేలోనైతే సెన్సెక్స్ 6,234.35 పాయింట్లు (8.15 శాతం), నిఫ్టీ 1,982.45 పాయింట్లు (8.52 శాతం) పడిపోయాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం అందుకు కారణం. కాగా, కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో 2020 మార్చి 23న సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కరోజే 13 శాతం మేర నష్టపోయాయి.

నిఫ్టీ అతిపెద్ద నష్టాలు

తేదీ	పాయింట్లు	(%)
2025 ఏప్రిల్ 7	742.85	3.24
2024 జూన్ 4	1,379.40	5.93
2020 మార్చి 23	1,135.20	12.98
2008 అక్టోబరు 24	386.00	13.11
2008 జనవరి 21	496.50	8.70
2004 మే 17	196.90	12.24
1997 మార్చి 31	89.50	8.46

డీమ్యాట్ ఖాతాలపైనా సుంకాల ఎఫెక్ట్!

ట్రంప్ సుంకాల కారణంగా గత కొంతకాలంగా ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతున్నాయి. దాంతో మార్కెట్ భవిష్యత్ దిశ, రాబడులపైనా అనిశ్చితి నెలకొంది. తత్ఫలితంగా స్టాక్ మార్కెట్లోకి కొత్తగా ప్రవేశించాలనుకునేవారూ సరైన సమయం కోసం వేచి చూస్తున్నారు. ఇది మార్కెట్లో ట్రేడింగ్ నెరిపేందుకు అవసరమైన డీమ్యాట్ ఖాతాల వృద్ధిపైనా ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది మార్చిలో కొత్తగా 20.4 లక్షల డీమ్యాట్ అకౌంట్లను తెరిచారు. నెలవారీ ఖాతాల వృద్ధిలో 23 నెలల (2023 ఏప్రిల్ తర్వాత) కనిష్ఠ స్థాయి ఇది. ఈ ఫిబ్రవరిలో కొత్తగా తెరిచిన 30.3 లక్షల అకౌంట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. కొత్త ఖాతాలు తగ్గడం వరుసగా ఇది మూడోనెల. ఫిబ్రవరిలో 19.040 కోట్లుగా ఉన్న మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య ఈ మార్చి చివరి నాటికి 19.244 కోట్లకు చేరుకుంది.

రూ.9,000 కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) సోమవారం ఒక్కరోజే నికరంగా రూ.9,040 కోట్ల షేర్లను విక్రయించారు.విలువపరంగా ఎఫ్‌పీఐలకు ఈ ఏడాదిలో ఇది రెండో అతిపెద్ద ఒక్కరోజు నికర విక్రయం. ఫిబ్రవరి28న మార్కెట్ నుంచి నికరంగా రూ.11,639 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

'బంగారం అంటే భీమ'

రామ్‌చరణ్‌తో సరికొత్త ప్రచారం

ప్రారంభం: భీమ జువెల్స్



హైదరాబాద్: ప్రముఖ జువెలరీ రిటైలర్ భీమ జువెల్స్, 'బంగారం అంటే భీమ' పేరుతో సరికొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. సంస్థ బ్రాండ్ అంబాసిడర్ రామ్‌చరణ్‌తో ప్రత్యేకంగా ఈ క్యాంపెయిన్‌ను రూపొందించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సంస్కృతులు ప్రతిబింబించే విధంగా దీన్ని రూపొందించినట్లు భీమ జువెల్స్ వెల్లడించింది ఈ క్యాంపెయిన్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని సంస్కృతులకు ప్రతిరూపాలైన హారాలు, వడ్డాణాలు, గుట్టపూసలు, చోకర్స్ నక్షి గాజులు, జుమ్కీలు వంటి ఆభరణాలను ప్రదర్శించనున్నట్లు తెలిపింది. ప్రతి ఆభరణాన్ని భీమ జువెల్స్ పూర్తిగా నిబద్ధతతో తయారు చేసిందని పేర్కొంది. అంతేకాదు తెలుగు వారి వేడుకలు, వివాహాల్లో ఈ బంగారు ఆభరణాలు ముఖ్యమైన భాగంగా ఉంటాయని తెలిపింది. బంగారం అంటే భీమ అనేది ఒక క్యాంపెయిన్ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో బంగారాన్ని ఇష్టపడే వారికి ఒక ప్రత్యేకమైన వేడుక అని భీమ జువెల్స్ ఎండీ అభిషేక్ బిందుమాధవ్ అన్నారు.

మా కార్లపైనా సుంకాలు తగ్గించండి!

» భారత్‌కు ఈయూ సరికొత్త ప్రతిపాదన

» ట్రంప్ బాటలోనే ఈయూ

న్యూఢిల్లీ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం కింద భారత్‌లోకి దిగుమతి అవుతున్న కార్లపై జీరో సుంకాలు ప్రకటించాలని యూరోపియన్ యూనియన్ (ఈయూ) కోరుతోంది. అయితే ఆ చర్చలకు ఒక ముగింపు ఇచ్చే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం సైతం తన ప్రతిపాదనలను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు సంసిద్ధత ప్రకటిస్తోంది. ప్రస్తుతం యూరప్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కార్లపై 100 శాతం సుంకం విధిస్తుండగా దాన్ని దశలవారీగా 10 శాతానికి తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దేశీయ పరిశ్రమను రక్షించడం కోసం దిగుమతి కార్లపై సుంకాన్ని కనీసం 30 శాతంగా కొనసాగించాలని ఒకపక్క పరిశ్రమ వర్గాలు కోరుతుండగా ప్రభుత్వం అందుకు భిన్నమైన వైఖరిపై సమాలోచనలు జరుపుతుండటం గమనార్హం. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం దిగుమతి సుంకాలు తగ్గించాలని ఒత్తిడి పెంచుతున్న సమయంలోనే ఈయూ నుంచి కూడా అదే తరహా ప్రతిపాదన రావటం గమనార్హం.

ఎవరి మాట నెగ్గేను: ఈయూ ప్రతిపాదనలకు ప్రభుత్వం తలొగ్గినట్టయితే అది ఫోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి కంపెనీలతో పాటు ఈ ఏడాది దేశంలో విద్యుత్ కార్ల (ఈవీ) విక్రయాలు ప్రారంభించాలన్న ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లాకు కూడా ఒక ఘన విజయమే అవుతుంది. ఈయూ డిమాండ్లను గత వారం ఆటోమొబైల్ పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం తెలియచేసింది. అయితే ఈ తాజా పరిస్థితులపై వ్యాఖ్యానించేందుకు వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులు గాని, సియామ్ ప్రతినిధులు గాని నిరాకరించారు. వాస్తవానికి ఏటా 40 లక్షల కార్ల అమ్మకాలు నమోదయ్యే మన ఆటోమొబైల్ మార్కెట్ అత్యంత సురక్షిత మార్కెట్. మరోవైపు ఈవీలపై దిగుమతి సుంకాలు తగ్గించవద్దని టాటా మోటార్స్, మహీంద్రా.. ప్రభుత్వంతో లాబీయింగ్ చేస్తున్నాయి.

వడ్డీ రేట్ల తగ్గింపే ట్రంప్ అసలు వ్యూహం

అందుకే మాంద్యం కోసం ప్రయత్నాలు



న్యూయార్క్: అన్ని దేశాల దిగుమతుల మీద ట్రంప్ సర్కారు ఎడాపెడా సుంకాలు విధిస్తోంది. దీంతో అమెరికా మరోసారి ఆర్థిక మాంద్యం బారిన పడే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఆ సుంకాలకు వ్యతిరేకంగా అమెరికాలోని పలు నగరాల్లో నిరసన ప్రదర్శనలూ వెల్లువెత్తుతున్నాయి. అయినా ట్రంప్ సర్కారు ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. ఎవరెంత అరిచి గీపెట్టినా సుంకాలపై వెనక్కి తగ్గేదేలే అని స్పష్టం చేశారు. తన సుంకాలకు ప్రతీకారంగా అమెరికా దిగుమతులపై చైనా విధించిన 34 శాతం సుంకాలనూ వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకపోతే చైనా దిగుమతులపై మరిన్ని సుంకాలు తప్పవని తాజాగా హెచ్చరించారు. ఈ సుంకాల పోరు వెనుక అధ్యక్షుడు ట్రంప్‌కు పెద్ద వ్యూహమే ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏమిటీ వ్యూహం

పేరుకు అగ్రరాజ్యమైనా అమెరికా కూడా పెద్ద అప్పులకుప్పగా మారింది. ప్రస్తుతం ఆ దేశ ప్రభుత్వ అప్పు 36 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.3,079 లక్షల కోట్లు) చేరింది. ఇది ఆ దేశ జీడీపీలో 120 శాతానికి సమానం. ఈ మొత్తం అప్పుల్లో 7.2 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.615 లక్షల కోట్లు) అప్పును వచ్చే ఏడాది జూన్‌లోగా చెల్లించాలి. ఈ అప్పుపై ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం ఏటా చెల్లిస్తున్న వడ్డీ రేటు 1 నుంచి 1.5 శాతం మాత్రమే. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీ రేటు 4 నుంచి 4.5 శాతం వరకు ఉంది. మనకు ఇది తక్కువగా కనిపించినా అమెరికన్లకు మాత్రం ఇది చాలా పెద్దమొత్తమే.

నిధుల కొరత

అయితే ప్రస్తుతం అమెరికా ఖజానా కూడా దాదాపుగా నిండుకుంది. ద్రవ్య లోటూ జీడీపీలో 6 శాతానికి చేరింది. గత ఆర్థిక సంవత్సరానికి మన దేశంలో నమోదైన 4.7 శాతం కంటే ఇది ఎక్కువ. డాలర్ ఇంటర్నేషనల్ కరెన్సీ కావడంతో కొత్త అప్పుల సమీకరణ అమెరికాకు పెద్ద కష్టమేమీ కాదు. అలా అని 4 నుంచి 4.5 శాతం వడ్డీతో కొత్త అప్పులు తేవడం ట్రంప్ సర్కారుకు ఇష్టం లేదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

వడ్డీ రేట్ల తగ్గింపే అసలు లక్ష్యం !

వచ్చే ఏడాది జూన్‌లోగా 7.2 లక్షల కోట్ల డాలర్ల అప్పులు చెల్లించేందుకు సరిపడా డబ్బులు కూడా ట్రంప్ సర్కారు వద్ద లేవు. ఈ అప్పుల్ని రీ ఫైనాన్స్ చేయడం ఒక్కటే ప్రస్తుతం ట్రంప్ సర్కారు ముందున్న మార్గం. అలా అని ఈ అప్పులపై ప్రస్తుతం 4 నుంచి 4.5 శాతం వడ్డీ చెల్లించేందుకూ ట్రంప్ ఇష్టపడడం లేదు. దీంతో అన్ని దేశాల దిగుమతులపై ఎడాపెడా సుంకాలు మోపి, ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెట్టి వడ్డీ రేట్ల తగ్గింపునకు ట్రంప్ వ్యూహం పన్నారనే అంచనాలు వినిపిస్తున్నాయి. 'సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగదు, ముందు మీరు వడ్డీ రేట్లు తగ్గించండి' అని అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్‌ను ట్రంప్ తాజాగా దబాయించడం వెనుక ఇదే వ్యూహం ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ వ్యూహంతో ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్ కుప్పకూలినా ట్రంప్ పెద్దగా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. వడ్డీ రేట్లు తాను అనుకున్న 2 శాతం దిగువకు వచ్చాక ఈ రెండూ మళ్లీ రేసుగుర్రాల్లా పరిగెడతాయని ట్రంప్ నమ్మకం. ఈ నమ్మకం ఎలా ఉన్నా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్ మదుపరులు మాత్రం లబోదిబోమంటున్నారు.

ట్రంప్ టారిఫ్‌లతో మనకు ముప్పే

» రూ.49,438 కోట్ల ఎగుమతులకు గండి: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలు ఈ సంవత్సరం అమెరికాకు మన వస్తు ఎగుమతులను బాగానే దెబ్బతీయనున్నాయి. ఈ ప్రభావం ఎంత లేదన్నా 576 కోట్ల డాలర్ల (సుమారు రూ.49,438 కోట్లు) మేరకు ఉంటుందని జీటీఆర్ఐ అనే మేధో సంస్థ అంచనా. భారత్ నుంచి అమెరికాకు జరిగే మొత్తం ఎగుమతుల్లో ఇది దాదాపు 6.41 శాతానికి సమానం. ట్రంప్ టారిఫ్‌లతో గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అమెరికాకు మన మత్స్య ఎగుమతులు 20.2 శాతం, ఇనుము, స్టీల్ ఎగుమతులు 18 శాతం, ఆభరణాలు, వజ్రాల ఎగుమతులు 15.3 శాతం, ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతులు 12.1 శాతం, ఎలక్ట్రిక్, టెలికాం, ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు 12 శాతం మేర పడిపోయే ప్రమాదం ఉందని జీటీఆర్ఐ అంచనా వేసింది. ప్లాస్టిక్ వస్తువులు, తివాచీలు, పెట్రో ఉత్పత్తులు, ఆర్గానిక్ రసాయనాలు, యంత్ర పరికరాల ఎగుమతులూ నీరసిస్తాయని తెలిపింది. మన రొయ్యల ఎగుమతులపైనా ట్రంప్ సర్కారు 26 శాతం సుంకాలు విధించింది. ఇప్పటికే ఉన్న యాంటీ డంపింగ్, కౌంటర్‌వీలింగ్ డ్యూటీలను కూడా కలుపుకుంటే అమెరికాకు చేసే మన రొయ్యల ఎగుమతులపైన 36 శాతం వరకు సుంకాల పోటు పడుతుంది. దీంతో ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో రొయ్యల ధర కౌంట్‌ను బట్టి కిలోకు 20 శాతం పడిపోయింది.

ఐటీ రంగం బిక్కు బిక్కు

» వెంటాడుతున్న అమెరికా మాంద్యం భయాలు

» 2025-26 ఆదాయ, లాభాల అంచనాలు కుదించే చాన్స్

న్యూఢిల్లీ: భారత ఐటీ కంపెనీలకూ ట్రంప్ సుంకాల భయం పట్టుకుంది. ఈ వాణిజ్య యుద్ధం ఎక్కడ అమెరికాను ఆర్థిక మాంద్యంలోకి నెట్టి తమ కొంప ముంచుతుందోనని భయపడుతున్నాయి. అదే జరిగితే కీలక మార్కెట్లయిన అమెరికా, యూరప్ దేశాలకు చెందిన రిటైల్, తయారీ కంపెనీల ఐటీ బడ్జెట్‌లు తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నాయి. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, లాభాల అంచనాలను ఈ కంపెనీలు మరింత కుదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిజానికి ట్రంప్ సుంకాలకు ముందు 2025-26లో పరిస్థితులు గాడిలో పడతాయని కంపెనీలు భావించాయి. అయితే ట్రంప్ సుంకాలతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. పరిస్థితులు చూస్తుంటే మరో మూడు నుంచి ఆరు నెలల వరకు ప్రతికూల వార్తలు తప్ప, సానుకూల వార్తలు పెద్దగా ఉండకపోవచ్చని ఐటీ కంపెనీలు భావిస్తున్నాయి. ఆర్థిక మాంద్యం వచ్చినా కంపెనీలకు కొన్ని ఐటీ సేవలు తప్పనిసరి. ఆ ప్రాజెక్టులతో పాటు ఖర్చులు తగ్గించి ఉత్పాదకత పెంచే ప్రాజెక్టులకూ పెద్దగా ఢోకా ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. ఏదేమైనా ఆర్థిక పరిస్థితులపై పూర్తి స్పష్టత వచ్చే వరకు అమెరికా కంపెనీలు ఐటీపై పెట్టే విచక్షణా పూర్వక ఖర్చులను పక్కన పెడతాయని బ్రోకరేజీ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఒక నివేదికలో తెలిపింది.



దిగొచ్చిన పసిడి

» ఒక్కరోజే రూ.1,550 తగ్గుదలతో రూ. 91,450కి పరిమితమైన తులం

» కిలో వెండి రూ.3,000 డౌన్

న్యూఢిల్లీ: పసిడి ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయిల నుంచి క్రమంగా దిగివస్తున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల రేటు సోమవారం రూ.1,550 తగ్గి రూ.91,450కి పరిమితమైంది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో తగ్గి రూ.91,000గా నమోదైంది. కిలో వెండి ఏకంగా రూ.3,000 తగ్గుదలతో రూ.92,500కు జారుకుంది. వెండి తగ్గడం వరుసగా ఇది ఐదో రోజు. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం. ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,027 డాలర్లు, సిల్వర్ 30 డాలర్లకు జారుకున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 8వ తేదీ



హైదరాబాద్	410	విజయవాడ	440
వరంగల్	412	గోదావరి	435
చిత్తూరు	480	విశాఖపట్నం	445
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	117
కరీంనగర్	100	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	87
కర్నూలు	100	నెల్లూరు	92
విశాఖపట్నం	109	అనంతపురం	92
గోదావరి	115		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,380 ▼	82,850 ▼	1,03,000 ▼
విజయవాడ	91,300 ▼	85,500 ▼	90,200 ▼
విశాఖపట్నం	88,470 ▼	81,100 ▼	89,880 ▲
రాజమండ్రి	90,380 ▼	82,850 ▼	95,200 ▼
ప్రొద్దుటూరు	90,300 ▼	83,080 ▼	92,000 ▲
ముంబై	89,085 ▼	81,602 ▼	90,392 ▼

వెంటాడుతున్న వ్యాధులు

రాష్ట్రంలో డయాబెటిస్ లేదా హైపర్ టెన్షన్ ఉన్నవారు దాదాపు 30 లక్షల మంది ఉన్నారు. రెండూ ఉన్నవారు 20 లక్షల మంది ఉన్నారు. ఒకప్పుడు చాలా అరుదుగా వచ్చే క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తోంది. ఇంకా గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎన్నెన్నో అనారోగ్య సమస్యలు. దీర్ఘకాలిక రోగాలతో లక్షలాది మంది ప్రజలు సతమతమవుతున్నారు. ప్రజల హెల్త్ ప్రొఫైల్‌పై ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేయించిన సర్వేలో ఈ విషయాలు వెలుగు చూశాయి. 18 ఏళ్ల వయసు దాటిన 2.15 కోట్ల మందికి (52.43 శాతం) స్ర్కీనింగ్ చేయించింది. వ్యాధులపై ముందే అప్రమత్తం కావడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన చికిత్స, నివారణ చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యం.



హైపర్ టెన్షన్

రాష్ట్రంలో 19.78 లక్షల మందికి హైపర్ టెన్షన్ ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. అంటే... 9.2 శాతం మందికి అన్నమాట. పురుషుల కన్నా మహిళలకే ఎక్కువగా ఉన్నట్టు తేలింది. 11,40,772 మంది మహిళలకు, 8,37,927 మంది పురుషులకు హైపర్ టెన్షన్ ఉంది. మరో 14.29 లక్షల మంది అండర్ ఫాలో అప్ కేటగిరిలో ఉన్నారు. జిల్లాల వారీగా చూస్తే కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల ప్రజలకు ఎక్కువగా ఉంది. సత్యసాయి, మన్యం, అల్లూరి జిల్లాల్లో అత్యల్పంగా కేసులు నమోదయ్యాయి.

డయాబెటిస్

11.13 లక్షల మందికి అంటే జనాభాలో 5.1 శాతం మందికి డయాబెటిస్ ఉన్నట్టు తేలింది. మహిళల కన్నా పురుషులకే ఎక్కువగా ఉంది. 5,61,196 మంది పురుషులకు, 5,52,767 మంది మహిళలకు డయాబెటిస్ నిర్ధారణ అయింది. మరో 8.76 లక్షల మంది అండర్ ఫాలో అప్ కేటగిరిలో ఉన్నారు. అంటే.. వీరంతా డయాబెటిస్ రిస్క్‌లో ఉన్నారని అర్థం. జిల్లాల వారీగా చూస్తే గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రజలకు డయాబెటిస్ ఎక్కువగా ఉంది. అల్లూరి సీతారామరాజు, మన్యం, శ్రీసత్యసాయి జిల్లాలో అత్యల్పంగా కేసులు నమోదయ్యాయి.

డయాబెటిస్-హైపర్ టెన్షన్

డయాబెటిస్, హైపర్ టెన్షన్ రెండూ 20.78 లక్షల మందికి అంటే.. 9.6 మందికి ఉన్నట్టు తేలింది. వారిలో పురుషుల కంటే మహిళల సంఖ్యే ఎక్కువగా ఉంది. 11,22,800 మంది మహిళలకు, 9,54,707 మంది పురుషులకు డయాబెటిస్, హైపర్ టెన్షన్ రెండూ ఉన్నాయి. అండర్ ఫాలో అప్ కేటగిరిలో మరో 12.80 లక్షల మంది ఉన్నారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఎక్కువగా, అల్లూరి సీతారామరాజు, మన్యం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తక్కువగా కేసులు నమోదయ్యాయి.

గుండె సంబంధిత వ్యాధులు

2,61,100 మంది గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నట్లు నిర్ధారించారు. వీరిలో పురుషులు 1,67,734 మంది, మహిళలు 99,366 మంది ఉన్నారు. ఎన్టీఆర్, నంద్యాల, గుంటూరు జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి సీతారామరాజు, మన్యం, అనకాపల్లి జిల్లాల్లో అత్యల్పంగా కేసులు నమోదయ్యాయి.

కాలేయ సమస్యలు

రాష్ట్రంలో 30,646 మంది కాలేయ సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 21,740 మంది పురుషులు, 8,906 మంది మహిళలు ఉన్నారు. నెల్లూరు, తిరుపతి, కర్నూలు జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, శ్రీసత్యసాయి, మన్యం జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు.

క్యాన్సర్

నేడు సమాజాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో క్యాన్సర్ ప్రధానమైనది. భవిష్యత్తులో బాధితుల సంఖ్య 20 నుంచి 30 శాతం ఉంటుందని డబ్ల్యూహెచ్ఓ అంచనా వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 1,19,397 మంది క్యాన్సర్ రోగులున్నట్లు తేలింది. కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, మన్యం, సత్యసాయి జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు.

శ్వాస సంబంధిత సమస్యలు

రాష్ట్రంలో 54,362 మంది శ్వాస సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వారిలో 35,088 మంది పురుషులు, 19,274 మంది మహిళలున్నారు. నెల్లూరు, విజయనగరం, తిరుపతి జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, పశ్చిమ గోదావరి, బాపట్ల జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు.

నరాల సంబంధిత వ్యాధులు

రాష్ట్రంలో 1,07,433 మంది నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 63,698 మంది పురుషులు, 43,735 మంది మహిళలు ఉన్నారు. విజయనగరం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, శ్రీసత్యసాయి, మన్యం జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు.

కిడ్నీ సమస్యలు

రాష్ట్రంలో 1,73,479 మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. వారిలో 1,22,672 మంది పురుషులు, 50,807 మంది మహిళలు ఉన్నారు. శ్రీకాకుళం, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ప్రభుత్వం 'ఆరోగ్య ఆంధ్ర'కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ దిశగా మరో కీలక అడుగు వేసింది. ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న వ్యాధులను గుర్తించి, ప్రబలడానికి గల కారణాలపై ప్రత్యేక సర్వే నిర్వహించింది. డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు గుండె, కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి రోగాల కేసులపై ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా పరిశోధన నిర్వహించింది. 18 ఏళ్ల వయసు దాటిన 2.15 కోట్ల మందికి (52.43 శాతం) స్ర్కీనింగ్ చేయించింది. సోమవారం సీఎం చంద్రబాబు వివరాలను వెల్లడించారు. భారీ స్థాయిలో అనారోగ్య సమస్యలు పెరగడానికి జీవన విధానంలో మార్పులే కారణమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు ఉన్న జిల్లాల్లో బాధితుల సంఖ్య అధికంగా ఉంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి జిల్లాల్లో ఆరోగ్య శాఖ చేపట్టిన సర్వేలో ఎక్కువ శాతం కేసులు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలో ప్రతి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని పరిశోధన చేశారు. 10 రకాల వ్యాధులపై అధ్యయనం చేశారు. వ్యాధుల నిర్ధారణకు స్ర్కీనింగ్ చేయగా కొన్ని జిల్లాల్లో కొన్ని వ్యాధులు ఎక్కువ ప్రభావం చూపిస్తున్నాయి.

డేంజర్ బెల్స్

- హైపర్ టెన్షన్, హార్ట్ స్ట్రోక్, గుండె సంబంధిత వ్యాధుల విషయంలో తూర్పుగోదావరి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.
- జీవన విధానం వల్ల వ్యాప్తి చెందే వ్యాధులు ఎక్కువగా కృష్ణా, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో నమోదవుతున్నాయి.
- వాయుకాలుష్యం, స్మోకింగ్ వంటి కారణాల వల్ల ఆస్తమా, నిమోనియా, సీవోడీపీ కేసులు ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అధికంగా నమోదవుతున్నాయి.
- టీబీ, డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు శ్రీకాకుళం, విజయనగరం, కడప జిల్లాలో ఎక్కువగా నమోదవుతున్నట్టు గుర్తించారు.
- హైపర్ టెన్షన్, డయాబెటిస్, తాగునీటి కాలుష్యంతో అనారోగ్యం బారినపడుతున్నవారు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు.
- పొగాకు ఇతర అలవాట్ల కారణంగా సర్వైకల్, బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్ రోగులు గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాలో ఎక్కువగా ఉన్నారు.
- ఆల్కహాల్ తీసుకోవడం వల్ల డిప్రెషన్, యాంగ్జయిటీ కేసులు విశాఖపట్నం, విజయవాడ, కడప జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి.
- వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా కేసులు అల్లూరి, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కువగా నమోదవుతున్నాయి.

జూన్ నాటికి స్ర్కీనింగ్

ఈ ఏడాది జూన్ నాటికి రాష్ట్రంలో ప్రజలందరికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆహారపు అలవాట్లు, జీవన విధానం మార్చుకోవడం ద్వారా రోగాల బారినపడే అవకాశాన్ని చాలా వరకూ తగ్గించుకోవచ్చని చెప్పడమే ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై మరింత అధ్యయనం, పరిశీలన, పరిశోధన అవసరం ఉంది.

నియోజకవర్గానికో మల్టీ స్పెషాలిటీ

ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం 100 నుంచి 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎం చంద్రబాబు ఈ మేరకు ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే దాదాపు 70 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులున్నాయి. మరో 105 నియోజకవర్గాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేయాలి. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం.

రాష్ట్రంలో 18 ఏళ్లు దాటిన 2.15 కోట్ల మందికి స్ర్కీనింగ్ వారిలో వివిధ రోగాల బారినపడ్డ వారు

హైపర్ టెన్షన్



జనాభాలో 9.2శాతం
మహిళలు 11,40,772
పురుషులు 8,37,927
మొత్తం 19.78 లక్షల మంది
అండర్ ఫాలో అప్ కేటగిరిలో మరో 14.29 లక్షల మంది

డయాబెటిస్




జనాభాలో 5.1శాతం
పురుషులు 5,61,196
మహిళలు 5,52,767
మొత్తం 11.13లక్షల మంది
అండర్ ఫాలో అప్ కేటగిరిలో మరో 8.76 లక్షల మంది

డయాబెటిస్-హైపర్ టెన్షన్



జనాభాలో 9.6శాతం
మహిళలు 11,22,800
పురుషులు 9,54,707
మొత్తం 20.78లక్షల మంది
అండర్ ఫాలో అప్ కేటగిరిలో మరో 12.80 లక్షల మంది

గుండె సంబంధిత వ్యాధులు




పురుషులు 1,67,734
మహిళలు 99,366
మొత్తం 2,61,100

క్యాన్సర్



పురుషులు 46,872
మహిళలు 72,525
మొత్తం 1,19,397

కిడ్నీ సమస్యలు



పురుషులు 1,22,672
మహిళలు 50,807
మొత్తం 1,73,479



ఆరోగ్యాంధ్రే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

హ్యాపీ ఏపీ సాధనకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 80 శాతం మంది ప్రధానంగా 10 రకాల వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. "కేంద్రం దేశంలో 25 మెడిసిటీలను పెట్టాలనే యోచనలో ఉంది. ఖతార్ ప్రభుత్వ సహకారంతో అమరావతిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో మెగా గ్లోబల్ మెడిసిటీ ఏర్పాటుపై కేంద్రాన్ని సంప్రదించగా సుముఖత వ్యక్తం చేసింది. ఈ మెడిసిటీ కోసం 200 ఎకరాలు కేటాయించి.. అందులో 100 ఎకరాలు హెల్త్‌కేర్ సేవలకు, 40 ఎకరాలు నివాసాలకు, 20 ఎకరాలు వాణిజ్య అవసరాలకు, 20 ఎకరాలు సర్వీస్ జోన్‌కు వినియోగించుకునేలా విధానాలు రూపొందించాం. హెల్త్ టూరిజానికీ ఇది ఉపయోగపడుతుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం 175 నియోజకవర్గాలకు 70 చోట్ల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. మిగతా 105 నియోజకవర్గాల్లో పీపీపీ విధానంలో నిర్మిస్తామని, అవసరమైతే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) అందిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ కేసుల్లో 50 శాతం వీటికే రిఫర్ చేసి నిలబడేలా చూస్తామని, వీటి నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయిస్తామని వివరించారు. "ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ల జారీలో ఏపీ ముందంజలో ఉంది. రాష్ట్ర జనాభాలో 88% మందికి హెల్త్ అకౌంట్లు రూపొందించాం. వర్చువల్ ఆస్పత్రులను రాష్ట్రవ్యాప్తంగా తీసుకురావాలన్న లక్ష్యంతో కుప్పం నియోజకవర్గంలోని 5 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా డిజిటల్ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు. జూన్ 15న దీనిని ప్రారంభిస్తామన్నారు. "26 నెలల్లో ఈ వర్చువల్ ఆస్పత్రులను పూర్తి చేస్తాం. ప్రతి ఒక్కరి హెల్త్ రికార్డులను డిజిటల్ లాకర్‌లో పెడతాం. మొబైల్ వైద్య వాహనాల ద్వారా ఇంటి వద్దే పరీక్షలు చేయిస్తాం. డాక్టర్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సేవలందిస్తారు" అని వివరించారు. "ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు టాటా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ముందుకెళ్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున న్యూట్రిఫుల్ యాప్‌ను డెవలప్ చేశారు. ప్రస్తుతం 4 లక్షల మంది దీనిని అనుసరిస్తున్నారు" అన్నారు.

సీఎం చెప్పిన ఆరోగ్య సూత్రాలు

పాఠశాల విద్య నుంచే ఆహారపు అలవాట్లు.. ఆరోగ్యం అంశాన్ని కూడా ఒక సబ్జెక్టుగా పెట్టాలన్న ఆలోచన ఉందని చంద్రబాబు చెప్పారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం, ప్రాణాయామం చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. 'నలుగురు ఉన్న కుటుంబంలో వంటనూనె నెలకు 2 లీటర్లు, చక్కెర 3 కేజీల కన్నా ఎక్కువ వినియోగించకుండా చూసుకోవాలి. ఉప్పు వినియోగం తగ్గిస్తే 40 శాతం మేర గుండెపోట్లు తగ్గుతాయి' అని తెలిపారు. రోజూ అరగంట నడవడం, దైవ చింతనలో గడపడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందన్నారు. పొగాకు, డ్రగ్స్, ఆల్కహాల్‌ను దూరం పెడితే కేన్సర్, లివర్, కిడ్నీ సమస్యలు తగ్గుతాయని చెప్పారు. జంక్ ఫుడ్, పాలిష్డ్ బియ్యం తినడం తగ్గించి మిల్లెట్స్, ముడి బియ్యం, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు.

వైద్యసేవలు మెరుగు

గత మూడు నెలల్లో ప్రభుత్వాసుపత్రుల పట్ల పలు అంశాల్లో ప్రజల్లో సానుకూలత మరింత పెరిగింది. అయితే పరిశుభ్రతపై పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించిన ఆర్టీజీఎస్ ఆ వివరాలను సోమవారం విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి 27, ఫిబ్రవరి 7, మార్చి 5న, తాజాగా సోమవారం సీఎం చంద్రబాబు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. తాజా సర్వేలో ప్రజాభిప్రాయం 78.13 శాతానికి పెరిగిందని ఆర్టీజీఎస్ వెల్లడించింది. డాక్టర్ రాసిన మందులు ఇచ్చే అంశంపై సానుకూలత 18.65శాతం పెరిగిందని పేర్కొంది. సెకండరీ ఆసుపత్రులకు సంబంధించి కూడా వైద్యసేవలపై ప్రజల్లో సానుకూలత పెరిగిందని ఆర్టీజీఎస్ వెల్లడించింది.



లావైపోతున్నారు

82 శాతం మందికి ఊబకాయం

- 24% మందికి హైబీపీ.. 23% మందికి మధుమేహం
- 81% మందిలో విటమిన్ డీ లోపం
- 66% మందికి ఫ్యాటీ లివర్
- 77% మహిళల్లో పోషకాహార లోపం
- ఏపీ, తెలంగాణలో ఇదే పరిస్థితి
- అపోలో హెల్త్ ఆఫ్ ద నేషన్ నివేదిక

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఊబకాయం సమస్య విపరీతంగా ఉందని అపోలో హెల్త్ ఆఫ్ ద నేషన్-2025 నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా 25 లక్షల మందిని పరీక్షించిన తర్వాత ఈ నివేదికను విడుదల చేసింది. విద్యార్థుల నుంచి పెద్దల వరకు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు వివరించింది. ఏపీ, తెలంగాణలో 82 శాతం మంది ఊబకాయం లేదా అధిక బరువు కలిగి ఉన్నారు. పిల్లలు, కళాశాల విద్యార్థుల్లో 28 శాతం మంది అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నారు. 24 శాతం మందికి హైబీపీ ఉంది. 19 శాతం మంది ప్రీ హైపర్‌టెన్సివ్‌గా ఉన్నారు. 23 శాతం మందికి మధుమేహం ఉంది. 81 శాతం మంది విటమిన్ డీ లోపంతో బాధపడుతున్నారు. దాదాపు ప్రతి ఇద్దరిలో ఒకరిలో గ్రేడ్ 1 ఫ్యాటీ లివర్ సంకేతాలు ఉన్నాయి. లక్షలాది మందిలో ఎలాంటి లక్షణాలు కనిపించనప్పటికీ దీర్ఘకాలిక అనారోగ్య స్థితిలో ఉంటున్నారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 66 శాతం మంది ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారు. ఇందులో 85 శాతం మంది ఆల్కహాల్ తీసుకోని వారే. 77 శాతం మహిళల్లో పోషకాహార లోపం ఉంది. 53,000 మందిని పరీక్షించగా అబ్‌స్ట్రక్టివ్ స్లీప్‌ఆప్నియా ప్రమాదం ఎక్కువగా ఉందని నివేదికలో వెల్లడించారు.

గ్రామీణ బ్యాంకులు విలీనం

- మే 1 నుంచి 'ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్'

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సప్తగిరి, ఆంధ్ర ప్రగతి, చైతన్య గోదావరి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ పేర్లతో వేర్వేరుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న గ్రామీణ బ్యాంకులను విలీనం చేశారు. ఇవన్నీ ఇకపై... 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్' పేరుతో పని చేస్తాయి. ఇది అమరావతి ప్రధాన కార్యాలయంగా.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పని చేస్తుంది. మే 1 నుంచే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ పేరుతో లావాదేవీలను నిర్వహిస్తారు.

ఆక్వా సంక్షోభంపై కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి భాగస్వామ్యపక్షాలతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుత సమస్యకు పరిష్కారం చూపి, భవిష్యత్ ప్రణాళిక రూపొందించేందుకు ఈ కమిటీ సూచనలు చేస్తుందన్నారు. ఆక్వా రైతులు, నిపుణులు, అధికారులు, ఎంపెడా ప్రతినిధులు, ఎగుమతిదారులతో కమిటీ సమావేశమై సమస్య పరిష్కారానికి సూచనలు, భవిష్యత్ ప్రణాళికపై సలహాలు ఇస్తుందని తెలిపారు.



పశ్చిమగోదావరి జిల్లా పూలపల్లి వైజంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న ఆక్వా రైతులు

> ఆక్వా రంగానికి అనూహ్య సమస్య వచ్చింది. దీనికి భయపడిపోకుండా, అంతా కలిసి పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. సమన్వయంతో పనిచేస్తేనే ఆక్వా రంగం ముందుకు సాగుతుంది.
> - సీఎం చంద్రబాబు

సాగుకు ఫ్రెష్ వాటర్.. రూ.220 ధర

ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ఆక్వా రంగాన్ని కొత్త సుంకాలు మరింత సంక్షోభంలోకి తీసుకెళతాయని రైతులు, ఎగుమతిదారులు తెలిపారు. ఈక్విడార్ వంటి దేశాలు అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. అమెరికాతో సత్వర సంప్రదింపులు జరిపేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడనున్నారు. ఆక్వాకు ఫ్రెష్ వాటర్ ఇవ్వడం వల్ల వైరస్, వ్యాధులు తగ్గి పంట నాణ్యత మెరుగుపడుతుందని రైతులు చెప్పగా.. దీనికి సీఎం అంగీకారం తెలిపారు. ధర తగ్గకుండా చూడాలని రైతులు కోరగా, 100 కౌంట్ రొయ్యలను 220 ధరకు కొనుగోలు చేయాలని వ్యాపారులకు నిర్దేశించారు. సౌత్ కొరియా, ఈయూ దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకుంటే సత్ఫలితాలు ఉంటాయని ఎగుమతిదారులు చెప్పగా.. దీనిపై కేంద్రంతో మాట్లాడతామని సీఎం చెప్పారు. ఇప్పటికే లేఖ ద్వారా కేంద్రం దృష్టికి తెచ్చామని, సంప్రదింపులు జరుపుతామని అన్నారు.

కమిటీ నిర్ణయం మేరకే క్రాప్ హాలీడే

అమరావతి సచివాలయంలో ఆక్వా రంగ సమస్యలపై సీఎం సమీక్ష అనంతరం ఆక్వా రంగ ప్రముఖులు మీడియాతో మాట్లాడారు. ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సంక్షోభం నుంచి ఎలా బయటపడాలనే దానిపై కమిటీ అధ్యయనం చేసి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని చెప్పారు. క్రాప్ హాలీడే ప్రకటించే విషయాన్ని కూడా కమిటీ చర్చిస్తుందని ఆక్వా రైతు ప్రతినిధి కుమార్‌రాజా చెప్పారు. కొద్దిరోజులు సంయమనం పాటించి సమయానికి అనుగుణంగా ఆక్వా పంట తీయాలని (హార్వెస్టింగ్) సీఎం సూచించినట్లు ఎగుమతిదారు ఆనంద్ తెలిపారు.

సిండికేట్ దోపిడీకి చెక్ పెడతాం

ట్రంప్ సుంకాల పేరుతో ధర తగ్గించేశారు

జూలై నుంచి క్రాప్ హాలిడే పాటిస్తాం: ఆక్వా రైతులు

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రొయ్య పిల్లలు విక్రయించే హేచరీల నుంచి, మేత కంపెనీలు, కొనుగోలుదారులు.. అంతా సిండికేట్ అయి ఆక్వా రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆక్వా రైతులు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పూలపల్లిలో సోమవారం ఆక్వా రైతుల మహాసభ జరిగింది. అనంతరం పూలపల్లి వైజంక్షన్‌లో రైతులంతా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, పలువురు రైతులు మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాన్ని ఆసరాగా తీసుకొని కొనుగోలు కేంద్రాలు రొయ్యల ధరను అడ్డగోలుగా తగ్గించేశాయని మండిపడ్డారు. అమెరికాలో 50-40 కౌంటు రొయ్యలకు మాత్రమే సుంకం విధిస్తే ఇక్కడ వేరే దేశాలకు వెళ్లే 100 కౌంటు రొయ్యలకు కూడా ధర తగ్గించి కొంటున్నారని వాపోయారు. కేంద్రం రా మెటీరియల్ ధరలు తగ్గించినా కంపెనీలు మాత్రం ధరలు తగ్గించలేదన్నారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లో జూలై నుంచి మూడు నెలలపాటు క్రాప్ హాలిడే పాటించాలని, సిండికేట్ దోపిడీకి చెక్ పెట్టేలా ఉద్యమించాలని తీర్మానించారు.

సుంకాల భారాన్ని అధిగమిద్దాం

దేశీయంగా వినియోగం పెంచుదాం

- నేషనల్ ప్రాన్ కోఆర్డినేషన్ కమిటీతో ఆక్వారంగ అభివృద్ధి: అచ్చెన్న
- రొయ్యను ప్రమోట్ చేసుకుందాం: రఘురామ

విజయవాడ లబ్బీపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాల పెంపుతో ఆక్వా పరిశ్రమపై పడిన ఆర్థిక ప్రభావాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. విజయవాడలో సోమవారం మత్స్యశాఖ అధికారులు, ఆక్వా రంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ఆక్వా రైతులతో మంత్రి అచ్చెన్నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ ఇది రెండు దేశాలు కలిసి తీసుకోవలసిన నిర్ణయం కావడంతో పరిష్కారానికి కొంత సమయం పడుతుందన్నారు. రొయ్యల ఎగుమతిపై ఆధారపడకుండా దేశంలోనే వినియోగించుకోవడం ముఖ్యమని చెప్పారు. క్రాప్ హాలిడేపై వస్తున్నవన్నీ ఊహాగానాలేనని, దానికి అవకాశం లేదన్నారు. పట్టుబడికి వచ్చిన రొయ్యలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ సుంకాల భారంపై ఆందోళన వద్దని చెప్పారు. దేశీయ మార్కెట్లలో ఏవిధంగా అభివృద్ధి చెందాలనే అంశంపై చర్చించి, సూచనలు చేసేందుకు నేషనల్ ప్రాన్ కోఆర్డినేషన్ కమిటీ(ఎన్‌సీపీపీ) అనే సంస్థను ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ సంస్థ ద్వారా రొయ్యల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మన రొయ్యను మనమే ప్రమోట్ చేసుకుంటే ఆర్థికంగా ఈ రంగం ఎదుగుతుందన్నారు. ఆక్వా రంగాన్ని దేశీయంగా అభివృద్ధి చేసుకోడంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. ముఖ్యంగా ఆర్మీ మెనూలో రొయ్యను చేరిస్తే వినియోగం పెరుగుతుందన్నారు. దీనిని కేంద్ర రక్షణ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ కలెక్టర్ మృతి



» అన్నమయ్య జిల్లా సంబేపల్లె వద్ద రోడ్డు ప్రమాదం.. అతివేగమే కారణమంటున్న పోలీసులు

సంబేపల్లె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సంబేపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుగాలి రమ (56) మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. సుగాలి రమ అన్నమయ్య జిల్లా పీలేరులో హంద్రీనీవా సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆమె కారులో బయలుదేరారు. ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలోకి రాగానే రాయచోటి నుంచి చెన్నై వెళుతున్న కారు.. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమ అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె కారు డ్రైవర్ ముబారక్, అటెండర్ జీరూనాయక్ మరో కారు డ్రైవర్ మణికంఠ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, ఆర్డీవో, రూరల్ సీఐ, ట్రాఫిక్ సీఐ, తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రితో రమ మృతదేహానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నివాళులు అర్పించారు. అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కాగా.. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ది అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఆమె భర్త రాజేంద్ర నాయక్ ఎస్‌ఐగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు.

కియ కార్ల పరిశ్రమలో చోరీ.. 900 ఇంజిన్లు మాయం



» పోలీసులకు ఫిర్యాదు.. దర్యాప్తు చేస్తున్న సిట్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్ల తయారీ పరిశ్రమ కియలో దొంగలు పడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం యర్రమంచి పంచాయతీ పరిధిలో ఉన్న ఈ పరిశ్రమ నుంచి సుమారు 900 కార్ల ఇంజిన్‌లు మాయమయ్యాయి. కియతోపాటు ఈ ప్రాంతంలో 25 అనుబంధ పరిశ్రమలు ఉన్నాయి. ప్రధాన పరిశ్రమలో రోజుకు 450 కార్ల ఉత్పత్తి జరుగుతుంది. వీటికి అవసరమైన పరికరాలు అనుబంధ పరిశ్రమల నుంచి వస్తుంటాయి. ఈ క్రమంలో దాదాపు 900 ఇంజిన్లు మాయమైనట్లు యాజమాన్యం గుర్తించింది. మార్చి నెలలో ఎస్పీ రత్న కియ పరిశ్రమను సందర్శించారు. ఆ సమయంలోనే ఇంజిన్‌ల మాయం గురించి కియ సీఈఓ, ఎండీ గ్యాంగులీ ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి, విచారించాలని కోరినట్లు సమాచారం. కానీ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పడంతో మార్చి 19న కియ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) దర్యాప్తు చేస్తోంది. దీని వెనుక గతంలో కియలో పనిచేసి వెళ్లిన ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కియ పరిశ్రమకు కంటైనర్ల ద్వారా కార్ల ఇంజిన్లు వస్తుంటాయి. ఈ క్రమంలో మార్గ మధ్యంలో చోరీ జరిగిందా లేక మరెక్కడైనా జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీకి పచ్చకామెర్ల రోగం తగ్గలేదు

» ప్రజలు చెప్పుతో కొట్టినట్లు తీర్పిచ్చినా నీచపు చేష్టలు మారలేదు: షర్మిల



అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి, ఆ పార్టీని మోసే సంస్థలకు ఇంకా పచ్చకామెర్ల రోగం తగ్గినట్టు లేదు. కళ్లకు కమ్మిన పసుపు పొర్లు తొలగినట్లు లేదు. ఇప్పటికీ అద్దంలో మొహం చూసుకున్నా చంద్రబాబే కనిపించడం బాధాకరం' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. సోమవారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఏది చేసినా అర్థం, పరమార్థం టీడీపీ అనడం వారి వెర్రితనానికి నిదర్శనం. రాష్ట్రంలో కాంగ్రెస్ స్వయం శక్తితో ఎదుగుతుంటే చూసి ఓర్వలేక అసత్యపు ఆరోపణలతో నిందలు వేయడం మీ చేతకానితనానికి నిదర్శనం. 11 స్థానాలకే పరిమితం చేసి ప్రజలు చెప్పుతో కొట్టినట్లు తీర్పునిచ్చినా మీ నీచపు చేష్టలు మారలేదు. మీరు ఈ జన్మకు మారరని రాష్ట్ర ప్రజలకు అర్థమైంది. కులమతాల మధ్య చిచ్చు పెట్టే ప్రతి అంశంలో మోదీకి మద్దతుగా నిలిచి ఐదేళ్లపాటు మోదానీ సేవలో తరించినట్లు ప్రజలకు సర్వం బోధపడింది. స్వలాభమే పరమావధిగా రాష్ట్రాన్ని దోచుకున్న జగన్.. ప్యాలెస్‌లు కట్టుకొన్నారు, ఖజానాను నింపుకొన్నారు' అంటూ షర్మిల మండిపడ్డారు. 'ఎవరో ఒకరి సేవలో తరించాల్సిన ఖర్మ రాజశేఖర్‌రెడ్డి బిడ్డ షర్మిలారెడ్డికి పట్టలేదు. పులి బిడ్డ పులి బిడ్డే. ఈ రాష్ట్రంలో బీజేపీ అంటే... బాబు, జగన్, పవన్. ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే అసెంబ్లీకి పోవడానికి మీకు దమ్ము లేకుంటే.. ప్రజా సమస్యల మీద గొంతెత్తి పోరాడుతున్నది కాంగ్రెస్ మాత్రమే' అని పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లు, పోలవరం తదితర అంశాలపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు, విమర్శలు కనపడక పోవడానికి వైసీపీ వాళ్లు చెవిటోళ్లు, గుడ్డోళ్లు కావడమే కారణం అంటూ ఎద్దేవా చేశారు. నీచపు కుయుక్తులతో కాంగ్రెస్‌ను ఖాళీచేయాలన్న కుట్రలు తప్ప.. ప్రజాసమస్యలపై వైసీపీకి శ్రద్ధ లేదు' అని మండిపడ్డారు.

ఏపీకి 750 ఎలక్ట్రిక్ బస్సులు

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీకి కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. 'పీఎం ఈ-బస్ సేవ' కింద మొదటి దశలో 750 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేసింది. రాష్ట్రంలోని 11 నగరాల్లో తిప్పేందుకు 9 మీటర్లు, 12 మీటర్ల పొడవు ఉండే బస్సులను పంపుతోంది. కేంద్రం పీపీపీ పద్ధతిలో ఈ ఏడాదికి 10 వేల బస్సులను పలు రాష్ట్రాలకు ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు 1,050 బస్సులు కేటాయించాలని ఆర్టీసీ గత సెప్టెంబరులో కేంద్రాన్ని కోరింది. అయితే మొదటి విడత టెండర్లలో పూణేకు చెందిన పిన్నాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ బస్సుల కాంట్రాక్టు దక్కించుకుంది. ఏపీలో విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, మంగళగిరి, కడపలో 750 బస్సులు త్వరలో ప్రవేశపెడుతోంది. ఏ డిపోకు బస్సులు కేటాయిస్తున్నారో వాటిల్లో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై చర్చించి కీలక నిర్ణయం తీసుకోవడానికి ఆర్టీసీ ఎండీ, ఈడీలు మంగళవారం సమావేశమవుతున్నారు.

అడవి తల్లికి 'బాటలు'!

(మొదటి పేజీ తరువాయి)

గిరిజన ప్రజలు పడుతున్న ఇబ్బందులను 2018లో పాడేరు, అరకులోయ ప్రాంతాల పర్యటనలో గమనించాను. వారి కష్టాలను తీర్చే శక్తి ఇవ్వాలని ఈనాడు దేవుడిని కోరుకున్నాను. ఇప్పటికి ఆ అవకాశం దక్కింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే గిరిజన ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి రూ.49 కోట్లు అడిగితే 24 గంటల్లోనే సీఎం చంద్రబాబు మంజూరు చేశారు. వాటితో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని రెండు గ్రామాలకు పక్కా తారురోడ్లు వేశారు. ఆదాయం, రాజకీయ ప్రయోజనాలు వంటివి ఆశించకుండా గిరిజన బిడ్డలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోంది." అని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ ప్రాంతంలో తమకు ఓట్లు వేయకపోయినా.. గిరిజనుల కోసం రోడ్లు వేస్తున్నామని వ్యాఖ్యానించారు. పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలను ఉద్దేశించి ఆయనీ వ్యాఖ్యలు చేశారు. "అరకులోయ (వైసీపీ) ఎంపీ, ఎమ్మెల్యేలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాం. రాజకీయంగా భిన్నమైన భావాలుంటాయి. అంతమాత్రాన ఎవరూ శత్రువులు కాదు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సమష్టిగా పనిచేయాలి" అని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో కేవలం 92 కిలోమీటర్ల రోడ్డు వేయగా, కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే రూ.1,500 కోట్లతో 1,069 కిమీ రహదారులు నిర్మించిందన్నారు. వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని, తాము వచ్చాక 13,326 గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరుచేశామని వివరించారు. ఈ ఏడాది 1,077 గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, మిగిలిన గ్రామాలకు కూడా రానున్న రోజుల్లో రోడ్లు వేస్తామని తెలిపారు. కూటమి 15 ఏళ్లు పాలిస్తేనే రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అన్నివిధాలా చితికిపోయిన రాష్ట్రాన్ని ఆర్థికంగా సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మన్యంలో (పాడేరు, అరకునియోజకవర్గాలు) కూటమి జెండా ఎగురవేయాలని కోరారు.



అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం పెదపాడులో గర్భిణులను ఆశీర్వదించి పోషకాహారం కిట్ అందజేస్తున్న పవన్‌కల్యాణ్



అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం పెదపాడులో గిరిజనులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సెల్ఫీ



అడవి తల్లి బాట కార్యక్రమంలో రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అడవి బిడ్డలతో పవన్ మమేకం

అల్లూరి జిల్లా పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ విశాఖపట్నం నుంచి నేరుగా చాపరాయి ప్రాంతానికి చేరుకున్నారు. చాపరాయి గెడ్డ మీదుగా సుమారు కిలోమీటరు రోడ్డుమార్గంలో కలినడకన పెదపాడు చేరుకున్నారు. స్థానిక గిరిజనులు థింసా నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామానికి తీసుకువెళ్లారు. పూలమాల వేసి, తిలకం దిద్ది గిరిజన మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన సీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. పోషకాహార కిట్లు అందజేశారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకయ్యారు. గిరిజనులు మాట్లాడే కోంద, కువిల భాషల గురించి అడిగి తెలుసుకున్నారు. కువి భాషలోని పదాలను తెలుగులో రాయించుకుని సరదాగా సంభాషించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటి, విత్తనాల ప్రదర్శనను తిలకించారు. ఒక వృద్ధురాలు అందించిన అడ్డాకులతో తయారుచేసిన టోపీని పవన్‌కల్యాణ్ ధరించారు.

ట్రాఫిక్‌తో పరీక్ష రాయలేకపోయాం: విద్యార్థులు

పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా పోలీసులు విధించిన ఆంక్షలతో జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాయలేకపోయామని విశాఖజిల్లా పెందుర్తికి చెందిన 23 మంది విద్యార్థులు తెలిపారు. పవన్ కాన్వాయ్ రోడ్డుమార్గంలో పెందుర్తిమీదుగా వెళ్లింది. ఆ మార్గంలోనే తమ పరీక్షా కేంద్రం ఉండటంతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయామని, రెండు నిమిషాలు ఆలస్యంగా వెళ్లిన తమను నిర్వాహకులు పరీక్ష రాయనీయలేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న పవన్‌కల్యాణ్, వాస్తవం ఏవిటనేది విచారణ జరపాలని ఆదేశించారు. అయితే, ట్రాఫిక్ ఆంక్షల కారణంగా జేఈఈ మెయిన్స్ రాయాల్సిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదని వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజ్ తెలిపారు.

వెయ్యి కోట్లతో అడవితల్లి బాట

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో 'అడవి తల్లి'కి బాటలు పడుతున్నాయి. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు వేసే పరిస్థితి ఉండేది కాదు. ఏజెన్సీ ప్రాంతాల్లో నడక దారులు తప్ప వేరే గత్యంతరం లేకపోయేది. కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల నక్సల్ బెడద తగ్గినప్పటికీ, గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసింది. దీంతో ప్రతి రోజూ ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీమోతలు వార్తల్లోకెక్కుతూ ఉండేవి. కేంద్రం పీఎం-జన్మాన్ కింద మంజూరుచేసిన రూ.555 కోట్లను గత వైసీపీ సర్కారు పెద్దగా వినియోగించుకోలేకపోయింది. ఈ పథకం కింద రూ.80 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత ఏజెన్సీలో రహదారుల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. పీఎం-జన్మాన్ నిధులతో రూ.555 కోట్ల పనులు ప్రారంభమయ్యాయి. డోలీ మోతలున్న పర్టికులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్(పీవీటీజీ) ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి. దీంతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.400 కోట్లు సమకూర్చగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.50 కోట్లు మంజూరు చేసింది. వెరసి మొత్తం ఏజెన్సీ ప్రాంతంలో రూ.1000 కోట్లతో 'అడవి తల్లికి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

మరింతగా సుపరిపాలన

» పది మంది నిష్ణాతులతో సలహామండలి

» జూన్ 12కల్లా వాట్సాప్‌లోనే అన్ని డిజిటల్ సేవలు: సీఎం



సీఎంతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, అర్థ గణాంక శాఖ డైరెక్టర్ గోపాల్, ఇతర ఉన్నతాధికారులు

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరింతగా సుపరిపాలన అందించేందుకు సలహా మండలిని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇందులో సభ్యులుగా బిల్‌గేట్స్ ఫౌండేషన్, మద్రాస్ ఐఐటీ, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన 10 మంది నిపుణులు ఉంటారని వెల్లడించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మరింత మేలు చేసేలా సుపరిపాలన అందించేందుకు ఇంకా చేపట్టాల్సిన అంశాలపై సలహా మండలి అధ్యయనం చేసి సలహాలు, సూచనలు ఇస్తుందని చంద్రబాబు తెలిపారు. ప్రజలకు ఎలాంటి సేవలు కావాలన్నా ఆన్‌లైన్, డిజిటల్, మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్‌ను వినియోగించుకుని సేవలు పొందవచ్చని చెప్పారు. జూన్ 12కల్లా ప్రభుత్వం డిజిటల్ రూపంలో అందించగలిగే సేవలన్నింటినీ వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. దీనికి అనుగుణంగా ఆర్టీజీఎస్‌లో డేటాను అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం 254 ప్రభుత్వ సేవలను మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్‌లో అందిస్తున్నామని, వాటిని 1000కి పైగా పెంచాలని ఆదేశించారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. ఆర్థిక వృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలవడంతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను, అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. సచివాలయంలో సోమవారం తనను కలిసిన ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, అర్థ గణాంక శాఖ డైరెక్టర్ గోపాల్, ఆ శాఖల ఉన్నతాధికారులను అభినందించారు. వారికి అరకు కాఫీ గిఫ్ట్‌ప్యాక్‌లు అందించారు.

2047 నాటికి రూ. 347 లక్షల కోట్ల జీఎస్‌డీపీ

వృద్ధిరేటు రెండింతలు పెరిగితే రాష్ట్ర ఆదాయం నాలుగున్నర రెట్లు పెరుగుతుందని చంద్రబాబు తెలిపారు. వైసీపీ హయాంలో అస్తవ్యస్త పాలన, తుగ్లక్ నిర్ణయాల వల్ల జీఎస్‌డీపీ రూ.7 లక్షల కోట్లు వెనుకబడిందన్నారు. ఆమేర పెరిగితే అదనంగా రూ. 76,195 కోట్లు వచ్చేవని, అప్పులు తగ్గేవని చెప్పారు. 2047నాటికి జీఎస్‌డీపీని రూ. 347 లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ. 58,14,916కు పెంచడమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నామని చెప్పారు.

మినికాయ్ ద్వీపం నుంచి ఢిల్లీకి ఎగిరొచ్చిన అమీనా

» మంత్రి రామ్మోహన్ చొరవతో ప్రధానితో భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆమె పేరు అమీనా మనీకా. టూరిజం, ట్రావెల్ మేనేజిమెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. రైల్ టెల్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని లక్షద్వీప్‌లోని మినికాయ్ ద్వీపంలో హైస్పీడ్ ఫైబర్ టు హోమ్ ఇంటర్నెట్ సర్వీసులను ఇంటింటికీ అందించారు. ఇందుకు కొచ్చి-లక్షద్వీప్‌లోని సబ్‌మెరైన్ కేబుల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకున్నారు. ప్రధాని మోదీ ముద్రా యోజన పథకం ద్వారా అందించిన ఆర్థిక సహాయంతోనే ఇదంతా చేయగలిగారు. ఈ ఘనత సాధించిన అమీనాను సత్కరించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ పథకాన్ని ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా సోమవారం ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా 3రోజుల కిందటే ఆమెకు ఆహ్వానం అందింది. అయితే మినికాయ్ నుంచి ఢిల్లీకి విమాన సర్వీసు లేదు. డిప్యూటీ కలెక్టర్ కూడా నిస్సహాయత వ్యక్తం చేయడంతో ఆమె పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడికి లేఖ రాశారు. ఆయన స్పందించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో మినికాయ్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఆమె అగత్తికి, అక్కడి నుంచి విమానంలో ఢిల్లీ రాగలిగారు. ముద్రా యోజన లబ్ధిదారులతో కలిసి మోదీని కలిశారు. ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు అమీనా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



పవన్ హన్స్ హెలికాప్టర్ వద్ద అమీనా



గిరిజన విద్యార్థుల ప్రపంచ రికార్డు

» 21,850 మంది విద్యార్థులు, 108 సూర్య నమస్కారాలు

అరకులోయ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ఒకేసారి 21,850 మంది గిరిజన బాలబాలికలు 108 సూర్య నమస్కార ఆసనాలతో చరిత్ర సృష్టించారు. యోగ గురు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి జిల్లా అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ ప్రదర్శన అందరినీ అలరించింది. లండన్ నుంచి వచ్చిన ప్రపంచ రికార్డు యూనియన్ మేనేజర్ అలీస్ రేనాడ్ కార్యక్రమాన్ని పరిశీలించి ప్రపంచ రికార్డుగా నమోదు చేశారు. రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు అందజేశారు.

తెలంగాణవన్నీ అభూతకల్పనలే!

» బనకచర్ల ప్రాజెక్టు ఇంకా ఆలోచన దశలోనే ఉంది

» గోదావరి బోర్డు భేటీలో ఆంధ్రప్రదేశ్ స్పష్టీకరణ

» రోజుకు 2 టీఎంసీల చొప్పునే తీసుకుంటాం

» అది కూడా వంద రోజులే: ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు

అమరావతి/హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ చెబుతున్నవన్నీ అభూతకల్పనలేనని ఏపీ కొట్టివేసింది. ప్రాజెక్టు సమగ్ర నివేదిక(డీపీఆర్) ఇవ్వాలని కేంద్రం కోరినందున.. ఆ దిశగా కార్యాచరణకు సిద్ధమైనట్లు తెలిపింది. సోమవారం హైదరాబాద్ జలసౌధలో గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర ఈఎన్‌సీ-సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం సీఈ సుగుణాకరరావు, తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ అనిల్‌కుమార్ హాజరయ్యారు. బనకచర్ల ద్వారా రోజుకు 4 టీఎంసీల చొప్పున ఏపీ అక్రమంగా గోదావరి జలాలను తరలించుకుపోతోందన్న తెలంగాణ ఆరోపణలపై ఈఎన్‌సీ ఘాటుగానే స్పందించారు. ఈ ప్రాజెక్టు ఇంకా ఆలోచన దశలోనే ఉందని.. ప్రాథమిక దశలో ఉండగానే రోజుకు 4 టీఎంసీల చొప్పున ఎత్తిపోసేస్తున్నామంటూ పూర్తి అవాస్తవాలు, ఊహాజనితమైన ఫిర్యాదులు చేయడం ఏమిటని నిలదీశారు. ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు అవసరమైనందున.. కేంద్రం సహకారం కోరుతూ లేఖ రాశామని చెప్పారు. తాము తెలంగాణ తరహాలో తొమ్మిది ప్రాజెక్టులను బోర్డుల అనుమతి లేకుండా నిర్మించలేదన్నారు. దానిపై అప్పుడే ఫిర్యాదు చేయాల్సిందని రాహుల్ బొజ్జా వ్యాఖ్యానించగా.. ఫిర్యాదులు చేయడం తమకు అలవాటు లేదని.. ఏదైనా పూర్తిస్థాయి అనుమతులు తీసుకునే ప్రాజెక్టులు కడతామని వెంకటేశ్వరరావు బదులిచ్చారు. పైగా పోలవరం-బనకచర్ల పూర్తిగా తమ అంతర్గత ప్రాజెక్టు అని తేల్చిచెప్పారు. గోదావరిలో 320 టీఎంసీల వరద జలాలను వాడుకుంటామని 2018లోనే కేంద్రానికి, గోదావరి బోర్డుకు తెలియజేశామని, ఇప్పుడు కూడా 100 రోజుల పాటు రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీలను మాత్రమే పోలవరం నుంచి బనకచర్లకు తీసుకెళ్తామని చెప్పారు. చైర్మన్ ప్రధాన్ సమక్షంలోనే ఈఎన్‌సీ చెప్పడంతో.. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అభిప్రాయాలను బదలాయించుకుందామని రాహుల్ అన్నారు.

సభ్య కార్యదర్శి తీరుపై తీవ్ర అభ్యంతరం

గోదావరి బోర్డు సభ్యకార్యదర్శి అళగేషన్ వ్యవహార శైలిపై తెలుగు రాష్ట్రాల అధికారులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఆయన భాష, ఉద్యోగినుల పట్ల అనుచిత వైఖరిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకోవైపు.. గోదావరి బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులను జీఆర్ఎంబీకి అప్పగించేందుకు తెలుగు రాష్ట్రాలు నిరాకరించాయి. కాగా.. గోదావరిపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగు శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.92.50 కోట్లు ఖర్చవుతాయని, తాత్కాలిక మరమ్మతులకు రూ.15 కోట్లు అవసరమని తెలంగాణ తెలిపింది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు ప్రకారం నిధులు చెల్లించడానికి ఏపీ సుముఖత వ్యక్తం చేసింది.

తెలియదు.. గుర్తులేదు

» రఘురామ కేసులో డాక్టర్ ప్రభావతి జవాబులు

» ఒంగోలులో ప్రకాశం ఎస్పీ ఎదుట హాజరు



ఒంగోలు క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలియదు.. గుర్తులేదు అంటూ డాక్టర్ ప్రభావతి విచారణకు సహకరించకుండా దాటవేత ధోరణిని ప్రదర్శించినట్లు తెలిసింది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి సుప్రీంకోర్టు ఆదేశాలతో సోమవారం విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ఒంగోలులోని ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. రాత్రి 9 గంటల వరకు విచారణ సాగింది. రఘురామ శరీరంపై గాయాలకు సంబంధించి వైద్యులు ఇచ్చిన నివేదికలను ఎందుకు తారుమారు చేశారు.. మీపై ఎవరు ఒత్తిడి చేశారని ఎస్పీ దామోదర్ అడిగినట్లు తెలిసింది. మొత్తం 40 ప్రశ్నలు సంధించగా.. తెలియదు, గుర్తులేదంటూ దాటవేత ధోరణితో ఆమె జవాబులిచ్చినట్లు సమాచారం. మంగళవారం కూడా విచారణ కొనసాగనుంది.

మద్యం కేసులో మిథున్ రెడ్డికి ఊరట

» తదుపరి విచారణ వరకు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి తాత్కాలికంగా ఊరట లభించింది. మిథున్ రెడ్డి వాదనలు విన్న ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జరిగేంత వరకూ ఆయనను అరెస్టు చేయకూడదని ఆదేశించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పర్దీవాలా, జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీంతో మద్యం కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మిథున్ రెడ్డికి తాత్కాలిక రక్షణ కల్పించినట్లయింది. మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఈ నెల 3న హైకోర్టు తిరస్కరించింది. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, తాము ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదని హైకోర్టుకు సీఐడీ తెలిపినప్పటికీ, సీఐడీ తనను అరెస్టు చేసే అవకాశాలున్నాయంటూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మిథున్ రెడ్డి తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు.

కాకాణి అల్లుడూ డుమ్మా!

» పోలీసుల ముందుకురాని గోపాలకృష్ణారెడ్డి

» ఇప్పటికీ పత్తాలేని మాజీమంత్రి

నెల్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డే కాదు.. ఆయన అల్లుడు గోపాలకృష్ణారెడ్డి కూడా పోలీసుల ముందుకు రావడం లేదు. సోమవారంనాటి విచారణకు ఆయన డుమ్మా కొట్టారు. కాకాణి సన్నిహితుడైన కాంట్రాక్టర్ ఊరబిండి ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు చైతన్యలు కలిసి ఒక లాజిస్టిక్ కంపెనీని ప్రారంభించారు. ఆ కంపెనీ పేరుతో వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగ వద్ద 50 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా తీసుకున్నారు. ఈ భూమి కొనుగోలుకు అవసరమైన డబ్బు కాకాణి అల్లుడి నుంచే వచ్చిందన్నది అభియోగం. దీనికి బలం చేకూరుస్తూ ఈ లాజిస్టిక్ కంపెనీకు సీఈవోగా గోపాలకృష్ణారెడ్డి వచ్చి చేరారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురికీ పోలీసులు ఆదివారం నోటీసులిచ్చి.. సోమవారం విచారణకు రమ్మన్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో విచారణకు ప్రభాకర్‌రెడ్డి మాత్రమే హాజరయ్యారు. పోలీసులు గంటపాటు ఆయన్ను ప్రశ్నించి కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. తనకు ఆరోగ్యం బాగోలేదని, మరోరోజు విచారణకు వస్తానని చైతన్య పోలీసులకు తెలియజేయగా.. గోపాలకృష్ణారెడ్డి మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. ఇంకోవైపు.. అక్రమ మైనింగ్ కేసులో ఇప్పటికి 3 సార్లు పోలీసులు నోటీసులు జారీ చేసినా కాకాణి హాజరుకాలేదు. అసలు ఎక్కడున్నారో కూడా తెలియడం లేదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.